www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 143
బుధవారం | 20-8-2025 | వెల (Price) : Rs. 6.50
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి మ.1:59 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పునర్వసు రా.12:27 తదుపరి పుష్యమి; వర్జ్యం: మ.12:47-2:20; దుర్ముహూర్తం: ఉ.11:53-12:43; అమృతఘడియలు: రా.10:07-11:40; రాహుకాలం: మ.12:00-1:30; సూర్యోదయం: 6:02; సూర్యాస్తమయం: 6:34
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కాళేశ్వరం కమిషన్ నివేదిక అక్రమం




జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటే చట్టవిరుద్ధంగా జరిగింది
కమిషన్ మమ్మల్ని కేవలం సాక్షులుగా పిలిచి తప్పుదోవ పట్టించింది
చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదు.. పరువు నష్టం కలిగేలా నివేదిక
ప్రభుత్వ పెద్దలు ఈ నివేదికలోని అంశాలను దురుద్దేశంతో మీడియా సమావేశంలో వెల్లడించారు
స్థానిక సంస్థల ఎన్నికల్లో పైచేయి కోసం రాజకీయ నాటకాలు
నివేదికను కొట్టివేయండి.. హైకోర్టులో కేసీఆర్, హరీశ్ పిటిషన్లు

12



తెలుగువాడిని గెలిపించుకుందాం!

సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతిగా ఎన్నుకుందాం.. ఒకతాటిపైకి వచ్చి ఓటు వేద్దాం

రెండు రాష్ట్రాల 60 ఓట్లు ఆయనకే పడాలి
పార్టీలు వేరైనా నాడు పీవీ విషయంలో ఎన్టీఆర్ చూపిన చొరవను స్ఫూర్తిగా తీసుకోవాలి
సుదర్శన్‌రెడ్డి గెలిస్తే ప్రజాస్వామ్యం సురక్షితం
రాష్ట్రంలో కులగణన సర్వే అధ్యయనానికి నిపుణుల కమిటీ చైర్మన్‌గా సేవలందించారు
పార్టీ అధిష్ఠానం ఆదేశిస్తే సుదర్శన్‌రెడ్డికి మద్దతు కోసం కేసీఆర్‌ను కలుస్తా
ఆయన నా ముఖం చూస్తాడో.. లేదో..?
సుప్రీం తేల్చకుంటే పార్టీ పరంగా రిజర్వేషన్లు
మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఢిల్లీలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఇండియా కూటమి ఎంపీలు

హైదరాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం తెలుగువారికి దక్కిన గౌరవమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 42 మంది లోక్‌సభ, 18 మంది రాజ్యసభ సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి ఆయన్ను గెలిపించాలని కోరారు. సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సహా ఏ పార్టీతోనూ సంబంధం, అనుబంధం లేదని ప్రస్తావించారు. ఆయనకు ఏ పార్టీలోనూ సభ్యత్వమూ లేదని గుర్తు చేశారు. తెలుగు భాషను ప్రాచీన భాషగా గుర్తించేందుకు అందరమూ ఒకటైనట్లుగానే తెలుగువాడైన సుదర్శన్‌రెడ్డిని గెలిపించడానికి పార్టీలకు అతీతంగా అందరూ ఒక్కటి కావాలని పిలుపునిచ్చారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విజయం

మిగతా 13వ పేజీలో...

ఇండియా అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

ఉపరాష్ట్రపతి పదవికి సుప్రీం మాజీ జడ్జిని ఏకగ్రీవంగా ఖరారు చేసిన ప్రతిపక్ష కూటమి
రేవంత్, ఖర్గే మంతనాల్లో ఆయన పేరు
సుదర్శన్‌రెడ్డిని ఒప్పించింది రేవంత్‌రెడ్డే
పేరు చెప్పగానే కూటమి నేతలంతా ఆమోదం
ఖర్గే అభ్యర్థనపై ఢిల్లీకి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి
నేడు కూటమి నేతలతో పరిచయం
రేపు మధ్యాహ్నం అభ్యర్థిగా నామినేషన్

న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని నిలబెట్టాలని ఇండియా కూటమి ఏకగ్రీవంగా నిర్ణయించింది. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరును

మిగతా 13వ పేజీలో...



కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా తప్పుడు కేసులు పెట్టించి, విపక్ష ముఖ్యమంత్రులను జైలుపాలు చేసే కుట్రలో భాగంగానే ఈ బిల్లులు తెస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించడానికి సాధ్యం కాని విపక్ష సీఎంలను తొలగించి అక్కడ అధికారాన్ని చేజిక్కించుకొనే కుట్ర. - అభిషేక్ సింఘ్వి

సీఎం అయినా.. పీఎం అయినా.. అరెస్టయితే ఔట్

30 రోజులు జైల్లో ఉంటే పదవి ఊడినట్లే!.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రులకూ వర్తింపు
ఐదేళ్లు, ఆపై శిక్ష పడే క్రిమినల్ కేసుల్లోనే.. రాజ్యాంగ సవరణకు కేంద్రం సమాయత్తం
నేడు లోక్‌సభలో మూడు బిల్లులు ప్రవేశపెట్టనున్న షా.. అనంతరం పార్లమెంటరీ కమిటీకి
విపక్ష ప్రభుత్వాలను కూల్చే కుట్ర.. ఎన్డీఏ ముఖ్యమంత్రులను ముట్టుకోరు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ఐదు సంవత్సరాలు, అంతకు మించి శిక్షపడే అవకాశమున్న తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో అరెస్టయి 30 రోజులు జైల్లో ఉండే మంత్రులను 31వ రోజు పదవి నుంచి తొలగించే కీలక బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్రంలో ప్రధానమంత్రి సహా మంత్రులంతా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి సహా మంత్రులంతా ఈ బిల్లు పరిధిలోకి వస్తారు. మంత్రి మండలి ఉన్న కేంద్ర పాలిత ప్రాంతాలకూ వర్తించే విధంగా బిల్లును రూపొందించారు. నేరారోపణలతో అరెస్టయిన మంత్రులు రాజీనామా చేయాలని ఏ చట్టంలోనూ, రాజ్యాంగ నిబంధనల్లోనూ లేదు. కానీ, రాజీనామా చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ గత ఏడాది మద్యం కుంభకోణంలో అరెస్టయిన కేజ్రీవాల్ తొలిసారిగా ఈ సంప్రదాయాన్ని ఉల్లంఘించారు. జైలు నుంచే ప్రభుత్వ పాలన చేసేందుకు ప్రయత్నించి సుప్రీంకోర్టు చేతిలోనూ చీవాట్లు తిన్నారు. తమిళనాడులోనూ అరెస్టయిన మంత్రి సెంథిల్ బాలాజీ విషయంలో సుప్రీంకోర్టు చీవాట్లు వేయాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కావొద్దన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తాజా బిల్లును తీసుకొస్తోందని భావిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బుధవారం మూడు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెడతారు. అవి 1) నూటా ముప్పయవ రాజ్యాంగ సవరణ బిల్లు 2) కేంద్ర పాలిత ప్రాంతాల సవరణ బిల్లు 3) జమ్మూ కశ్మీరు పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు. మూడు బిల్లులూ అరెస్టయిన మంత్రులను తొలగించేందుకు ఉద్దేశించినవి. మొదటిది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినవి కాగా, రెండోది కేంద్ర పాలిత ప్రాంతాలది, మూడోది జమ్మూ కశ్మీరు ప్రభుత్వానికి సంబంధించినది. ఈ మూడు బిల్లులను పార్లమెంటు

మిగతా 2వ పేజీలో...



ఆరోగ్యశ్రీ గణాంకాల ఆధారంగా..
క్యాన్సర్ అట్లాస్ తయారుచేయాలి

ప్రతి ఒక్కరికీ 100 కి.మీ. పరిధిలోనే ప్రాథమిక క్యాన్సర్ కేర్ లభించేలా చర్యలు
చికిత్సకు రాష్ట్రం దాటొద్దే పరిస్థితి ఉండొద్దు
పిల్లల కోసం ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్
సర్కార్‌కు డా.నోరి దత్తాత్రేయుడు సూచనలు

9

6 వేల మంది విదేశీ విద్యార్థుల
వీసాలు రద్దు

ట్రంప్ సర్కారు తాజా నిర్ణయం
చట్టాల్ని ఉల్లంఘించారంటూ ఆరోపణ
పాలస్తీనాకు మద్దతు తెలిపినందుకు కూడా పలువురిపై వేటు

2

డీఎస్ఆర్ గ్రూపు సంస్థల్లో
ఐటీ సోదాలు

హైదరాబాద్, బెంగళూరులో ఏకకాలంలో..
మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి ఇంట్లో కూడా..
ఫ్లాట్ల అమ్మకాల్లో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో..

14

పత్తి దిగుమతిపై
సుంకం రద్దు!

2

2022లో పాడుగు పింజ పత్తిపై వేసిన 11% పన్ను సెప్టెంబరు 30 వరకు నిలుపుదల
వస్త్ర పరిశ్రమ విజ్ఞప్తి మేరకు కేంద్రం నిర్ణయం
ట్రంప్ 50% బాదుడుతో కుదేలైన పరిశ్రమ
సుంకాలపై అమెరికాతో చర్చలు తేలేవరకు పత్తిపై దిగుమతి పన్ను లేనట్లేనని అంచనా

యూరియా.. వరి మాయ

రాష్ట్రంలో వరిసాగు పెరగడంతోనే యూరియాకు కొరత

పత్తి, మొక్కజొన్న సాగు నుంచి మళ్లుతున్న రైతులు
యాంత్రీకరణతో వరిసాగులో తగ్గిన కూలీల పాత్ర
శ్రమ తక్కువ, ధాన్యం విక్రయాలూ సులభం
సన్నాలకు బోనస్ ఇవ్వడంతోనూ పెరిగిన ఆసక్తి
వరిసాగులో అవసరానికి మించి యూరియా వినియోగం
ఎరువులు నిల్వ చేసుకోవడమూ కొరతకు కారణం
జోరు వానలోనూ యూరియా కోసం రైతుల బారులు



మహబూబాబాద్ జిల్లా గూడూరులో యూరియా కోసం మహిళ రైతుల క్యూలైన్

మహబూబ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా మనవపాడు మండలం బోరవెల్లికి చెందిన ఎల్లారెడ్డి అనే రైతు యేటా మిర్చి సాగు చేస్తాడు. 15 ఎకరాల్లో తాను మిర్చి సాగు చేస్తానని.. సాగు మొదటి నుంచి చివరి దాకా ఎకరాకు 100 కిలోల చొప్పున యూరియా వినియోగిస్తానని చెప్పాడు. సాధారణ వినియోగం కన్నా ఎకరాకు 35 కిలోల చొప్పున ఎల్లారెడ్డి ఎక్కువగా చల్లుతున్నాడు. వాస్తవానికి పంటకు ఎకరాకు 65 కిలోల వరకు యూరియా సరిపోతుంది. మరో ఉదాహరణ.. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ

మిగతా 12వ పేజీలో...

తెలంగాణపై కేంద్రం వివక్ష

12

యూరియా ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న మోదీ సర్కారు
పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీల నిరసన
ధర్నాకు ప్రియాంకగాంధీ మద్దతు

2

భారత్‌కు అరుదైన ఖనిజాలు, ఎరువులు సరఫరా చేసేందుకు చైనా అంగీకారం



ఏడుపాయల ఆలయం వద్ద వరద ఉధృతి

గోదావరి, కృష్ణ.. ఉగ్రరూపం

మేడిగడ్డకు 6.65 లక్షల క్యూసెక్కులు
ఎస్సారెస్పీ 39 గేట్ల ద్వారా నీటి విడుదల
శ్రీశైలంకు 3.90 లక్షల క్యూసెక్కుల వరద
సాగర్ నుంచి 4 లక్షల క్యూసెక్కుల విడుదల
రాష్ట్రాన్ని వీడని వాన.. రాకపోకలకు బ్రేక్
భువనగిరిలో వాగులో చిక్కి ఇద్దరి మృతి
మహారాష్ట్రలో కొనసాగుతున్న వర్షబీభత్సం.. థానేలో 8 మంది మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎగువన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటకతో పాటు రాష్ట్రంలోనూ భారీ వర్షాలు పడుతుండడంతో గోదావరి, కృష్ణ నదులు ఉగ్రరూపం దాల్చాయి. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం 6.65లక్షల క్యూసెక్కులకు చేరింది. ములుగు జిల్లా వాజేడు మండలంలోని పేరూరు వద్ద గోదావరి నీటి మట్టం 16.10 మీటర్లకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మంగపేట మండలం

మిగతా 14వ పేజీలో...



ఆన్‌లైన్ బెట్టింగ్.. నేరం!

కేంద్రం కీలక నిర్ణయం.. బిల్లుకు క్యాబినెట్ ఓకే
నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం
బెట్టింగ్ సొమ్మును బ్యాంకులు బదిలీ చేయొద్దు
రియల్-మనీ గేమింగ్‌పై ప్రచారం నిషేధం
బిల్లులో పలు ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 19: విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటమాడుతున్న 'ఆన్‌లైన్ బెట్టింగ్'ను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిజిటల్ వేదికల ద్వారా నగదు పందాలను నేరంగా పరిగణిస్తూ 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను సిద్ధం చేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ బిల్లుకు ఆమోద ముద్ర పడింది. బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టవచ్చని సమాచారం. ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే అన్ని నగదు ఆధారిత గేమింగ్

మిగతా 2వ పేజీలో...

సింగరేణికి గోల్డెన్ చాన్స్





ఇకపై బంగారం, రాగి అన్వేషణ కూడా..

సంస్థ 136 ఏళ్ల చరిత్రలో తొలిసారి
వేలంలో కర్ణాటక దేవదుర్గ్ బ్లాక్ సొంతం
ఐదేళ్లపాటు గనుల కోసం అన్వేషణ
మైనింగ్‌లో దక్కనున్న 37.75% రాయల్టీ
సీఎం రేవంత్, భట్టి అభినందనలు
దేశంలో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్ష

హైదరాబాద్/గోదావరిఖని/కొత్తగూడెం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా బొగ్గు గనుల తవ్వకాలలో ఉన్న సింగరేణి సంస్థ.. ఖనిజాల వెలికితీత రంగంలోకి కూడా ప్రవేశించాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం కార్యరూపం దాల్చింది. కర్ణాటకలోని దేవదుర్గ్‌లో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ కోసం కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో.. 37.75% రాయల్టీని కోట్ చేయడం ద్వారా సింగరేణి ఎల్-1 బిడ్డర్‌గా నిలిచింది. ఈ వివరాలను సంస్థ సీఎండీ ఎన్ బలరాం వెల్లడించారు. సింగరేణిని ఇతర రంగాల్లోకి విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా చేస్తున్న ప్రయత్నంలో తొలి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో దేవదుర్గ్ గనుల్లో అన్వేషణను పూర్తి చేస్తామన్నారు. బొగ్గు మైనింగ్‌లో 136 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి సంస్థ తొలిసారిగా బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్సును దక్కించుకోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హర్షం ప్రకటించారు. ఖనిజాల అన్వేషణలోనూ సింగరేణి.. దేశంలో అగ్రగామి సంస్థగా నిలవాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు వేలంలో..

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 13వ తేదీన మొత్తం 13 కీలక ఖనిజాల అన్వేషణ లైసెన్స్‌ల కోసం వేలం ప్రక్రియను

మిగతా 13వ పేజీలో...

వినాయక విగ్రహాల తరలింపులో
విద్యుదాఘాతాలు!

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి
హైదరాబాద్, కామారెడ్డిలో ఘటనలు
గణేశ్ మండపం పనుల్లో ఉండగా షాక్
హైదరాబాద్‌లో మరో యువకుడి మరణం



రత్లావత్ ధోని



లక్ష్మీనారాయణ

మదీన/చాంద్రాయణగుట్ట, పాల్వంచ, సిరిసిల్ల క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నేపథ్యంలో మండపాల్లో ప్రతిష్ఠించేందుకు గణేశుడి భారీ విగ్రహాలు తీసుకువస్తూ విద్యుదాఘాతానికి గురై వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్, పాతబస్తీ బండ్లగూడ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో వికాస్ ఠాకూర్ (21), రత్లావత్ ధోని(20) అనే యువకులు మరణించారు. కామారెడ్డి జిల్లా ఆరేపల్లి శివారులో జరిగిన ప్రమాదంలో సిరిసిల్లకు చెందిన కొమ్ము లక్ష్మీనారాయణ(19) అనే యువకుడు మరణించాడు. బండ్లగూడ పోలీసుల

మిగతా 11వ పేజీలో...

మిస్ యూనివర్స్ ఇండియాగా మాణికా విశ్వకర్మ



జైపూర్, ఆగస్టు 19: మిస్ యూనివర్స్ ఇండియా-2025గా రాజస్థాన్‌లోని గంగానగర్ జిల్లా వాసి మాణికా విశ్వకర్మ (22) ఎన్నికయ్యారు. ఈ ఏడాది చివర్లో థాయిలాండ్‌లో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున ఆమె ప్రాతినిథ్యం వహిస్తారు. జైపూర్‌లోని జీ-స్టూడియోలో జరిగిన పోటీల్లో ఎంపికైన మాణికా విశ్వకర్మకు 2024 మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా మంగళవారం తెల్లవారుజామున కిరీట ధారణ చేశారు. తాను ఈ స్థాయికి చేరుకోవడానికి తన కుటుంబం/ సామాజిక వర్గం స్థిరమైన మద్దతే కారణమని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో మాణికా విశ్వకర్మ చెప్పారు. పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడం కంటే మహిళావిద్యకే తాను ఓటేస్తానన్నారు. ఈ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా మిస్ యూనివర్స్ ఇండియా సంస్థ యజమాని నిఖిల్ ఆనంద్, సినీ కథా నాయిక ఊర్వశీ రౌటేలా, అష్లేయ్ రొబెల్లొ, సినీ నిర్మాత ఫర్హాద్ సామ్జీ వ్యవహరించారు.

దేశద్రోహం కేసులో సీనియర్ జర్నలిస్టులు

» సిద్ధార్థ్, కరణ్ థాపర్‌కు గువాహటి పోలీసుల సమన్లు


కరణ్ థాపర్, సిద్ధార్థ్ వరదరాజన్

గువాహటీ, ఆగస్టు 19: దేశద్రోహం అభియోగాలతో నమోదు చేసిన కేసులో సీనియర్ జర్నలిస్టులు సిద్ధార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్‌లకు గువాహటీ పోలీసులు సమన్లు జారీ చేశారు. ఈనెల 22న గువాహటీలోని క్రైమ్ బ్రాంచ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ సమన్లు వరదరాజన్‌కు ఈనెల 14నే అందగా, కరణ్ థాపర్ సోమవారం అందుకున్నారు. బీఎన్ఎస్(భారతీయ న్యాయ సంహిత)లోని సెక్షన్లు 152, 196, 197(1)(డీ)/3(6), 353, 45, 61తో నమోదు చేసిన ఎఫ్ఐఆర్(03/2025)ను ప్రస్తావిస్తూ.. క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సౌమర్జ్యోతి రాయ్ తాజా సమన్లను జారీ చేశారు. 'విచారణకు హాజరు కాకుంటే మిమ్మల్ని అరెస్టు చేయాల్సి ఉంటుంది' అని స్పష్టం చేశారు. వీరిద్దరిపై దేశద్రోహం అభియోగాలను నమోదు చేయడంపై జర్నలిస్టు సంఘాలు విస్మయం వ్యక్తం చేశాయి. క్రైమ్ బ్రాంచ్ ద్వారా జర్నలిస్టులపై అసోం పోలీసులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ది ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా(పీసీఐ), ఇండియన్ ఉమెన్ ప్రెస్ కార్ప్స్ ఆరోపించాయి. కరణ్ థాపర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 'ది వైర్' న్యూస్ వెబ్‌సైట్‌పై 2నెలల వ్యవధిలోనే అసోం పోలీసులు రెండు కేసులు నమోదు చేశారని పేర్కొన్నాయి.

6వేల మంది విద్యార్థి వీసాలు రద్దు

» అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయం

వాషింగ్టన్, ఆగస్టు 19: అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థులపై ట్రంప్ సర్కారు కొరడా ఝుళిపిస్తోంది. చట్టాలను ఉల్లంఘించడంతో పాటు దేశంలో అనధికారికంగా ఎక్కువ కాలం నివసించడం తదితర కారణాలతో ఆ దేశ విదేశాంగ శాఖ 6 వేల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థి వీసాలను రద్దు చేసింది. వీరిలో ఎక్కువ శాతం మంది దాడులు, దోపిడీలకు పాల్పడటం, డ్రగ్స్, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, ఉగ్రవాదానికి మద్దతు పలకడం వంటి ఉల్లంఘనలకు పాల్పడినట్లు బీబీసీ కథనం పేర్కొంది. వీసాలు రద్దయిన 6వేల మందిలో 4వేల మంది చట్టాలను ఉల్లంఘించారని, మరో 200 నుంచి 300 మంది వరకూ ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్లు వివరించింది. ఉగ్రవాదానికి మద్దతు పలకడం అంటే ఏమిటో విదేశాంగ శాఖ స్పష్టత ఇవ్వనప్పటికీ పాలస్తీనాకు మద్దతుగా నిరసనలు తెలిపిన విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఓపెన్ డోర్స్ సంస్థ నివేదిక ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంలో 210కి పైగా దేశాల నుంచి 11లక్షల మందికి పైగా విదేశీ విద్యార్థులు అమెరికాలోని కాలేజీల్లో చేరారు.

రాయల్ నేవీలో తొలిసారిగా హిందూ పూజారి

» హిమాచల్ ప్రదేశ్‌వాసికి అవకాశం



లండన్, ఆగస్టు 19: బ్రిటన్‌లోని రాయల్ నేవీలో తొలిసారిగా హిందూ పూజారి నియమితులయ్యారు. నేవీ అధికారులకు హిందూ ఆధ్యాత్మిక విషయాలను బోధించడానికి బ్రిటన్‌లో నివసిస్తున్న హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన భాను అత్రీకి ఈ అవకాశం లభించింది. రాయల్ నేవీలోని తొలి క్రైస్తవేతర పూజారి ఈయనే కావడం విశేషం. ఈ పదవిలో నియమించే ముందు ఆయనకు కఠినమైన మిలటరీ శిక్షణ ఇచ్చారు. యుద్ధనౌక హెచ్ఎంఎస్ ఐరన్ డ్యూక్‌లో మూడు వారాల పాటు సముద్రంలో శిక్షణ పొందారు.

సీఎం అయినా, పీఎం అయినా

అరెస్టయితే ఔట్!



(మొదటి పేజీ తరువాయి)

సంయుక్త కమిటీ పరిశీలనకు పంపాలని అమిత్ షా తీర్మానాన్ని కూడా పెడతారు. ఈ బిల్లుల ప్రకారం వరుసగా 30 రోజులపాటు జైల్లో ఉన్న మంత్రి రాజీనామా చేయకపోతే 31వ రోజు ఆటోమాటిక్‌గా అతని పదవి రద్దవుతుంది. అయితే, ఆ నేరం ఐదు సంవత్సరాలు, అంతకు మించి శిక్షపడే అర్హత ఉన్న నేరమై ఉండాలి. ఏకంగా ప్రధానమంత్రి పదవిని కూడా చేయబోయే చట్టం పరిధిలోకి తీసుకురావడం చర్చనీయాంశం అయ్యింది.

విపక్షాలను బలహీనం చేసే కుట్ర: కాంగ్రెస్

ప్రభుత్వం ప్రకటించిన మూడు బిల్లులను తప్పుడు కేసుల ద్వారా ముఖ్యమంత్రులను తొలగించి, విపక్షాలను బలహీనం చేసే కుట్రతో రూపొందించారని కాంగ్రెస్ ఆరోపించింది. కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా తప్పుడు కేసులు పెట్టించి, విపక్ష ముఖ్యమంత్రులను జైలుపాలు చేసే కుట్రలో భాగంగా ఈ బిల్లులు తెస్తున్నారని మండిపడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించలేని పరిస్థితుల్లో విపక్ష ముఖ్యమంత్రులను తొలగించడం ద్వారా అక్కడ అధికారాన్ని చేజిక్కించుకొనే కుట్ర చేయడమే ఈ బిల్లుల ఉద్దేశమని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ అన్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ ముఖ్యమంత్రిని ఒక్కరిని కూడా ముట్టుకోరని వ్యాఖ్యానించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఆయన ట్వీట్ చేశారు. రాహుల్‌గాంధీ ఓట్ అధికార యాత్ర నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ బిల్లులను తీసుకొస్తున్నారని అన్నారు.

రూ.62వేల కోట్లతో 97 యుద్ధ విమానాలు

» కొనుగోలుకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 19: దేశంలో తయారయ్యే తేలికపాటి యుద్ధ విమానా (లైట్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్-ఎల్‌సీఏ)లు కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూ.62వేల కోట్ల వ్యయంతో ఎల్‌సీఏ మార్క్ 1ఏ తరహాకు చెందిన 97 యుద్ధ విమానాలు కొనుగోలు చేయాలని మంగళవారం ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయించారు. ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) వీటిని రూపొందించనుంది. ఇంతకుముందు రూ.40వేల కోట్ల వ్యయంతో 83 ఎల్ఏసీ మార్క్ 1ఏ యుద్ధ విమానాలు కొనుగోలుకు ఆర్డర్ పెట్టింది. ఇది రెండో ఆర్డర్ కావడం గమనార్హం. మిగ్-21 యుద్ధ విమానాలకు బదులుగా భారత వాయుసేన వీటిని ఉపయోగించనుంది.

భారత్‌కు 50 మంది వ్యోమగాములు అవసరం

శుభాన్షు శుక్లాతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 19 : అంతరిక్ష పరిశోధనా రంగంలో భవిష్యత్తులో చేపట్టబోయే ప్రయోగాల కోసం 40 నుంచి 50 మంది వ్యోమగాములతో కూడిన బృందాన్ని భారత్ సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు వెళ్లొచ్చిన తొలి భారతీయుడు శుభాన్షు శుక్లా ప్రధాని మోదీని సోమవారం స్వయంగా కలిశారు. ఐఎస్ఎస్ యాత్రలో తనకు ఎదురైన అనుభవాలను శుభాన్షు ప్రధానితో పంచుకున్నారు. భారత్ చేపట్టనున్న భారతీయ అంతరిక్ష్ స్టేషన్, గగన్‌యాన్ ప్రయోగాలకు శుభాన్షు అనుభవం ఉపకరిస్తుందని మోదీ పేర్కొన్నారు.

లోకం తీరు




రాధాకృష్ణన్‌ను సన్మానిస్తున్న ప్రధాని మోదీ

రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొందాం

» విపక్షాలకు విజ్ఞప్తి చేసిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ఉపరాష్ట్రపతి పదవికి రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని బలపరచాలని విపక్షాలను ప్రధాని మోదీ కోరారు. ప్రజాసేవలో సుదీర్ఘకాలం కొనసాగుతున్న ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకొందామని విజ్ఞప్తిచేశారు. ఎన్డీయే కూటమి ఎంపీలతో మంగళవారం ప్రధాని సమావేశమయ్యారు. రాధాకృష్ణన్‌ను ఎంపీలకు పరిచయం చేశారు. ఈ భేటీ వివరాలను పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. సింధూ జలాల విషయంలో తొలిప్రధాని నెహ్రూ వ్యవహరించిన తీరును ఈ సమావేశంలో మోదీ తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. నెహ్రూ దేశాన్ని రెండుసార్లు విభజించారని విమర్శించారు. పార్లమెంటు ఆమోదం లేకుండానే పాక్‌తో సింధూజలాల ఒప్పందాన్ని కుదుర్చుకుని ఆయన సంతకాలు చేశారని విమర్శించారు. తన వ్యక్తిగత ప్రతిష్ఠను పెంచుకోవడం కోసం దేశ ప్రయోజనాలను నెహ్రూ తాకట్టుపెట్టారని ఆరోపించారు. ఈ ఒప్పందం కారణంగా సింధూజలాల్లో 80 శాతం హక్కు పాకిస్థాన్‌కు పోయిందన్నారు. అందువల్ల ఇది రైతు వ్యతిరేక ఒప్పందమని, విలువైన జలాలు మన రైతులకు అందకుండాపోయాయని ఆయన తెలిపారు.

బిహార్లో ఒక్క ఓటూ తస్కరించనివ్వం

» ఓట్ల చోరీలో ఈసీ-బీజేపీ భాగస్వామ్యం

» 'ఓటర్ అధికార యాత్ర'లో రాహుల్

నవాడా, ఆగస్టు 19: ఓట్ల దొంగతనంలో ఎన్నికల కమిషన్ (ఈసీ), బీజేపీ భాగస్వాములని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపించారు. ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా బిహార్లో ఒక్క ఓటును కూడా తస్కరించనివ్వబోమని స్పష్టంచేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహులే ప్రధానమంత్రి అవుతారని ఆర్జేడీ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ అన్నారు. 'ఓటర్ అధికార యాత్ర'లో మూడోరోజు మంగళవారం వారు నవాడాలో జరిగిన ర్యాలీలో ప్రసంగించారు. 'ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఎన్నికల కమిషనర్లు ఓటు హక్కును ప్రజల నుంచి లాక్కుంటున్నారు. హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ ఎన్నికలను ఇలాగే దొంగిలించారు. మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నడుమ మేజిక్ చేసి కోటి మంది కొత్త ఓటర్లను చేర్చారు. మెషీన్‌లో చదవగలిగే ఓటర్ల జాబితాలను మాకివ్వాలని ఈసీని మేం కోరాం. కానీ కమిషన్ దానితోపాటు సీసీటీవీ ఫుటేజ్ ఇవ్వడానికీ నిరాకరించింది. ఇప్పుడు బిహార్లో కొత్త తరహాలో మీ కళ్ల ముందే ఓట్ల చోరీ చేస్తున్నారు. కానీ, బిహార్‌లో ఒక్క ఓటును కూడా దొంగిలించనివ్వం' అని రాహుల్ స్పష్టంచేశారు. ఇప్పుడు మీ ఓట్లు తీసేస్తారు.. తర్వాత రేషన్ కార్డులు తొలగిస్తారు.. అనంతరం మీ భూములు లాక్కుంటారు.. వాటిని అదానీ, అంబానీలకు ఇస్తారని ఆరోపించారు. తప్పుడు చట్టాలు, జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు ఇవన్నీ వారికి మేలు చేయడానికేనని తెలిపారు. అంతకుముందు ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓ వ్యక్తిని రాహుల్ పిలిచి మాట్లాడించారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను పోలింగ్ ఏజెంటుగా ఉన్నానని.. ఎస్ఐఆర్‌లో తన పేరు తొలగించారని అతడు చెప్పాడు. బిహార్లో ఇలాంటివారు లక్షల మంది ఉన్నారని.. వారి ఓట్లను జాబితాల నుంచి తొలగించారని రాహుల్ అన్నారు. ఇదిలా ఉండగా, వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దామని తేజస్వి యాదవ్ ఈ ర్యాలీలో పిలుపిచ్చారు. ఆయన కారణంగానే ప్రధాని మోదీ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారని చెప్పారు.

ఓట్లు ఉన్నా లేవని చెప్పించారు: నడ్డా

తన కుటుంబంలోని ఆరుగురు ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారంటూ యాత్రలో రాహుల్, తేజస్వి సమక్షంలో చెప్పిన మహిళ.. ఆ తర్వాత అదేమీ లేదని స్పష్టంచేసింది. తనకు చదువు లేదని.. తన కుటుంబ సభ్యుల ఓట్లను తీసివేసినట్లు చెప్పాలని కొందరు చెప్పడంతో.. అదే చెప్పానని.. జాబితాల్లో తమ పేర్లు ఉన్నాయని తెలిపింది. ఆమె వీడియోను కేంద్ర మంత్రి నడ్డా 'ఎక్స్'లో షేర్ చేశారు. 'నా అబద్ధం బయటపడినా నేను అక్కడే ఉన్నాను. వాస్తవం బహిర్గతమైంది. నేను జోకర్‌గా మారాను. అయినా అక్కడే నిలబడి ఉన్నాను' అనే చరణాలున్న పాటను కూడా జతచేసి రాహుల్‌ను ఎద్దేవాచేశారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌ను తిరస్కరిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై జోక్యం చేసుకొనేందుకు నిరాకరించింది. 2024లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ చేతన్ అహిరే అనే విక్రోలికి చెందిన ఓటర్ పిటిషన్ వేశారు.

ఇక రైళ్లల్లోనూ లగేజీపై నియంత్రణ

» రూల్స్‌ను కఠినతరం చేసేందుకు సిద్ధమైన రైల్వే

న్యూఢిల్లీ, ఆగస్టు 19: విమానాల్లో వెళ్లేటప్పుడు లగేజీ నిర్ణీత బరువుకు మించితే అదనపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. చాలామందికి తెలియని విషయమేంటంటే.. రైళ్లలో మనం తీసుకెళ్లగలిగే సామాను బరువు మీద కూడా అలాంటి నియంత్రణలే ఉన్నాయి. ఇకపై ఆ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని రైల్వే శాఖ ఒక నిర్ణయానికి వచ్చింది. దాని ప్రకారం.. ప్రస్తుతానికి కొన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు తమ లగేజీ బరువును ఎలక్ట్రానిక్ తూకాలపై తూయించుకోవాల్సి ఉంటుంది. పరిమితికి మించి బరువు ఉంటే.. దానిపై అదనపు రుసుము లేదా జరిమానా విధిస్తారు. ఏసీ మొదటితరగతి ప్రయాణికులైతే.. ఒక్కొక్కరూ 70 కిలోల దాకా బరువున్న లగేజీని తీసుకెళ్లొచ్చు. దీనిపై మార్జినల్ అలవెన్స్.. 15 కిలోలు. అంటే 85 కిలోల దాకా అదనపు రుసుము లేకుండా తీసుకెళ్లే వీలుంది. అదనపు రుసుముతో 150 కిలోల దాకా తీసుకెళ్లొచ్చు. ఏసీ రెండో తరగతి ప్రయాణికులు 60 కిలోలు, అదనపు రుసుముతో 100 కిలోల దాకా తీసుకెళ్లొచ్చు. ఏసీ మూడో తరగతి, స్లీపర్ క్లాస్ ప్రయాణికులు 50 కిలోల దాకా లగేజీని తీసుకెళ్లే వీలుంది. అదనపు రుసుముతో 80 కిలోల దాకా తీసుకెళ్లొచ్చు. జనరల్ ప్రయాణికులు 45 కిలోల దాకా బరువున్న సామాను తీసుకెళ్లొచ్చు. అదనపు రుసుముతో 70 కిలోల దాకా తీసుకెళ్లొచ్చు. ప్రస్తుతానికి ఈ నిర్ణయాన్ని జాతీయ రాజధాని ప్రాంత జోన్‌లోని ప్రయాగరాజ్ జంక్షన్, ప్రయాగరాజ్ ఛివ్‌కి, సుబేదార్ గంజ్, కాన్పూర్ సెంట్రల్, మీర్జాపూర్, టుండ్లా, అలీగఢ్ జంక్షన్, గోవింద్‌పురి, ఇటావా స్టేషన్లలో అమలు చేయనున్నారు.

భారత్‌కు అరుదైన ఖనిజాలు, ఎరువులు

» టన్నెల్ నిర్మాణ యంత్రాలు కూడా..

» సరఫరా చేసేందుకు చైనా ఓకే

» ప్రధాని మోదీ, అజిత్ దోవల్‌తో చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ భేటీ

» ఈ నెల 31న చైనా వెళ్లనున్న మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 19: బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో కీలకమైన అరుదైన ఖనిజాలను, కీలకమైన ఎరువులను భారత్‌కు సరఫరా చేసేందుకు చైనా ముందుకొచ్చింది. చైనా కంపెనీలు అరుదైన ఖనిజాలు, ఎరువులు, టన్నెల్ బోరింగ్ యంత్రాలను భారత్‌కు ఎగుమతి చేయడంపై ఉన్న నియంత్రణలను సడలించేందుకు అంగీకరించింది. ఢిల్లీలో విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమైన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఈ మేరకు హామీ ఇచ్చినట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. రెండు రోజుల పర్యటన కోసం ఢిల్లీ వచ్చిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ మంగళవారం ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో వేర్వేరుగా భేటీ అయ్యారు. చైనా, భారత్ మధ్య గల్వాన్ ఘటన అనంతర ఉద్రిక్తతలను తగ్గించడం, ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం పునరుద్ధరణతోపాటు అమెరికా సుంకాల ప్రభావంపై వారు చర్చలు జరిపినట్టు తెలిసింది. ముఖ్యంగా సరిహద్దుల వద్ద ఉద్రిక్తతల తగ్గింపు కోసం చేపట్టిన 'ప్రత్యేక ప్రతినిధుల (స్పెషల్ రిప్రజెంటేటివ్స్) చర్చల' ప్రక్రియలో భాగంగా దోవల్‌తో వాంగ్‌యీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య సరిహద్దులు ప్రశాంతంగా ఉన్నాయని, సంబంధాలు మెరుగుపడుతున్నాయని ఈ సందర్భంగా దోవల్ పేర్కొన్నారు. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ ఆగస్టు 31న చైనా వెళ్లనున్నారని తెలిపారు.

పత్తి దిగుమతిపై సుంకం రద్దు!

» వస్త్ర పరిశ్రమ విజ్ఞప్తికి కేంద్రం ఓకే

న్యూఢిల్లీ, ఆగస్టు 19: అమెరికా సుంకాల దెబ్బకు కకావికలమైన భారతీయ వస్త్ర పరిశ్రమను కాపాడేందుకు కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. పొడుగు పింజ పత్తిపై 2022లో విధించిన 11% దిగుమతి సుంకాన్ని సెప్టెంబరు 30వరకు నిలిపేసింది. భారత వస్త్ర పరిశ్రమల సమాఖ్య చేసిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం వెలువడింది. మూడేళ్ల క్రితం తన ఆదాయాన్ని పెంచుకొనేందుకు, దేశీయంగా పొడుగు పింజ పత్తిని ప్రోత్సహించేందుకు కేంద్రం ఈ సుంకాన్ని విధించింది. ఇప్పుడు అమెరికాతో సుంకాల వివాదాన్ని పరిష్కరించుకొనే ప్రయత్నాలు కొలిక్కిరాని నేపథ్యంలో దేశీయ వస్త్ర వ్యాపారాన్ని కాపాడుకొనే ప్రయత్నంలో భాగంగా దాన్ని తాత్కాలికంగా నిలిపేసింది. దీనివల్ల ఆస్ట్రేలియా, అమెరికా పత్తి రైతులకు ఊరట లభించనుంది. ఇది భారతీయ వస్త్ర వ్యాపారులకు కూడా శుభవార్తే. వారికి తక్కువ ధరకు నాణ్యమైన అమెరికా పొడుగు పింజ పత్తి లభించనుంది. తక్కువ ధరకు నాణ్యమైన వస్త్రాలు ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది.

ఆన్‌లైన్ బెట్టింగ్.. నేరం!

(మొదటి పేజీ తరువాయి)

లావాదేవీలపై నిషేధం అమలులోకి వస్తుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. చట్టాన్ని ఉల్లంఘించే వారికి ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపాయి. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల తరఫున ఎవరైనా ప్రచారం చేస్తే జరిమానా విధించేందుకు కూడా ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. అంతేకాకుండా.. రియల్ మనీ ఆన్‌లైన్ గేమ్స్‌కు సంబంధించిన సొమ్మును బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు బదిలీ చేయకూడదన్న నిబంధనను ఈ బిల్లులో పొందుపరిచారు. దీని ప్రకారం రియల్-మనీ ఆన్‌లైన్ గేమింగ్‌పై ప్రచారం చేయడం పూర్తిగా నిషిద్ధం. నమోదు కాని గేమింగ్ ప్లాట్‌ఫాంలపైనా కఠిన చర్యలను ప్రతిపాదించారు. గతంలోనే ఆన్‌లైన్ గేమింగ్‌పై దృష్టి పెట్టిన కేంద్రం... 2023 అక్టోబరులోనే ఆ ప్లాట్‌ఫాంలపై 28 శాతం వస్తు సేవ పన్ను (జీఎస్టీ) విధించింది. ఆన్‌లైన్ గేమ్స్‌లో గెలుచుకున్న సొమ్ముపై 2024-25 నుంచి 30 శాతం పన్ను వసూలు చేస్తోంది. విదేశీ ఆన్‌లైన్ గేమింగ్ ఆపరేటర్లను కూడా మన దేశ పన్ను పరిధిలోకి తెచ్చింది. 2022 నుంచి ఇప్పటి వరకు 1,400కు పైగా బెట్టింగ్ వెబ్‌సైట్లను, ప్లాట్‌ఫాంలను స్తంభింపజేసింది. పిల్లల్లో ఆన్‌లైన్ గేమింగ్ ఒక వ్యసనంగా మారి.. వారి జీవితాలను ప్రమాదంలో పడేస్తున్న నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ ఇప్పటికే తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. కాగా, 'బెట్టింగ్, గ్యాంబ్లింగ్' నియంత్రణ అంశం రాష్ట్రాల జాబితాలో ఉంది. రియల్-మనీ గేమింగ్‌పై ఉక్కుపాదం మోపడంతో పాటు దేశమంతా ఒకే తరహా నిబంధనలతో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అడ్డుకట్ట వేయవచ్చని కేంద్రం భావిస్తోంది.

మహారాష్ట్రలో వర్ష బీభత్సం

» థానేలో 8మంది మృతి

» ముంబైలో మంగళవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 30సెం.మీ వాన

» 250కి పైగా విమానాలపై ప్రభావం



భారీ వర్షాలతో ముంబైలో మోనో రైలు మధ్యలోనే ఆగిపోయింది. ఆ సమయంలో అందులో దాదాపు 500మంది ప్రయాణికులు ఉన్నారు. కరెంటు సరఫరాలో సమస్యతోనే రైలు నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. మైసూరు కాలనీ, భక్తి పార్క్ స్టేషన్ల మధ్య సాయంత్రం 6.15గంటలకు రైలు ఆగిపోయింది. ప్రయాణికులు రెండు గంటల పాటు అందులోనే ఉండిపోయారు. అధికారులు కిటికీలు పగులగొట్టి క్రేన్లు, నిచ్చెనల సాయంతో వారిని కిందికి దింపారు.

ముంబై, ఆగస్టు 19: మహారాష్ట్రలో వర్ష బీభత్సం కొనసాగుతోంది. భారీ వర్షాల కారణంగా నాందేడ్ జిల్లాలో 8మంది చనిపోయారు. ముంబైలో మంగళవారం రికార్డు స్థాయిలో 30సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెగని వర్షాలతో ముంబైలో అన్ని రకాల ప్రయాణ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. ముంబై ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లే (లేదా) ఎయిర్‌పోర్టుకు వచ్చే దాదాపు 250విమాన సర్వీసులపై ఈ ప్రభావం పడింది. ఎనిమిది విమానాలను దారి మళ్లించాల్సి వచ్చింది. విమాన సర్వీసులు సగటున 45నిమిషాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముంబైలో మిఠీ నది ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో ఐదు వందల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఛత్రపతి శివాజీ టెర్మినస్ నుంచి కుర్లా రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై 8అంగుళాల ఎత్తులో నీరు నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో రైలు సర్వీసులను నిలిపివేశారు. ముంబైలో ఆగస్టులో కురిసే మొత్తం సగటు వర్షపాతంలో దాదాపు సగం వాన ఈ రెండు రోజుల్లోనే కురిసిందని అధికారులు వెల్లడించారు. స్కూళ్లకు ఇప్పటికే సెలవులు ప్రకటించారు. బాంబే హైకోర్టు కూడా బుధవారం మధ్యాహ్నం 12.30గంటల వరకే పని చేసింది. వర్షాలతో మహారాష్ట్రలో 10లక్షల ఎకరాల పంట నీట మునిగింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ(ఐఎండీ) కొంకణ్ తీరంలోని ముంబై, థానే, రాయగఢ్, రత్నగిరి, పాల్ఘడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. బుధవారం ఈ జిల్లాల్లో అతి భారీవర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

'వారంలో 90గంటలు పని' వ్యాఖ్యలు

నా భార్యకు కూడా నచ్చలేదు!

» ఎల్‌అండ్‌టీ సీఎండీ సుబ్రమణ్యన్ వివరణ



న్యూఢిల్లీ, ఆగస్టు 19: ఆదివారాలతో కలిపి వారంలో 90 గంటల పాటు పని చేయాలంటూ గతంలో తాను చేసిన వ్యాఖ్యలు తన భార్యకు కూడా నచ్చలేదని ఎల్‌అండ్‌టీ కంపెనీ సీఎండీ ఎస్ ఎన్ సుబ్రమణ్యన్ తెలిపారు. ప్రాజెక్టుల్లో చోటు చేసుకుంటున్న జాప్యం, తమ వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలోనే తాను ఒత్తిడికి గురై, అప్పట్లో ఆ వ్యాఖ్యలు చేశానన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు తాను యథాలాపంగా ఆ జవాబు ఇచ్చానని, ఆ మాటలు రికార్డవుతున్నాయని తనకు తెలియదన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో 'సిందూర్'

న్యూఢిల్లీ, ఆగస్టు 19: ఉగ్రవాదంపై యుద్ధం చేసిన ఆపరేషన్ సిందూర్‌ను ఎన్‌సీఈఆర్‌టీ తాజా పుస్తకాల్లో పాఠాలుగా పొందుపరిచింది. రెండు అనుబంధ పుస్తకాలను రూపొందించి 3 నుంచి 12 తరగతుల విద్యార్థులకు పాఠాలుగా నిర్ణయించింది. దీనిని కేవలం ఉగ్రవాదానికి సైన్యం స్పందనగా మాత్రమే చూడకుండా, శాంతి పరిరక్షణ కోసం చేసే ప్రతిజ్ఞగా పాఠాలు రూపొందించింది. పహల్గాంలో జరిగిన దాడిలో బాధితులైన వారికి గౌరవం కలిగించేలా చూడడం కూడా మరో ఆశయం. పాకిస్థాన్ మిలటరీ, రాజకీయ నాయకత్వం ప్రత్యక్షంగా ఇచ్చిన ఆదేశాల మేరకే పహల్గాం దాడులు జరిగినట్లు పాఠాల్లో పేర్కొంది.

ఆపరేషన్ సిందూర్‌తో సత్తా చాటాం

- డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రక్షణ శాఖ సలహాదారు సతీష్‌రెడ్డి
- కేయూలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీ ప్రారంభం

హనుమకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన సత్తా చాటామని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. భారత్ ఉపయోగించిన అత్యాధునిక సాంకేతికతను చూసి ప్రపంచం నివ్వెరపోయిందన్నారు. మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలను సతీశ్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇజ్రాయెల్ ఐరన్ డోమ్‌ను మించిన సాంకేతికతను సిందూర్‌లో మనం దేశం ఉపయోగించిందన్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో మన దేశం స్వయం సమృద్ధిని సాధించిందని తెలిపారు. గతేడాది రూ.24 వేల కోట్ల ఉత్పత్తులను ఎగుమతి చేయగా ఈ సంవత్సరం అది రూ.50 వేల కోట్లకు పెరగనుందని చెప్పారు. మన దేశంలో యూనివర్సిటీల ద్వారా 4.3 కోట్ల మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని వెల్లడించారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇంత మంది లేరని చెప్పారు. గతంకన్నా భిన్నంగా ఇప్పుడు ఎక్కువ మంది విద్యార్థులు పరిశోధనల వైపు మొగ్గు చూపుతున్నారని.. పరిశోధనా పత్రాలను ప్రచురించడం, పీహెచ్‌డీలు పొందడంలో మన దేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందని పేర్కొన్నారు. దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో చోటు చేసుకుంటున్న విప్లవాత్మకమైన మార్పునకు ఇది నిదర్శనమన్నారు. 2016లో దేశంలో 456 స్టార్టప్‌లు ఉండగా ప్రస్తుతం 1.57 లక్షల స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో ప్రపంచంలో నైపుణ్యం కలిగిన యువతలో 40 శాతం మంది మన దేశం వారే ఉంటారని అన్నారు. వికసిత్ భారత్-2047తో శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం మరింత అభివృద్ధిని సాధిస్తోందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మోహన్‌రావు, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సత్యనారాయణ తదితరులతో పాటు 650 మంది ప్రతినిధులు ఈ ప్లీనరీకి హాజరయ్యారు.



మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

అప్పులు తీర్చలేక ఇద్దరు రైతుల ఆత్మహత్య

- జనగామ, భూపాలపల్లి జిల్లాల్లో ఘటనలు

పాలకుర్తి, కాటారం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలు దిగుబడి రాకపోవడం, భారీ వర్షాలకు పాడైపోవడంతో మనస్తాపానికి గురైన ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం సిరిసన్నగూడెం శివారు కంబాలకుంట తండాకు చెందిన బానోతు బీక్యా (57) రెండెకరాల్లో ఎకరం పత్తి, ఎకరం మిర్చి సాగు చేశాడు. మిర్చి పంటకు దిగుబడి రాక పోవడంతో తెచ్చిన రూ.4 లక్షల అప్పులు తీర్చే మార్గం లేక ఈ నెల 13న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అలాగే, భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుసాపూర్‌కు చెందిన రైతు బొల్లి బాపు (38), దేవక్క దంపతులు తమకున్న ఎకరం భూమిలో వ్యవసాయం చేసుకుంటూనే కూలి పనులు చేసుకుంటూ ముగ్గురు పిల్లలను చదివించుకుంటున్నారు. ఈ ఏడాది బాపు ఎకరం చేనులో పత్తి సాగు చేయగా, భారీ వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో అప్పటి నుంచి అప్పులు ఎలా తీర్చాలన్న మనోవ్యథతో బాధపడుతున్నాడు. ఈ తరుణంలో సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.



భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, సీతక్క నుంచి పురస్కారాలను అందుకుంటున్న అధికారులు శైలజ రామయ్యర్, వెంకట్‌రావు

ఎనర్జీ ఆడిట్‌లో తొలి ఆలయం 'గుట్ట'!

- నాలుగు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ పురస్కారాలు
- పత్రాలు అందుకున్న దేవాదాయ అధికారులు

హైదరాబాద్, యాదగిరిగుట్ట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి నాలుగు ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ పురస్కారాలు లభించాయి. దేశంలోనే ఎనర్జీఆడిట్ నిర్వహించిన మొట్ట మొదటి ఆలయంగా గుట్ట రికార్డు సొంతం చేసుకుంది. స్వామివారి అన్న, ప్రసాదాల్లో అత్యున్నత ప్రమాణాలు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, సంతృప్తికరమైన దైవదర్శనం తదితర అంశాలకు ఈ నాలుగు అవార్డులు లభించాయి. గత రెండు నెలలుగా హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ఆధ్వర్యంలో ఐఎస్‌ఓ ఇన్‌స్పెక్షన్ సర్టిఫికేషన్, ఆడిట్‌ను గుట్టలో విజయవంతంగా నిర్వహించారు. కాగా ఈ ఐఎస్‌ఓ సర్టిఫికెట్లను సచివాలయంలో మంగళవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, సీఎస్ రామకృష్ణా రావు సమక్షంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్, యాదగిరిగుట్ట కార్యనిర్వహణాధికారి వెంకట్ రావులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ బాధ్యులు ఆలపాటి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

28 రోజుల్లో రూ.2.35 కోట్ల హుండీ ఆదాయం

యాదగిరిగుట్ట ఆలయ ఖజానాకు 28 రోజుల్లో రూ.2.35 కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం కొండకింద వ్రత మండపంలో లెక్కించారు. జూలై 22 నుంచి ఈ నెల 18 వరకు కానుకల రూపంలో రూ.2,35,32,627 నగదుతోపాటు 76గ్రాముల మిశ్రమ బంగారం, 9.475 కిలోల మిశ్రమ వెండి సమకూరింది.

సీబీఎస్‌ఈ పాఠంగా బంజారా యువకుడి ఆంగ్ల కవిత

- ఎనిమిదో తరగతి ఆంగ్లం పుస్తకంలో రమేష్ కార్తీక్ నాయక్ కవితకు స్థానం

జక్రాన్‌పల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం వివేక్ నగర్ తండాకు చెందిన రమేష్ కార్తీక్ నాయక్ రాసిన ఆంగ్ల కవిత సీబీఎస్‌ఈ పాఠమైంది. చక్‌మక్ (చెకుముకి రాయి) పేరిట రమేష్ కార్తీక్ రాసిన ఆంగ్ల కవిత సంపుటిలోని 'ది రోస్ ల్యాండ్' కవితను ఎనిమిదో తరగతి ఆంగ్లం పుస్తకంలో పాఠ్యాంశంగా సీబీఎస్‌ఈ చేర్చింది. ఈ మేరకు సీబీఎస్‌ఈ ఓ ప్రకటన చేసింది. బంజారా తెగకు చెందిన తల్లీకొడుకుల జీవన ప్రయాణం ఇతివృత్తంగా ది రోస్ ల్యాండ్ కవిత సాగుతుంది. ఈ కవితలో తల్లి చెప్పినా వినకుండా ఓ రోజు వారు పనిచేసే గులాబీ తోటకు బాలుడు బయలుదేరుతాడు. ఆ బాలుడి ప్రయాణం ప్రకృతితో ముడిపడిన గత, వర్తమాన అనుభూతిని పంచుతుంది. కాగా, రమేష్ రచించిన లైఫ్ ఆన్ పేపర్ కవితను విజయనగర శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం పాఠ్యాంశంగా ఎంచుకుంది. ఇదే కవిత రమేష్ కార్తీక్‌కు 'ది మ్యూస్ ఇండియా యంగ్ రైటర్' అవార్డును తెచ్చిపెట్టింది. బంజారా యువ రచయిత రమేష్ కార్తీక్ రాసిన ధవలో గోర్ (స్త్రీశోకం) కథా సంపుటితో 2024లో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని కూడా అందుకున్నారు.



రచయిత రమేష్ కార్తీక్ నాయక్

హైదరాబాద్‌లో ట్రూత్ ల్యాబ్స్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ యూనిట్

బంజారాహిల్స్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఫర్టిలిటీ కేంద్రాల్లో మోసాల నేపథ్యంలో ట్రూత్ ల్యాబ్స్ ఫోరెన్సిక్ సంస్థ హైదరాబాద్‌లో డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ యూనిట్ (డీఎన్ఏ పరీక్షల కేంద్రం)ను ప్రారంభించింది. హైదరాబాద్‌కు చెందిన నాన్ ప్రాఫిట్ ఫోరెన్సిక్ సంస్థ జీనోమ్ ఫౌండేషన్‌తో కలిసి దీన్ని బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ట్రూత్ ల్యాబ్స్ చైర్మన్ గాంధీ పీసీ ఖాజా మంగళవారం మీడియాతో మాట్లాడారు. డీఎన్ఏ పరీక్షలకు ట్రూత్ ల్యాబ్స్ భారత్‌లోనే మొట్టమొదటి ఐఎస్‌వో సర్టిఫైడ్ సంస్థ అన్నారు. సరగసీ పేరుతో నవజాత శిశువుల అక్రమ రవాణా సమస్య పరిష్కారానికి డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ దోహదపడుతుందని చెప్పారు. ఐవీఎఫ్, సరగసీ తదితర విధానాల్లో తల్లిదండ్రులైన వారి పిల్లల జన్యువులను గుర్తించి, నిర్ధారించేందుకు ఇది అవసరమన్నారు. సమావేశంలో జీనోమ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కనక భూషణం తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మూత్ర విసర్జన.. విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సూర్యాపేటక్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చిరుజల్లులు కురుస్తున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మూత్రవిసర్జన చేస్తూ విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం సూర్యాపేటలో జరిగింది. సూర్యాపేట పట్టణం నల్లాలబావి సెంటర్‌లో నివాసం ఉంటున్న దంతాల చక్రధర్‌రావు (56) ప్రైవేటు లెక్చరర్‌గా పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నారు. మంగళవారం వ్యక్తిగత పని నిమిత్తం బయటకు వచ్చిన ఆయన వాణిజ్యభవన్ పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మూత్ర విసర్జన చేస్తుండగా విద్యుదాఘానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఆ సమయంలో చిరుజల్లులు కురుస్తున్నాయని స్థానికులు చెప్పారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం సశేషం

అటు రష్యా అధ్యక్షుడు, ఇటు అమెరికా అధ్యక్షుడు భారీ భద్రత మధ్య ఆర్భాటంగా తరలివెళ్ళిన అలాస్కా సమావేశం హిట్టయిందా లేదా అన్నది వేరే సంగతి, కానీ, వీరిద్దరి కలయికే చూడముచ్చటైన దృశ్యం. వందలేళ్ళక్రితం రష్యా చక్రవర్తుల నుంచి అమెరికా చవుకగా కొనేసిన అలస్కాను ఎంపిక చేయడంలో ట్రంప్ తెలివి తేటలున్నాయో, ఏ దేశమేగినా అరెస్టయ్యే ప్రమాదం ఉన్న పుతిన్ తనదేశ సరిహద్దులకు దూరంగా పోదల్చుకోక అలాస్కా కోసం ఒత్తిడిచేశారో తెలియదు. పుతిన్‌కు ట్రంప్ ఎర్రతివాచీ పరిచినా, అమెరికాకు చెందిన నాలుగు ఎఫ్–35 విమానాలు, ఒక బీటూ బాంబర్ రష్యా అధ్యక్షుడి దిశగా ఎగురుతున్న ఆ దృశ్యాలు ఎన్నటికీ మరిచిపోలేనివి. ఓ నాలుగు విమానం బొమ్మలతో సాక్షాత్తూ రష్యా అధ్యక్షుడినే బెదిరించి దారికి తెచ్చుకోగలవా ట్రంప్ అంటూ సామాజిక మాధ్యమాల్లో ఎగతాళి చేసినవారికి, ఈ విమానవిన్యాసాల్లో ముఖస్తుతి ఉన్నది తప్ప, బెదిరింపులు లేవని తెలియకపోదు.

దీనికి కొనసాగింపుగా, మరో దృశ్యం కూడా ప్రపంచం చూసింది. మొన్న ఫిబ్రవరిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని బయటకు గెంటేసిన అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు ఆలింగనాల స్థాయిలో ఎక్కడ లేని ఆప్యాయతలూ కనబరిచారు. ఆర్నెల్ల క్రితం జెలెన్‌స్కీ దుస్తులు పరమచెత్తగా ఉన్నాయని మొఖం మీదే చెప్పేసిన అమెరికా పాత్రికేయుడికి కూడా ఇప్పుడు ఉక్రెయిన్ అధ్యక్షుడూ, ఆయన సూటూ తెగ నచ్చేశాయి. అవును, నాకూ అలాగే అనిపించింది, నేనూ అదే చెప్పాను అన్నారు ట్రంప్ ఆనందంగా. జెలెన్‌స్కీకి దక్కిన స్వాగత సత్కారాలు, మర్యాదలు, భేటీలో పూచిన నవ్వులపువ్వులు చూసిన వారికి అప్పట్లో అమెరికా అధ్యక్షుడు ఇదే వ్యక్తిని ఛీత్కరించి బయటకు పంపేసిన దృశ్యాలు గుర్తుకు రాకతప్పవు. మహాబలుడైన పుతిన్ ముందు నువ్వెంత, నీకున్న ఆయుధ బలమెంత అంటూ అవమానించి, కయ్యానికి కాలుదువ్వింది నువ్వేనంటూ అచ్చం పుతిన్ పరిభాషలో చెడామడా ఏకేయడం విస్మరించలేనివి. ఆ తరువాత ఉక్రెయిన్ అధ్యక్షుడు ఖరీదైన కప్పం సమర్పించుకోవడానికి సిద్ధపడిన ప్రభావం కూడా ఇప్పుడు కనిపిస్తున్న మార్పుకు ఒక కారణం కావచ్చు.

పుతిన్‌తో భేటీ తరువాత, జెలెన్‌స్కీ మీద అమెరికా అధ్యక్షుడికి ఇలా ఎక్కడలేని ప్రేమాభిమానాలు పొంగుకొచ్చే ప్రమాదం ఉన్నదని తెలుసు కాబట్టే, ఏడు యూరప్ దేశాల నాయకులూ వెంట పరిగెత్తు కొచ్చారు. జెలెన్‌స్కీ మీద ఒత్తిడితెచ్చి పుతిన్ కోరుతున్న ఉక్రెయిన్ భూభాగాలను ట్రంప్ ఎక్కడ ధార పోస్తాడోనని వీరి అనుమానం. వీరితో కరచాలనాలు, ఫోటోసెషన్లు, ఇతరత్రా మర్యాదలకు లోటేమీ చేయలేదు కానీ, పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడటానికి వీరందరినీ నలభైనిముషాలపాటు ట్రంప్ నిరీక్షణలో ఉంచారని మాత్రం వార్తలు వచ్చాయి. మళ్ళీ కలుద్దాం అంటూ, ఈమారు మాస్కోలో అని పుతిన్ అలాస్కాలోనే ట్రంప్‌తో ఓ మాట న్నారు. మాస్కోలో భేటీకి జెలెన్‌స్కీ అంగీకరించడని అమెరికా, రష్యా అధ్యక్షులకు తెలియదనుకోలేం. పుతిన్ రమ్మనడం, జెలెన్‌స్కీ సహా ఆయన పక్షాన ఉన్నవాళ్ళంతా దానిని కాదనడం జరిగిపోయాయి. ఏదో ఒకరోజు, అందరికీ అంగీకారమైన చోట పుతిన్–జెలెన్‌స్కీ కలిసి కూర్చొని మాట్లాడుకుంటారని ట్రంప్ నమ్ముతున్నప్పటికీ, అది ఇప్పట్లో సాధ్యపడకపోవచ్చును. కాల్పుల విరమణ తరువాతే ఇటువంటి భేటీలకు సార్థకత ఉంటుందని యూరప్ నాయకుల వాదన. భూదానం సహా తన డిమాండ్లన్నింటికీ ఒప్పుకుంటే నేరుగా శాంతి ఒప్పందం మీదే సంతకాలు చేసుకోవచ్చునన్న పుతిన్ ప్రతిపాదన ట్రంప్‌కు కూడా ఇంపుగా ఉంది. కాల్పుల విరమణకు ఒప్పుకోని పక్షంలో పుతిన్ చాలా పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అలాస్కా బయలుదేరే ముందు హెచ్చరించిన ట్రంప్, వెనక్కు వచ్చిన తరువాత పుతిన్ పక్షానే మాట్లాడుతున్నట్టు యూరప్ దేశాధినేతలకు అనిపిస్తోంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడానికి ట్రంప్ అదే పనిగా కష్టపడుతున్నారు. అధికారంలోకి రాగానే ఆప్తమిత్రుడు పుతిన్‌కు ఓ మాటచెబితే యుద్ధం ఆగిపోతుందనుకున్నారు ఆయన. అది జరగకపోగా, ఆయుధాలకు, ఆంక్షలకు, హెచ్చరికలకూ కూడా బెదరకపోవడంతో మిత్రదేశాలమీద ఆర్థిక ఒత్తిడి పెంచి రష్యాను దారికి తెచ్చే ప్రయత్నం సాగిస్తున్నారు. యుద్ధం ఆపడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నప్పటికీ, పుతిన్ ఆవహించి ఉన్నంతకాలం అది సాధ్య పడదని యూరప్ దేశాధినేతల నమ్మకం.

మిర్యాలగూడ రైస్ మిల్లుల్లో, హైదరాబాద్ భవన నిర్మాణ రంగంలో పనిచేసే బిహారీ కూలీలు ఓటు వేయడానికి తమ స్వంత రాష్ట్రానికి వెళ్ళకపోవచ్చు. అదే విధంగా బెంగళూరు లేదా దుబాయిలో పనిచేసే తెలుగు ప్రవాసులు తమ స్వస్థలాలకు రాకపోవచ్చు. అంత మాత్రాన ఆ శ్రమ జీవుల ఓటు హక్కును తీసివేయడం సమంజసం కాదు.

వలస కార్మికుల ఓటుహక్కు ప్రాముఖ్యత

బిహార్‌లో నిర్వహిస్తోన్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఆ ఒక్క రాష్ట్రానికే పరిమితం కాదు. సమీప భవిష్యత్తులోనే దేశవ్యాప్తంగా జరగనున్న ఈ సవరణ ప్రక్రియ, తమ తమ మాతృస్థలాలను వీడి ఉపాధికై వలసబాట పట్టిన లక్షలాది భారతీయులపై తప్పక ప్రభావం చూపుతుంది.

అశేష ప్రశ్నలకు తావిచ్చిన బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో తమ ఓటు హక్కును కోల్పోయిన వారిలో అత్యధికులు జీవనోపాధికై ఇతర ప్రాంతాలకు వెళ్ళినవారే. స్వరాష్ట్రంలో ఆర్థికాభివృద్ధికి అవకాశాలు అరకొరగా ఉండడం అనివార్యంగా ఉపాధి వలసలకు దారితీస్తోంది. ఇలా బతుకుతెరువు అన్వేషించు కుంటూ వెళ్లేవారు పేదలు, నిరక్షరాస్యులే అన్నది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. కోవిడ్ సంక్షోభ కాలంలో ప్రత్యేకంగా నడిపిన రైళ్ళ ద్వారా తమ స్వస్థలాలకు తిరిగి వచ్చిన వారి నుంచి మాత్రమే దేశంలో వలస కార్మికుల వివరాలు (అత్యంత స్వల్పంగానే అయినప్పటికీ) అధికారవర్గాలకు తెలిశాయి. ఇంతకు మించి, ఆ వలస పక్షుల గురించి మరే సమాచారం లేదు. ఈ పరిస్థితుల దృష్ట్యా వలస కార్మికులను గుర్తించి ఒక అంచనాకు రావడం ఏమంత సులువు కాదు.

గల్ఫ్ లేఖ

పేదవాడికి మిగిలి ఉన్న ఏకైక ఆస్తి ఓటు హక్కు. అయితే అది కూడా ఇప్పుడు ప్రశ్నార్థకమవుతోంది. మర ణించిన లేదా శాశ్వతంగా స్వస్థలాన్ని వదిలి వెళ్ళిపోయిన వారు లేదా చొరబాటుదారులు ఓటర్లుగా ఉండకూడదు. ఈ విషయంలో ఎవరికీ మరో అభిప్రాయం లేదు. కన్న ఊరులో బతుకు భారం కావడంతో తాత్కాలికంగా పరాయి ప్రదేశానికి పొట్టకూటికై వెళ్ళిన వారి ఓటు హక్కును తొలగించడం న్యాయమేనా? బతకడానికి బయటకు వెళ్ళినవారిని ఏ విధంగా, ఏ ప్రాతిపదికన గుర్తించాలో చట్టబద్ధమైన నిర్దిష్ట మార్గదర్శకాలు లేవు. 'ప్రజా ప్రాతినిధ్య చట్టం–1950' లోని నిబంధన 20లో 'సాధారణ నివాసి' (ఆర్డినరీ రెసిడెంట్) నిర్వచనం సైతం స్పష్టంగా లేదు.



ఉపాధి వలసల విషయానికి వస్తే, బిహార్ రాష్ట్రంలో ముఖ్యంగా అంతర్జాతీయ వలసలలో అగ్రగామిగా ఉన్న జిల్లా గోపాల్ గంజ్. తాజాగా అత్యధిక ఓటర్లు గల్లంతయింది కూడా ఈ జిల్లాలోనే కావడం గమనార్హం. మూడు లక్షల పది వేలకు పైగా ఓట్లను తొలగించడంతో జిల్లాలో ఓట్ల సంఖ్య 15 శాతం తగ్గింది. రాష్ట్రీయ జనతా దళ్ అగ్రనాయకుడు లాలూప్రసాద్ యాదవ్ స్వంత జిల్లా అయిన గోపాల్‌గంజ్‌లో ఆరుగురు శాసనసభ్యులు ఉన్నారు. మూడు ప్రధాన పార్టీలు రాష్ట్రీయ జనతాదళ్, భారతీయ జనతా పార్టీ, జనతాదళ్ (యు) పక్షాన ఇద్దరు చొప్పున సమాన ప్రాతినిధ్యం కలిగి ఉన్నాయి. గల్ఫ్ దేశాలలో పనిచేసే బిహారీ ప్రవాసులలో అత్యధికులు గోపాల్ గంజ్ జిల్లావారే. ఎడారి వలసల విషయానికి వస్తే తెలుగునాట తూర్పు గోదావరి లేదా నిజామాబాద్ తరహాలో గోపాల్ గంజ్ కూడా ప్రభావిత జిల్లా. గోపాల్ గంజ్‌తో పాటు బిహార్‌లోని ఇతర జిల్లాల్లో కూడా దేశంలోని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే కార్మికులు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. ఈ కారణాన రానున్న శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 'పలయన్ రోకో నౌక్రీ దో' (వలసలు ఆపండి, ఉద్యోగం ఇవ్వండి) అనే నినాదాన్ని కాంగ్రెస్ పార్టీ ఇవ్వగా వలస వెళ్ళిన బిహారీలను జనతాదళ్ (యు) బిహార్ దివస్ ఉత్సవాలలో భాగంగా ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ వలస కార్మికుల సమస్యల పరిష్కారానికై ధర్నా చేశారు.

మిర్యాలగూడ రైస్ మిల్లుల్లో, హైదరాబాద్ భవన నిర్మాణ రంగంలో పనిచేసే బిహారీ కూలీలు ఓటు వేయడానికి తమ స్వంత రాష్ట్రానికి వెళ్ళకపోవచ్చు. అదే విధంగా బెంగళూరు లేదా దుబాయిలో పనిచేసే తెలుగు ప్రవాసులు తమ స్వస్థలాలకు రాకపోవచ్చు. అంత మాత్రాన ఆ శ్రమ జీవుల ఓటు హక్కును తీసివేయడం సమంజసం కాదు.

దురదృష్టవశాత్తు భారతావనిలో నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితుల కారణంగా సాధారణ చర్యలు కూడా అసాధా రణంగా పరిగణితమవుతున్నాయి. ఇందుకు సహేతుక కారణాలు ఉన్నాయి. ప్రజా జీవితంతో ముడివడి ఉన్న అంశాలలో సంస్కరణల అవసరముంది. అయితే అందుకు ముందుగా, ఇప్పటి వరకు వాటితో ఎదురవుతున్న దుష్పరిణామాల విషయమై విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రతిపాదిత సంస్కరణల ఆశ్యకతను వివరించడం పాలకుల విజ్ఞతాయుత కర్తవ్యం. ఇంతకంటే ముఖ్యం నిబద్ధత, నిజాయితీ. ఇవి లేకపోవడంతోనే అసలు సమస్య.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

సైద్ధాంతిక పోరులో న్యాయకోవిదుడు



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'గోవా తొలి లోకాయుక్తగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని నియమించాలనుకుంటున్నాను' అని 2013లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ పరిక్కర్ అధికారులకు, పాలక పార్టీ నేతలకు చెప్పినప్పుడు వారు ఆశ్చర్యపోయారు. 'అదేమిటి సార్, ఆయన ఆలోచనా విధానానికీ మన ఆలోచనా విధానానికీ ఏ మాత్రం సరిపడదు. ఆయన బీజేపీ భావజాలం అంటే ఇష్టపడరు. పైగా స్వతంత్రంగా ఆలోచిస్తారు' అని పార్టీ నేత ఒకరు అభ్యంతరం వ్యక్తం చేశారు. 'లోకాయుక్త పదవిలో అలా స్వతంత్రంగా ఆలోచించేవారే కావాలి. నిక్కచ్చిగా, నిజాయితీగా వ్యవహరించేవారే ఆ పదవిని సరిగా నిర్వహించగలరు. అలాంటి పదవుల్లో ఉన్నవారు సిద్ధాంతాలకు అతీతంగా ఉండాలి. నేను ఎంతో మంది న్యాయమూర్తుల పేర్లను, వారి నేపథ్యాన్ని పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయానికి వచ్చాను' అని మనోహర్ పరిక్కర్ జవాబిచ్చారు. ఆ తర్వాత ఆయన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఫోన్ చేశారు. 'మిమ్మల్ని లోకాయుక్తగా నియమించాలనుకుంటున్నాను. దయచేసి ఆ పదవి స్వీకరించండి' అని అభ్యర్థించారు. తన ఆలోచనా విధానం వేరని, తాను స్వతంత్రంగా వ్యవహరిస్తా నని సుదర్శన్‌రెడ్డి చెప్పినా పరిక్కర్ వినలేదు. 'అవన్నీ నాకు తెలుసు..' అని ఆయన చెప్పారు. దీనితో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గోవా లోకాయుక్త చట్టం ప్రతినొకదాన్ని తెప్పించుకుని అధ్యయనం చేశారు. అందులో ఎన్నో లోపాలున్నాయని, ముఖ్యంగా ఈ చట్టం ప్రకారం ముఖ్యమంత్రిని విచారించే అధికారం లోకాయుక్తకు లేదని తెలుసుకున్నారు. ఆ చట్టాన్ని సవరిస్తేనే లోకాయుక్త పదవిని ఆమోదిస్తానని చెప్పారు. అందుకు పరిక్కర్ ఆమోదించడమే కాక ముఖ్యమంత్రిని కూడా దాని పరిధిలో చేర్చడంతో ఇక కాదనలేక జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆ పదవిని స్వీకరించారు. తన సిబ్బందిని తానే నియమించుకుంటానని చెప్పినా పరిక్కర్ అంగీకరించారు. లోకాయుక్త పదవి స్వీకరించిన తర్వాత ఆయన మొదట మనోహర్ పరిక్కర్‌పై వచ్చిన ఆరోపణలనే విచారణకు స్వీకరించి సీఎంను తన కార్యాలయానికి పిలిపించారు. పరిక్కర్ ఏ మాత్రం సంకోచించకుండా ఎటువంటి మందీ మార్బలం లేకుండా వచ్చి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్ల లోకాయుక్త పదవిలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎక్కువ కాలం ఉండలేదు. అయితే తాము నియమించిన వారందరూ తమకు జీ హుజూర్‌గా ఉండాలని భావించే నేటి రాజకీయ నాయకుల్లో ఎందరు మనోహర్ పరిక్కర్ లాగా ఉంటారు? ఎందరు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి లాగా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు?

ఉప రాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి ప్రకటించింది. ఇవాళ ఒక చారిత్రక నేపథ్యంలో జరుగుతున్న ఎన్నిక ఇది. కొద్ది రోజుల క్రితం వరకు ఉప రాష్ట్రపతిగా ఉన్న జగదీప్ దన్‌ఖడ్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే రాజీనామా చేశారు. ఈ హఠాత్పరిణామం, ఇప్పటి వరకూ ఒక రాజ్యాంగ హోదాగా భావిస్తున్న ఉప రాష్ట్రపతి పదవి విలువపై చర్చకు దారితీసింది. మరో రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్ పనితీరుపై దాదాపు నెలరోజులుగా వర్షాకాల సమావేశాలు స్తంభించి పోయాయి. ప్రజల ఓట్లనే కొల్లగొడుతున్నారంటూ ప్రతిపక్షాలు వీధి ఆందోళనలకు దిగాయి. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీకి నిలబెట్టేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఎంపిక చేసింది. అయితే నెగ్గుకు రాగలదని చెప్పలేం. గెలుపోటములతో నిమిత్తం లేకుండా ఈ పోటీని సంకేతాత్మక సైద్ధాంతిక పోరుగా మార్చేందుకు, తమ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తమ నిర్ణయం దోహదపడుతుందని ఆ కూటమి నేతలు భావిస్తున్నట్లు కనపడుతోంది.

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గతంలో ఉపరాష్ట్రపతి పదవి నిర్వ హించిన మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హిదయతుల్లా బాటలో నడిచిన న్యాయకోవిదుడు. గోలక్‌నాథ్ కేసులో అప్పటి సీజే కోకా సుబ్బారావుకు బాసటగా నిలిచి ప్రాథమిక హక్కులను పార్లమెంట్ సవరించడానికి వీల్లేదని జస్టిస్ హిదయతుల్లా స్పష్టంగా చెప్పారు. పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించినా సరే, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను కుదించే హక్కు దానికి లేదని, ఎందుకంటే పార్లమెంటు కూడా రాజ్యాంగం ప్రకారం ఏర్పడినదేనని చెప్పిన న్యాయమూర్తి జస్టిస్ హిదయతుల్లా. ఆయన నిర్వహించిన ఉపరాష్ట్రపతి పదవికి దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని పోటీ చేయించేందుకు ఇండియా కూటమి నిర్ణయించడం విశేషం. ఎందుకంటే సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న నాలుగున్నరేళ్ల కాలంలో అప్పటి యూపీఏ ప్రభుత్వ నిర్ణయాలు చాలా వాటిని తప్పుపట్టారు. 'సహజవాయువు ప్రజలకు చెందుతుంది. దాన్ని వెలికితీసే కాంట్రాక్టర్ రిలయన్స్ కావచ్చు కాని దాని ధర ప్రభుత్వం నిర్ణయించాల్సిందే'నని విస్పష్టంగా తీర్పు చెప్పిన బెంచ్‌లో ఆయన ఉన్నారు. విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న నల్లధనాన్ని తిరిగి రప్పించడంలో విఫలమైన ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక నేరస్థులపై ప్రభుత్వం మెతకగా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. వారిపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను నియమించాలని ఆదేశించారు. 'ద కేసెస్ దట్ ఇండియా ఫర్ గాట్' (భారతదేశం మరిచిపోయిన కేసులు) అన్న పుస్తకంలో ప్రముఖ రాజ్యాంగ నిపుణుడు చింతన్ చంద్రచూడ్ ప్రస్తావించిన పది ముఖ్యమైన తీర్పుల్లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఇచ్చిన తీర్పు కూడా ఉన్నది. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లను ఆదివాసీలతోనే తుదముట్టించేందుకు ఏర్పర్చిన సల్వాజుడుంను రాజ్యాంగ వ్యతిరేకమని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సంచలన తీర్పు ఇచ్చారు. సామాన్యులను, ముఖ్యంగా చదువు రాని అమాయక ఆదివాసీ యువతను హింసాకాండకు పాల్పడేందుకు ప్రోత్సహించకూడదని, ఇలాంటి అనైతిక మార్గాలను రాజ్యాంగ విలువలు అనుమతించబోవని ఆయన విస్పష్టీకరించారు. నిజానికి పీయూసీఎల్ లాంటి పౌర హక్కుల సంస్థలో ఉన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఈ కేసును విచారించకూడదని ఒక అజ్ఞాత లేఖ వచ్చినప్పటికీ ఇరు పక్షాల న్యాయవాదులు ఆయన ఈ కేసును విచారించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రకటించడం విశేషం. 45వ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా అభిశంసనకు ఏడు ప్రతిపక్షాలు సమర్పించిన పిటిషన్‌పై రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్న నాటి ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు నిర్ణయం తీసుకునేముందు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి న్యాయసలహాను తీసుకున్నారు. ఇప్పుడు అదే ఉపరాష్ట్రపతి పదవికి సుదర్శన్‌రెడ్డి పోటీలో ఉండడం యాదృచ్ఛికం.



ఎన్నికల కమిషన్ పనితీరుపై వర్షాకాల సమావేశాలు స్తంభించిపోయాయి. ప్రజల ఓట్లనే కొల్లగొడుతున్నారంటూ ప్రతిపక్షాలు ఆందోళనలకు దిగాయి. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీకి నిలబెట్టేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఎంపిక చేసింది. గెలుపోటములతో నిమిత్తం లేకుండా తమ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ నిర్ణయం దోహదం చేయగలదని ప్రతిపక్ష నేతలు భావిస్తున్నారు.

జగదీప్ దన్‌ఖడ్ స్థానంలో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి పదవికి నరేంద్రమోదీ ప్రభుత్వం ఎంపిక చేయడంలో ఆశ్చర్యం లేదు. మామూలుగా అయితే వాజపేయి – అద్వానీ తరానికి చెందిన వారందరినీ తప్పించి తన టీమ్ వ్యక్తిని నియమించుకోవడం మోదీకి పరిపాటి. అయితే ఇటీవలి కాలంలో కీలకమైన పదవుల్లో ఆరెస్సెస్ నేపథ్యం ఉన్నవారిని నియమించి ఆ సంస్థను సంతృప్తిపరిచే ప్రయత్నాలను మోదీ చేయడం మారుతున్న పరిస్థితులకు నిదర్శనం. 'బీజేపీకి ఆ అండదండలు అవసరం లేదు' అని పార్టీ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా గత ఏడాది అన్నప్పుడున్న పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులకూ తేడా కనిపిస్తోంది.

రాధాకృష్ణన్ సామాన్య వ్యక్తి కాదు. ఆయన 16 సంవత్సరాల చిరుప్రాయంలోనే ఆర్ఎస్ఎస్‌కు అంకితమయ్యారు. 'సంఘ్' తిరుప్పూర్ టౌన్ సంఘ చాలక్‌గా తర్వాత జిల్లా సంఘ్ చాలక్‌గా పనిచేసిన తర్వాత 1974లో ఎమర్జెన్సీకి ముందు జనసంఘ్‌లో చేరారు. 1980లో భారతీయ జనతా పార్టీ ఏర్పడ్డప్పుడు రాధాకృష్ణన్ అటల్ బిహారీ వాజపేయికి సహాయ కుడుగా ఉన్నారు. బీజేపీ భావజాలానికి ఆయన నిబద్ధత తిరుగులేనిది. తమిళనాడులో 19 వేల కిలోమీటర్ల పాటు యాత్ర చేసి తమిళనాడులో బీజేపీ అంటే రాధాకృష్ణన్ అనేంతగా కృషి చేశారు. 1998లో రాధాకృష్ణన్ పోటీ చేసిన కోయంబత్తూర్ నియోజకవర్గంలో ప్రచారం చేసేందుకు బీజేపీ నేత లాల్ కృష్ణ అద్వాణీ వచ్చినప్పుడే ఆయన పాల్గొనాల్సిన ఎన్నికల సభలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ బాంబులు పేలి 85 మంది మరణించారు. ఒక పత్రికా విలేఖరికి ఇంటర్వ్యూ ఇవ్వడం వల్ల అద్వాణీ కోయంబత్తూర్‌కు ఆలస్యంగా వచ్చారు. ఆయనను రిసీవ్ చేసుకునేందుకు రాధాకృష్ణన్ విమానాశ్ర యానికి వచ్చారు. వారిద్దరూ సకాలంలో సభకు చేరుకుని ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. సంఘ్‌ను రాధాకృష్ణన్ కోయంబత్తూర్‌లో బలోపేతం చేసినందుకే తీవ్రవాదులు ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నారనేది స్పష్టమయింది. ఆ ఎన్నికల్లో కోయంబత్తూర్‌లో హిందూ ఓట్లు సంఘటితమై రాధాకృష్ణన్ అఖండ మెజారిటీతో గెలిచారు.

రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడమే కాదు, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కూడా మోదీ తన ప్రసంగంలో ఆర్ఎస్ఎస్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని, ఆ రాజ్యాంగాన్ని రూపొందించడంలో నెహ్రూ, పటేల్ లాంటి నేతల మేధస్సును ప్రశంసించడంతో తన ప్రసంగాన్ని మొదలు పెట్టిన మోదీ తర్వాత రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను కీర్తించారు. గతంలో వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు కూడా ఆర్ఎస్ఎస్‌ను తన ఆత్మగా అభివర్ణించినప్పటికీ ఎర్రకోటపై ఎప్పుడూ ఆ సంస్థను కొనియాడలేదు. ఆర్ఎస్ఎస్‌ను అతి పెద్ద ప్రభుత్వేతర సంస్థ(ఎన్జీవో)గా మోదీ అభివర్ణించడం ఆశ్చర్య కరం. మోదీ అభిప్రాయం ఎలా ఉన్నా, ఎన్జీవోగా మాత్రమే ఉండేందుకే సంఘ్ ఇష్టపడుతుందా అన్నది ప్రధానం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఉద్యమ సాహిత్యానికి జీవగర్ర

తెలుగు సాహిత్యంలో ఉద్యమ సాహిత్యానికి ప్రత్యేక స్థానం కల్పించిన ప్రముఖ పరిశోధకుడు, రచయిత డా. కె. ముత్యం మన మధ్య నుంచి భౌతికంగా దూరమై నేటికి సంవత్సర కాలం. నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజా చైతన్యాన్ని రచనల ద్వారా వెలుగులోకి తెచ్చిన మహానుభావుడు. ఆయన జీవితం, రచనలు, పరిశోధనలు అన్నీ తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

1958 ఏప్రిల్ 14న నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం బాచనపల్లిలో జన్మించిన ముత్యం తెలుగు, ఇంగ్లీష్, సంస్కృతం, ఫిలాసఫీ, లింగ్విస్టిక్, ఎంఈడీ, ఎల్ఎల్‌బి విద్యను అభ్యసించి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ కోర్సులో శిక్షణ పొందాడు. అనేక కష్టనష్టాలను ఓర్చి ఆఖరికి శాతవాహన యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తొమ్మిదేళ్ళపాటు సేవలు అందించాడు.

ఉస్మానియా యూనివర్సిటీ పీడీఎస్‌యూ అభ్యర్థిగా 1981–82లో ప్రతిష్టాత్మకమైన ఆర్ట్స్ కళాశాల ప్రెసిడెంట్‌గా గెలుపొందాడు. అప్పట్లో ఆర్ట్స్ కాలేజి ప్రెసిడెంట్ అంటే ఎమ్మెల్యేతో సమానమైన గుర్తింపు ఉండేది. ముత్యం విద్యార్థి నాయకుడిగా ఎన్ని కయ్యే నాటికి బీసీ, ఈబీసీలకు ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు ఇచ్చేది కాదు. రాష్ట్రవ్యా ప్తంగా విద్యార్థులను కూడగట్టి ఉద్యమాన్ని లేవదీసి ప్రభుత్వం దిగొచ్చేలా చేసి, విద్యా ర్థుల డిమాండ్లను పరిష్కరింప చేశాడు. మొట్టమొదటగా బీసీ, ఈబీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రావడంలో విద్యార్థి నాయకుడిగా ముత్యానిది కీలక పాత్ర.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి బయ్యా సూర్య నారాయణ పర్యవేక్షణలో "శ్రీకాకుళ ఉద్యమం–సాహిత్యంపై దాని ప్రభావం" అనే అంశంపై పీహెచ్‌డీ చేసి పట్టా పొందారు. ఈ పరిశోధన ద్వారా ఉత్తరాంధ్రలో జరిగిన ప్రజా ఉద్యమాలు, వాటి సాహిత్య ప్రతిబింబాలను చారిత్రక, సామాజిక, సాంస్కృతిక కోణాల్లో విశ్లేషించారు. ఈ పరిశోధనకోసం క్షేత్ర పర్యటనలో భాగంగా శ్రీకాకుళంతో ఆయనకు విడదీయరాని బంధం ఏర్పడింది. పరిశోధన అనంతరం అందుకోసం రికార్డు చేసిన ప్రజా చైతన్య జీవితాలు, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక, జానపద ఘట్టాలు తన రచనల రూపంలో జీవం పోసుకున్నాయి. ఈ పాయలో నుంచి వచ్చినవే– 'శ్రీకాకుళ ఉద్యమ సాహిత్యం', 'సునాముది జీవధార', 'గరిమెళ్ళ సాహిత్యం – జాతీయోద్యమం' (రెండు సంపుటాలు), 'సుబ్బారావు పాణిగ్రాహి జీవితం–చరిత్ర', 'బంకుపల్లి మల్లయ్యశాస్త్రి జీవిత దృశ్యం', గంటి రాజేశ్వరరావు జీవితంపై 'ప్రవహిస్తున్న జ్ఞాపకం', 'స్వాతంత్ర్యోద్యమం – గరిమెళ్ళ', 'శిల్లా రాజుల రెడ్డి జీవితం – కవిత్వం', 'నేను శ్రీకాకుళం జయమ్మను'... మొదలైన రచనలు.

ముత్యం సాహిత్య కృషిని నిశితంగా పరిశీలిస్తే– శ్రీకాకుళ ఉద్యమ నేపథ్యంగా ఎంత రాశారో అంతే ఉధృతంగా తెలంగాణ ప్రాంత సాహిత్య కృషి గురించీ రాశారు. చిందు యక్షగాన కళాకారిణి చిందుల ఎల్లమ్మ జీవితాన్ని 'నేను చిందుల ఎల్లమ్మను' పేరుతో రచించారు. ఈ పుస్తకం పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయిలో పాఠ్యాంశంగా ఉండడం విశేషం. కానీ రచయితగా డా. కె ముత్యంను ఇంటర్మీడియట్ బోర్డు గుర్తించకపోవడం విచారకరం. ఇట్లా తెలంగాణ భాషా, చరిత్ర, సామాజిక, సాంస్కృతిక అంశాలపై ఎన్నో పుస్తకాలు తెచ్చారు. అట్లనే 'చిందుల ఎల్లమ్మ యాది', 'తెలంగాణ శాస్త్రాలు' పేరుతో నిజామాబాద్ ప్రాంత ఐదువేల సామెతలు సేకరించి ముద్రించాడు. 'శాయరి రామాయణం' (ప్రాంతీయ సంప్రదాయ సాహిత్యం) కొత్త ఛందస్సును వెలుగులోకి తెచ్చాడు. ఇంకా 'మట్టి రంగును ఎంచుకున్న కుంచె', 'బాచనపల్లి–తెలంగాణలో ఒక గుట్టల కింద పల్లె', 'సర్వదేవభట్ల రామనాథం జీవితం', 'పిండిప్రోలు', 'సోయం గంగులు', 'మేర మల్లేశం', 'పోరాట పాటలు', 'బత్తుల వెంకటేశ్వరరావు జీవన రేఖలు'... ఇవన్నీ తెలంగాణ ప్రాంతం నేపథ్యంగా వచ్చిన రచనలే. నిజామాబాద్ ప్రాంత జానపద పాటలను సేకరించి పెట్టాడు. ఇవి ఇంకా ముద్రణలోకి రావాలి.



"మీకు పానం బాగలేకున్న ఎందుకు రాసుడు? హాయిగా రెస్ట్ తీసుకోవచ్చు కదా," అని ఎవరైనా అంటే, "ప్రజా జీవితంలో ప్రాణాలు కోల్పోయిన వీరుల త్యాగాలు వృథా కావడం నాకు ఇష్టం లేదు. నా బాధ్యతగా రాస్తున్న. మనం రాయకపోతే ఇంకెవరూ రాయరు," అని సున్నితంగా బదులిచ్చి, మరణించే వరకు రాస్తూనే ఉన్నారు కె. ముత్యం.

ఇక శాతవాహన యూనివర్సిటీ తెలుగు విభాగం నుంచి తొమ్మిదేళ్ళ కాలంలో నాలుగు జాతీయ సెమినార్లు నిర్వహించి తెలంగాణ భాషను, చరిత్రను, సంస్కృతిని, అలభ్య గ్రంథాలను, శాసనాలను గ్రంథస్థం చేసాడు. ఆ క్రమంలోనే ఎందరో విద్యార్థులకు క్షేత్ర స్థాయి పరిశోధనలో శిక్షణ ఇచ్చాడు. బొద్రాయి, గ్రామ దేవతల ఔన్నత్యాన్ని, అలభ్య గ్రంథాలను, శాసనాలను విద్యార్థుల చేత శోధింపచేశాడు. శాతవాహన యూనివర్సిటీ తెలుగు విభాగం తరఫున 'ఉత్తర తెలంగాణ సంస్కృతి చరిత్ర' (2011), 'నేటి ప్రపంచీకరణలో తెలంగాణ భాష, తెలుగు భాష, గిరిజన భాషలు, ప్రామాణికత–అమలు–అస్తిత్వం', 'ఉత్తర తెలంగాణ పల్లె సంస్కృతి–శాతవాహన పరిశోధన వ్యాసాలు', 'తెలంగాణలో అలభ్య శాసనాలు, గ్రంథాలు' (2019) అనే ఉత్తమ గ్రంథాలను ప్రచురించాడు.

అలాగే 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్'లో శిక్షణ పొందిన ముత్యం ప్రజా కళాకారుల సాంస్కృతికోద్యమ కృషిని డాక్యుమెంటరీల రూపంలో ప్రజలకు అందించారు. 'జన జీవన గానం' పేరుతో ప్రజా కళాకారుడు కానూరి వెంకటేశ్వరరావు జీవితాన్ని చిత్రించాడు. 'కొండవీడు' పేరుతో రెడ్డి రాజుల పౌరుషాన్ని, ఔన్నత్యాన్ని నిర్మించాడు. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ లఘుచిత్రంగా రెండు నంది అవార్డులు ప్రకటించింది. నిజామాబాద్ ప్రాంత గ్రామ దేవత 'చిలుకల చిన్నమ్మ' జాతర మహాత్మ్యాన్ని రికార్డు చేశాడు. అంతే కాదు, సులభంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో జ్వాలాముఖి మొదలైన వారితో 'శ్రీకృష్ణుని బాల్య క్రీడలు', 'బెజ్జమహాదేవి', 'తిలక్–ఆర్తగీతం', 'శ్రీశ్రీ కవిత్వం' మొదలైన ఆడియో వీడియో పాఠాలు చెప్పించాడు. వీటిలో కొన్ని టీవీలో ప్రసారమైనాయి.

జీవిత చివరి అంకంలో ఆరోగ్యం సహకరించకున్నా, మంచం మీద ఉండి లేవలేని స్థితిలో కూడా మిత్రులు, విద్యార్థులు, కుటుంబ సహకారంతో ఏడెనిమిది పుస్తకాలు రచించాడు. "మీకు పానం బాగలేకున్న ఎందుకు రాసుడు? హాయిగా రెస్ట్ తీసుకోవచ్చు కదా," అని ఎవరైనా అంటే, "ప్రజా జీవితంలో ప్రాణాలు కోల్పోయిన వీరుల త్యాగాలు వృథా కావడం నాకు ఇష్టం లేదు. నా బాధ్యతగా రాస్తున్న. మనం రాయకపోతే ఇంకెవరూ రాయరు," అని సున్నితంగా బదులిచ్చి, మరణించే వరకు రాస్తూనే ఉన్నారు. "స్వేచ్ఛ కోసం మృతి చెందినవారు మౌనంగా నిద్రించరు; వాళ్ల స్వరం రచయితల గళంలో ప్రతిధ్వనిస్తుంది" అని సల్మాన్ రష్దీ అన్న మాటల్ని నిజం చేసిన గొప్ప రచయిత ముత్యం. ఆయన రచనలపై యూనివర్సిటీ స్థాయిలో పరిశోధనలు జరగాలి.

■ డా. జీడి రమేష్

(నేడు డా. కె ముత్యం ప్రథమ వర్ధంతి)

చైనా డ్యామ్‌తో జాగ్రత్త!

ఉగ్రవాదమే ఊపిరిగా జీవిస్తూ– నిరంతరం, నిరంతరాయంగా నెత్తుటేర్లు పారిస్తున్న పాక్‌కు గుణపాఠం చెప్పేందుకు భారత్ ఇటీవల సింధూ జలాలను బిగపట్టింది. పాక్ చిరకాల మిత్రదేశం చైనా– అందుకు తక్షణ ప్రతీకార చర్యగా ఇటీవల బ్రహ్మపుత్ర నదిపై బ్రహ్మాండమైన డ్యామ్ నిర్మాణానికి భారీ ఎత్తున ప్రారంభోత్సవం జరిపింది.

ప్రపంచంలోని దాదాపు 40 శాతం జనాభా 276 అంతర్జాతీయ నదీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తోంది. మొత్తం తాగు, సాగు యోగ్య జలాల్లో 60 శాతం అక్కడి నుంచే లభిస్తున్నాయి. వాటిలో వాటా కోసమే నీటిలో నిప్పులు. 170 బిలియన్ డాలర్ల (సుమారు 15 లక్షల కోట్ల రూపాయల) ఖర్చుతో బ్రహ్మపుత్ర (యార్లంగ్ జాంగ్పో) నదిపై చైనా చేపట్టిన మెడాగ్ డ్యామ్ నిర్మాణం పెను ప్రకంపనలు సృష్టిస్తున్న తీవ్ర విపరిణామం. భారత సరిహద్దుల వెంబడి టిబెట్ పీఠభూమిలో చైనా నిర్మిస్తున్న 60 వేల మెగావాట్ల పంచవర్ష ప్రాజెక్టు ఇది. 'దేశీయ ఆర్థిక అభివృద్ధి కోసమే ఈ భారీ డ్యాం' అని చైనా నమ్మబలుకు తున్నప్పటికీ, అంతరార్థం ఏమిటన్నది లోతుగా పరిశీలించాల్సిందే.

సరిహద్దు దేశాలతో డజన్లకొద్దీ నదులను చైనా పంచుకుంటోంది. వాటిలో చాలా భాగం ఎగువన ఉన్న చైనా నుంచి దిగువకు ప్రవహిస్తున్నవే. దాంతో ఆర్థిక, రాజకీయ, దౌత్య ప్రయోజనాల కోసం ఆ నదీ జలాలను వాడుకొనే అవకాశం చైనా చేజిక్కింది. ఇప్పుడు బ్రహ్మపుత్ర విషయంలోనూ చైనా అనేక ఇతర ప్రయోజనాలను అన్వేషిస్తూ ఉండొచ్చు కూడా. బ్రహ్మపుత్ర జలాల్ని చైనా ఈ డ్యామ్ ద్వారా అడ్డుకున్నా లేక హఠాత్తుగా వదలిపెట్టినా దిగువన ఉన్న అరుణాచల్ ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో వ్యవసాయం, జీవనోపాధులు కొంతమేరకు దెబ్బతినే ప్రమాదం ఉంది.

నదీ జల వివాదాలపై రెండు దేశాల మధ్య కొన్ని అవగాహన ఒప్పందాలు, నిపుణుల స్థాయి యంత్రాంగం ఉన్నప్పటికీ– అవేవీ క్రియాశీలంగా లేవు. బ్రహ్మ పుత్ర నదీ జలాల వివరాల పేరిట ఇప్పటికే భారత్ కొన్ని కోట్ల రూపాయలను భారత్ నష్టపోయింది. ఆ అవగాహనకూ 2014తో కాలం చెల్లింది. ఇప్పటికే సొంత ఉపగ్రహ సమాచారం, రిమోట్ సెన్సింగ్‌పై భారత్ దృష్టి సారించాల్సి ఉంది. బ్రహ్మపుత్ర నదీ జలాల్లో 80 శాతం, ఆ నది భారత భూ భాగంలోకి ప్రవేశించాక హిమనీనదాలు, భారీ వర్షాలు, వరదల ద్వారా జమపడుతున్నవే. పైపెచ్చు చైనా నిర్మిస్తున్న మెడాగ్ మెగా డ్యామ్ ప్రధానంగా జల విద్యుత్ ఉత్పత్తి కోసమే. అందువల్ల, భారీ స్థాయిలో నదీ జలాల్ని అదే పనిగా నిలిపి ఉంచేసుకోవడం అసాధ్యం. ఒకవేళ కొంతమేరకు అడ్డుకున్నా, ఉన్నట్టుండి వదిలేసినా భయపడాల్సినంత భారీ స్థాయిలో విధ్వంసమేమీ జరగదు. కాల్వలు, విస్తృత నీటి పారుదల వ్యవస్థల నిర్మాణం, నిర్వహణ ఇలాంటప్పుడు మనకు కీలకం. ఇందులో భాగంగానే అరుణాచల్ ప్రదేశ్‌లోని సియాంగ్ జిల్లాలో బహుళార్థసాధక నీటి నిల్వ ప్రాజెక్టును ప్రతిపాదించారు. దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న స్థానికులకు నచ్చజెప్పి, ఒప్పించగలిగితే– డ్యామ్ సంబంధిత భయాలకు, నష్టాలకు చెక్ పెట్టే దిశగా ఓ అవరోధాన్ని అధిగమించినట్లే!

– పి. దత్తారాం ఖత్రీ, సీనియర్ జర్నలిస్టు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్ రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కాల్పుల విరమణ వెంటనే ప్రకటించాలి
పూర్వ విప్లవ విద్యార్థుల రాష్ట్ర కో కన్వీనర్ ఎంవీ రమణ

చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు

ప్రేమించిన యువకుడి ఇంటిపై దాడి
9 మందిపై హత్యాయత్నం కేసు నమోదు

6

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 20 ఆగస్టు 2025

రుణ పునరుద్ధరణ బంగారమాయేనా!



■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

గోల్డ్‌లోన్ (బంగారు ఆభరణాలపై రుణాలు) తీసుకున్న రైతులు బ్యాంకర్ల షరతులతో బెంబేలె త్తిపోతున్నారు. రుణ పునరుద్ధరణ (రెన్యువల్) సమయంలో అసలుతో పాటు వడ్డీ పూర్తిగా చెల్లిం చకపోతే బ్యాంకర్లు రెన్యువల్ చేయడం లేదు. దీంతో రెన్యువల్ గడువు దాటితే డిఫాల్టర్‌గా మిగి లిపోతామనే ఆందోళనతో రైతులు బ్యాంకు అప్పు తీర్చేందుకు మళ్లీ ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేస్తున్నారు. రెండు, మూడు రోజుల కోసం ప్రైవేటు వ్యాపారులు భారీగా వడ్డీ వసూలు చేస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. పాత విధానంలో వడ్డీ చెల్లిస్తే గోల్డ్‌రుణం రెన్యు వల్ చేసేవారు. అయితే ఇటీవల కాలంలో ఆర్ బీఐ కొత్త నిబంధనలను తీసుకరావటంతో బంగారు అభరణాలను తాకట్టు పెట్టి రుణం తీసుకున్న రైతులు మొత్తం చెల్లించిన తరువాతే రెన్యువల్ చేయాలనే నిబంధన పెట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గోల్డ్ లోన్లు తీసుకున్న రైతుల వెతలు

- బ్యాంకుల నిబంధనలతో తీవ్ర ఇబ్బందులు
- అసలు, వడ్డీ చెల్లించుకుంటే రెన్యువల్ చేసేది లేదని షరతులు
- రుణం పూర్తిగా చెల్లించేందుకు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు
- రెండు వైపులా అధిక వడ్డీభారంతో రైతుల కష్టాలు
- గోల్డ్‌లోన్ విధానంలో పాత పద్ధతినే కొనసాగించాలని విజ్ఞప్తి

పెట్టుబడికి బంగారు రుణాలు

రైతులు పెట్టుబడికి ప్రధానంగా బ్యాంకులపైనే ఆధార పడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీసీసీబీతో పాటు వివిధ జాతీయ, రాష్ట్రీయ బ్యాంకుల్లో సుమారు రూ.5వేల కోట్లకు పైగా గోల్డ్ లోన్లు, క్రాప్‌లోన్లు, ఇతర రైతుల రుణాలు ఉన్నాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాలోనే 2024-25లో రూ.2,643కోట్లు, ములుగు జిల్లాలో రూ.591.62కోట్ల వరకు రైతులకు వివిధ రకాల రుణాలు ఇచ్చినట్లుగా అంచనా. వీటితోపాటు భూపా లపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాలోనూ బంగారం తాకట్టు పెట్టి భారీగా రుణాలు తీసుకు న్నారు. అయితే ప్రస్తుతం అనుకున్నదాని కంటే అధి కంగా పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. దీంతో భూముల తాకట్టుతో పాటు బంగారు అభరణాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు చేయాల్సి వస్తోంది. బంగారు అభరణాలను తాకట్టు పెట్టి రుణాలు తీసు కున్న రైతులకు ప్రభుత్వం ఇటీవల రుణమాఫీ చేయటంతో చాలామందికి ఇది కూడా ఓ ఆశగా మారింది. ప్రధానంగా ఎక్కువగా కౌలు రైతులు గోల్డ్ లోన్ వైపు మొగ్గు చూపుతున్నారు. పాస్‌బుక్‌లు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి అప్పులు తీసుకునేందుకు భూ యాజమానులు ఒప్పుకోకపోవటంతో.. కౌలు రైతులు బంగారు అభరణాలను తాకట్టు పెడుతు న్నారు. ఎక్కువ మొత్తంలో వ్యవసాయం చేసే రైతు లకు రూ.లక్ష నుంచి రూ.20లక్షల వరకు కూడా పెట్టుబడి అవసరం ఉండటంతో అప్పులు చేస్తు న్నారు. అయితే ఒక రైతుపై

(మిగతా 7లో..)

ఎన్నిసార్లు వచ్చినా, మీరెవరు అంటారు...

- సీనియర్లను కాకుండా మొన్నమొన్న వచ్చిన వారికి ప్రాధాన్యం
- చాడీలు చెప్పే వారు కోటరీగా మారారు..
- ఎమ్మెల్యే నాగరాజు తీరుపై కాంగ్రెస్ శ్రేణుల అసంతృప్తి
- వాడివేడిగా ఐనవోలు మండల పార్టీ సమావేశం
- 'స్థానిక' ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే ఇస్తామన్న ఎమ్మెల్యే



ఐనవోలులో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఐనవోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ కార్య కర్తల సమావేశం మంగళవారం స్థానిక రిసార్ట్‌లో వాడివేడిగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై పార్టీ నాయకులు అ నేక ప్రశ్నలు కురిపించారు. తాము పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన చెందారు. పార్టీని నమ్ముకున్నం దుకు తమకు ప్రాధాన్యం దక్కడం లేదని ఫైర్ అయ్యారు. గ్రామాల్లో కాంగ్రెస్ పరిస్థితి, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుపాలని, అలాగే నాయకులు, కార్యకర్తలకు ఇబ్బందులు ఏమైనా ఉంటే వేదికపై మాట్లాడాలని ఎ మ్మెల్యే నాగరాజు సూచించగా, 16గ్రామాల నుంచి వచ్చిన పార్టీ సీనియర్లు, జూనియర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పాత, కొత్త క్యాడర్ నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలను కుండబద్దలు కొట్టారు. కొందరు

(మిగతా 6లో...)

దేశంలో స్టార్టప్‌ల విప్లవం

- ప్రపంచంలోని స్కిల్డ్‌యూత్‌లో 40శాతం మన దేశంలోనే..
- సాంకేతికంగా యువత ఆలోచనల్లో మార్పు వచ్చింది..
- 'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచ దేశాలు బెంబేలు
- మన దేశం సత్తా ఏమిటో తెలిసింది
- కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారుడు జి.సతీష్‌రెడ్డి
- కేయూలో ఘనంగా ప్రారంభమైన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీ



కేయూలో జరిగిన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీలో పాల్గొన్న అతిథులు

హనుమకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యువతే మన దేశ శక్తి అని, ఈ దేశాన్ని సాంకే తికంగా ఉన్నతస్థాయికి తీసుకువెళ్లేది దేశ గతిని, స్థితి మార్చగలిగేది మన దేశంలో అత్యధిక సంఖ్య లో ఉన్న యువత, విద్యార్థులేనని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సల హాదారుడు, ప్రముఖ శాస్త్రవేత్త జి.సతీష్‌రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆడిటోరి యంలో మంగళవారం తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యా యి. ముఖ్యఅతిథిగా హాజరైన సతీష్‌రెడ్డి.. మూ డు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కేయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి ప్లీనరీకి హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి సుమారు 45 నిమిషాల పాటు స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. ప్లీనరీకి వివిధ రాష్ట్రాల నుంచి 650 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. మన దేశంలో 1,100యూనివర్సిటీలు ఉన్నాయ ని, వీటి ద్వారా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వి ద్యార్థులు 4.3కోట్ల మంది అని, ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇం త మంది లేరన్నారు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, అ త్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థలు ఎన్నో ఉన్నాయని, అవే ఇప్పుడు దేశాన్ని శాస్త్ర, సాం కేతిక రంగాలో ప్రగతిపథంలో తీ సుకువెళుతున్నాయన్నారు. ఒక ప్పుడు దేశంలో వేళ్లమీద లెక్కపె ట్టే సంఖ్యలో ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు సెంట్రల్ యూనివర్సిటీలు ఉండేవని, కానీ ఇప్పుడు ప్రతీ రాష్ట్రంలో ఒక ఐఐటీ, ఒక ఐ ఐఎం, ఒక ఎన్ఐటీ అలాగే సెంట్రల్ యూనివర్సి టీలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇవన్నీ ఇప్పుడు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన విద్యా సంస్థలుగా వెలుగొందుతున్నాయ న్నారు. సైన్సును మరింతగా ప్ర జల్లోకి తీసుకువెళ్లడమే కాకుండా ఈ రంగంలో వినూత్న ఆవిష్క రణ లక్ష్యంగా అనేక కార్యక్రమా లను అమలు చేస్తున్నట్టు చెప్పారు. టెక్నాలజీ పరంగానే కాకుండా పరిశోధన, విద్యారంగా ల్లోనూ సమాంతరంగా ముందుకు వెళ్లేందుకు ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ సంస్థను కూడా ఏర్పాటు చేసుకున్నామన్నారు. మన దేశంలో ఇప్పుడు స్టార్టప్ విప్లవం కొనసాగుతోందన్నారు. యువత స్టార్టప్‌ల పట్ల మొగ్గుచూపుతోందన్నారు. పట్టణాలే కాదు.. గ్రామాలు, మారుమూల పల్లె ప్రాంతాల నుంచి వచ్చిన వారు సైతం వినూత్నంగా ఆలోచిస్తున్నారని, సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకా రాలు చుడుతున్నారన్నారు. 2016లో దేశంలో 456 స్టార్టప్‌లు ఉండగా ప్రస్తుతం 1.57లక్షల స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయని తెలిపారు. యావత్ ప్రపంచం ఇప్పుడు భారత దేశ యువతవైపు చూస్తోందని, వారి వినూత్న ఆవిష్కరణలను ఆసక్తిగా గమనిస్తోం దని, తగిన అవకాశాలు ఇచ్చి వారి శక్తియుక్తులను వాడుకోవడానికి ముందుకు వస్తోందన్నారు. మనం ఎక్కడ పుట్టాం.. ఎక్కడి నుంచి వచ్చామనేది ముఖ్యం కాదని, మన ఆలోచనలు ఎంత వినూ త్నంగా ఉన్నాయనేది ప్రధానం అన్నారు. మారు మూల ప్రాంతాల్లో పుట్టిపెరిగిన కొందరు యువ కులు సరికొత్త ఆలోచనలతో స్టార్టప్‌లు ప్రారంభించి రూ.వందల కోట్లకు అధిపతులయ్యారని అన్నారు. డీఆర్‌డీఏలో పని చేస్తున్న ఓ చిరుద్యోగి కొడుకు బెంగుళూరుకు చెందిన అనిరుధ్ ఏర్పాటు చేసిన స్పేస్ స్టార్టప్, కర్నాటకలోని ఒక చిన్నపల్లె నుంచి వచ్చిన సోహన్ గోపీనాథ్ సైబర్ టెక్నాలజీకి సంబం ధించిన గ్లోబల్ స్టార్టప్, గ్రామీణ ప్రాంతానికి చెందిన మరో యువకుడి ప్రొపెల్లెంట్ స్టార్టప్‌లు ఇందుకు ఉదాహరణలన్నారు. రాబోయే కాలంలో క్వాంటమ్ టెక్నాలజీ ప్రాధాన్యత సంతరించుకోనున్నదన్నారు. ఈ రంగాల్లో స్టార్టప్‌లు అనేకం



మాట్లాడుతున్న జి.సతీష్ రెడ్డి

(మిగతా 6లో...)

ఎరువులు వచ్చేశాయ్..

జిల్లాకు చేరిన 1146.6 మెట్రిక్ టన్నులు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు19 (ఆంధ్ర జ్యోతి): ఖరీఫ్ సీజన్ కోసం యూరియా నిల్వలు వచ్చేశాయి. స్పిక్ కంపనీకి చెందిన యూరియాతో పాటు ఇతర ఎరువులు మంగళ వారం వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరాయి. ఇందులో 1146.6 మెట్రిక్ టన్నుల యూరియా, 446 మెట్రిక్ టన్నుల 20:20:0:13, 255.200 మెట్రిక్ టన్నుల 10:26:26, 63,800 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులు దిగుమతి అయ్యాయి. ఈ సందర్భంగా స్పిక్ కంపెనీ రీజ నల్ మేనేజర్ ఎంఎస్.సుభాహన్, వ్యవసాయ శాఖ ఏవో రవీందర్‌రెడ్డి నూతన గ్రేడ్ 10:26:26 ఎరువులను నూతనంగా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఏవో రవీందర్ రెడ్డి మాట్లా డుతూ.. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో సమ తుల్యమైన ఎరువులు కీలకమని, స్పిక్ వంటి కంపెనీలు నాణ్యమైన ఎరువులను తీసుకువచ్చా యని, వాటి వల్ల భూమి ఫలవంతమై రైతు ఆదాయం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో రమణారెడ్డి, తిరుమల రావు, మనో హర్ బాబు, గణేష్, దేవేందర్, కిరణ్ తదిత రులు పాల్గొన్నారు.

కేంద్ర సర్కార్ రైతు ద్రోహి

- తెలంగాణ ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్ర
- యూరియాను తక్షణం విడుదల చేయాలి
- వరంగల్ ఎంపీ కావ్య డిమాండ్
- పార్లమెంట్ ఆవరణలో ఆందోళన




పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఎంపీ డాక్టర్ కావ్య

హనుమకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగా ణలో యూరియా కొరత సృష్టించడాన్ని నిరసిస్తూ మంగళవారం పార్లమెంట్ ఆవరణలో ప్రియాంక గాంధీ ఆధ్వర్యంలో తెలంగాణ ఎంపీలతో కలిసి వరం గల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ఆందోళన చేపట్టారు. మా వాటా మాకు ఇవ్వండి.. తెలంగాణ రైతుల్ని కాపాడండి.. అని రాసిన ప్లకార్డు పట్టుకొని నినదించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లా డుతూ.. తన అప్రజాస్వామిక విధానాలతో కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో యూరియా కృత్రిమ కొర తను సృష్టిస్తున్నదని విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన వాటాను కేటాయించకుండా రైతుల్లో అయో మయం సృష్టిస్తున్నదని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కుట్రలు పనుతోందని ఆరోపిం చారు. తాము తెలంగాణ రాష్ట్రానికి అదనంగా యూరియా ఇవ్వాలని కోరడం లేదని, కేటాయిం చిన వాటానే విడుదల చేయాలని అడుగుతున్నా మన్నారు. తెలంగాణకు మొత్తం 8.30లక్షల టన్నుల యూరియాను కేంద్రం కేటాయిస్తూ కేవలం 5.32లక్షల టన్నులు మాత్రమే విడుదల చేశారన్నారు. ప్రతీ నెల రావాల్సిన వాటా కన్నా తక్కువ యూరియా సరఫరా చేసి రాష్ట్రంలో కేంద్ర సర్కార్ యూరియా కొరతను సృష్టించిందని అన్నారు. కేంద్ర సర్కార్ కుట్ర పూరిత చర్యలతో తెలంగాణ రాష్ట్ర రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. జూన్ చివరి వారంలో కేంద్ర మంత్రి నడ్డాను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కలిసి జూలై లోనే మొత్తం యూరియాను కేటా యించాలని కోరారని గుర్తు చేశారు. ఏనాడూ రైతుల పక్షాన నిల్చోని బీజేపీ రైతు ద్రోహి అని ధ్వజమెత్తారు. తెలంగాణకు కేటా యించిన యూరియాను తక్షణమే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల బాధలు రాష్ట్రంలోని బీజేపీ మంత్రులు, ఎంపీలకు కనిపించడం లేదా? అని మండిప డ్డారు. పార్లమెంట్ సమావేశాల ముగింపు వరకు యూరియా కోసం మకరద్వార్ ఎదుట ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

నిరుద్యోగ యువతులకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా నిరుద్యోగ యువతులకు సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, ఎలక్ట్రీషన్ హౌస్ వైరింగ్, మొబైల్ రిపేరింగ్ లలో ఉచిత శిక్షణనిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి ఆసక్తి గల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల ప్రతులు, 4 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 28 నుంచి తరగ తులు ప్రారంభమవుతాయని తెలిపారు. భోజన వసతి, కోర్సు మెటీరి యల్ ఉచితంగా అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సెల్ నెం.97040 56522, 98493 07873, 62812 60878, 99491 08934 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.



రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ఉధృతంగా గోదావరి

- పేరూరు వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- రామన్నగూడెం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో...
- కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ఉరకలేస్తున్న ప్రవాహం

7

నిలిచిన అంతర్‌రాష్ట్ర రాకపోకలు

టేకులగూడెం వద్ద జాతీయ రహదారిని ముంచెత్తిన వరద



వాజేడు-గుమ్మడిదొడ్డి మధ్య వరద నీటి పరిశీలిస్తున్న ఎస్సై, తహసీల్దార్

వాజేడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద ప్రవాహం పెరగటంతో అంతర్‌రాష్ట్ర రాకపోకలు నిలిచిపోయాయి. భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ టేకులగూడెం వద్ద రేకుమాగు వాగుకు వరద నీరు పోటెత్తి రహదారిని ముంచెత్తింది. దీంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు ఆగిపోయాయి. వరద ప్రవాహంలో ఎవరూ దాటకుండా పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివే శారు. అలాగే పేరూరు-చంద్రుపట్ల మధ్య ఉన్న మరిమాగు వాగు ఉధృతి కారణంగా వంతెనపై వరద నీరు చేరింది. వాజేడు-గుమ్మడిదొడ్డి మధ్య ఉన్న కొంగాల వాగు ఉధృ తి రోడ్డును వరద నీరు ముంచెత్తింది. అదేవిధంగా ఎడ్జర్లపల్లి-బొమ్మనపల్లి గ్రామాల మధ్య కూడా రాకపోకలు నిలిచిపోయాయి. కోయవీరాపురానికి వెళ్లే చాకలివాగు ఉధృతి కారణంగా ఆ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. సీఐ ముత్యం రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, ఎస్సైలు జక్కుల సతీష్, కృష్ణప్రసాద్, ఆర్ఐ కుమారస్వామి లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

భద్రకాళి ఆలయ సూపరింటెండెంట్‌గా క్రాంతి కుమార్



వరంగల్ కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవస్థానం సూపరింటెండెంట్‌గా జి.క్రాంతికుమార్ మంగళ వారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్ మేడారం సమ్మక్క- సారలమ్మ దేవస్థానానికి బదిలీ కావడంతో అక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న జి.క్రాంతి కుమార్‌ను భద్రకాళి దేవస్థానానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ ఫొటోగ్రాఫర్‌కి రాష్ట్ర స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న హరీష్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో వరంగల్‌కు చెందిన ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ ఫొటోగ్రాఫర్ వీరగోని హరీష్‌కు రాష్ట్రస్థాయిలో అవార్డు దక్కింది. మంగళవారం హైదరాబాద్‌లో పంజాగుట్టలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర సమాచార కమిషనర్ సీహెచ్ ప్రియాంక చేతుల మీదుగా హరీష్ అవార్డు అందుకున్నారు.

యూరియా బ్లాక్ దందా

నెల్లికుదురు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : యూరియాను అధిక ధరలకు విక్రయించిన సంఘటన మండలంలోని నర్సింహులగూడెం క్రాస్‌రోడు వద్ద శరత్ ఫర్టిలైజర్ పెస్టిసైడ్ సీడ్స్ షాపులో సోమవారం రాత్రి జరిగింది. ఈ ఘటనపై విచారణ చేసిన అధికారులు డీలరుపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపగా లైసెన్స్ రద్దు చేసినట్లు ఏడీఏ శ్రీనివాస్ తెలిపారు.

దేశంలో స్టార్టప్‌ల విప్లవం

(5వ పేజీ తరువాయి)

రానున్నాయన్నారు. డీప్ టెక్ పట్ల దృష్టి సారించినప్పుడే మరింతగా రాణించగలుతామన్నారు. భవిష్యత్తులో ప్రపంచంలో నైపుణ్యం కలిగిన యువతలో 40 శాతం మంది మన దేశంవారే ఉంటారన్నారు. వినూత్న సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో రాష్ట్ర విశ్వవిద్యాలయాలు కీలక భూమిక పోషించాలని పిలుపు నిచ్చారు.

ఆపరేషన్ సిందూర్‌తో సాంకేతికంగా మన దేశం సత్తా ఏమిటనేది ప్రపంచానికి తెలిసిందని సతీష్ రెడ్డి చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో మన ఉపయోగించిన అత్యాధునిక సాంకేతికత చూసి యావత్ ప్రపంచ నివ్వెరపోయిందన్నారు. ఇజ్రాయిల్ లాంటి దేశాలు ఐరన్ డోం రక్షణ వ్యవస్థను వాడుకుంటే మన దేశం దానికి మించి దేశ భద్రతకు ఆపరేషన్ సిందూర్‌లో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించిందన్నారు. శత్రుదేశపు ప్రతీ క్షిపణిని, డ్రోన్‌ను, విమానాన్ని తిప్పి కొట్టిందని, రాడార్ వ్యవస్థలను, ఉగ్రవాదుల బంకర్లను ధ్వంసం చేసిందని అన్నారు. శత్రు దేశం రాడార్‌లను ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ ధ్వంసంచేసే ఆధునాతన సాంకేతిక వ్యవస్థ రూపకల్పనలో పాలుపంచుకున్న రాడార్ నిపుణుల్లో ఒకరైన విశ్వం సభలో ఉండగా ఆయనను సతీష్ రెడ్డి ప్లీనరీకి హాజరైన ప్రతినిధులకు స్వయంగా పరిచయం చేశారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో మన దేశం స్వయం సమృద్ధిని సాధించిందన్నారు. కిందటేడు రూ.24వేల కోట్ల ఉత్పత్తులను ఎగుమతి చేయగా ఈ యేడు ప్రధాని మోదీ సూచన మేరకు ఈ మొత్తం రూ.50వేల కోట్ల పెరగనున్నదని చెప్పారు.

ఈ సైన్స్ కాంగ్రెస్ ప్లీనరీ సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి.బాలక్రిష్ణారెడ్డి, టీఎఎస్ మాజీ అధ్యక్షుడు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ మోహన్ రావు, టీఎఎస్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సత్యనారాయణ, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం, టీఎఎస్ కోశాధికారి ప్రొఫెసర్ ఎస్ఎంరెడ్డి, టీఎస్‌సీ నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ బి.వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ఇబ్బందులు కలగొద్దు

వరంగల్ కలెక్టర్ సత్య శారద



సొసైటీ వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

రాయపర్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియాను సరఫరా చేయడంలో ఎలాంటి ఇబ్బందులు కలగొద్దని వరంగల్ కలెక్టర్ సత్య శారద స్పష్టం చేశారు. మంగళవారం రాయపర్తి పీఏసీఎస్ గోదాము, పలు ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియాను సక్రమంగా అందించేలా చూడాలన్నారు. ఈ జిల్లాకు చెందిన రైతులకు యూరియాను ఇవ్వాలని, ఇతర జిల్లాల వారికి ఇవ్వొద్దన్నారు. రైతు పాస్ పుస్తకం చూసి ఎవరికి ఎంత యూరియా కావాలో అంత తగు మోతాదులో ఇవ్వాలన్నారు. యూరియా బస్తాలను పక్కదారి పట్టించి కృత్రిమ కొరత సృష్టించే వ్యక్తులచే అమ్మిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారని వారిపై వ్యవసాయ అధికారులు పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కొరత లేకుండా తగినంత యూరియా అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రైవేటు షాపుల వద్ద అధికారులు ఉండి యూరియా పంపిణీ చూడాలని, సబ్సిడీ యూరియా ఎక్కడ పక్కదోవ పట్టకుండా చూడాలని ఆదేశించారు.

యూరియాకు ప్రత్యామ్నాంగా నానో యూరియా చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం మండలంలోని పెర్కవేడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వెరిఫికేషన్ స్వయంగా నిర్వహించారు. రాయపర్తిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించారు. ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చేస్తున్న విద్యార్థులతో రక్త పరీక్షలు చేయించారు. అనంతరం తరగతి గదులను, ఆహార పదార్థాలు, భోజన సదుపాయాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, హౌసింగ్ పీడీ గణపతి శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలి

వరంగల్ కలెక్టరేట్ : భూ భారతి దరఖాస్తులను వారం రోజుల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆమె ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తహసీల్దార్ల వద్ద పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల్లో అన్నింటినీ పరిష్కరించాలని, పరిష్కరించలేని దరఖాస్తులకు సంబంధించి నివేదికలను తయారు చేయాలని సూచించారు. రెవెన్యూ రికార్డుల భద్రత విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో అన్ని రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని, బయోమెట్రిక్ అటెండెన్స్, పర్సనల్ రిజిస్టర్, రికార్డు మెయింటనెన్స్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మి, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి పాల్గొన్నారు.

ఎన్నిసార్లు వచ్చినా, మీరెవరు అంటారు

(5వ పేజీ తరువాయి)

నాయకులు ఎమ్మెల్యే తీరును ప్రశ్నించారు. 'ఏదైనా పనిపై కార్యకర్తలను వెంటబెట్టుకుని మీ ఇంటికి వస్తే.. మీరెవరని పరిచయం చేసుకోవడం వల్ల కార్యకర్తల ముందు పలుచనవుతున్నాం..' అని ఆవేదన వ్యక్తం చేశారు.

మండలంలో నాయకులు మూడు గ్రూపులుగా ఏర్పడడంతో పార్టీకి నష్టం జరుగుతుందని దీనిపై ఎమ్మెల్యే దృష్టి సారించాలని వేడుకున్నారు. బీఆర్ఎస్ పాలనలో తమపై కేసులు పెట్టించి అణగదొక్కిన నాయకులు.. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వచ్చి పెత్తనం చెలాయిస్తుంటే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. గ్రామాలు, వార్డుల్లో ఎలాంటి ప్రజాబలం లేని వారు, తాము నాయకులమంటూ ఎమ్మెల్యే వెంట కోటరీగా మారి ఇతరులపై చాడీలు చెబుతున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో పారదర్శకత లేదనడానికి ఐనవోలు మండల కేంద్రమే నిదర్శనమన్నారు. అర్హురాలైన ఓ మహిళకు ఇల్లు పెట్టండని ఎమ్మెల్యే స్వయంగా ఇందిరమ్మ కమిటీ బాధ్యులకు ఫోన్ చేసి చెప్పినా, స్థానిక నాయకుడు అడ్డు తగలడం దీనికి నిదర్శనమన్నారు. 15 సంవత్సరాలుగా పార్టీని పట్టుకొని ఆర్థికంగా, ఎన్నో రకాలుగా నష్టపోయిన తమను కాదని కొత్తగా పార్టీలో చేరిన వారికి అధిక ప్రాధాన్యం ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని దీనిపై స్పష్టమైన హామీ ఇవ్వాలని ఎమ్మెల్యేను నేరుగా ప్రశ్నించారు.

సర్వేల ప్రకారమే...

కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సమరంలో సమర్థులకే అవకాశాలు లభిస్తాయని, గెలుపు గుర్రాలను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సర్వేల ఆధారంగా టికెట్లు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిష్ఠానం నిర్ణయం మేరకు మూడు రకాల సర్వేలు చేశాకే టికెట్లు ఇవ్వడం జరుగుతుందని తేల్చి చెప్పారు. ఫలానా వ్యక్తి ఎమ్మెల్యేకు దగ్గర ఫలానా నాయకులు మంత్రికి దగ్గర టికెట్ వస్తుందని చెప్పడం భ్రమే అవుతుందని, అటువంటి ఆశలు పెట్టుకోవద్దని సూచించారు. పార్టీకి చేసిన సేవ, ప్రజల్లో మంచి పేరు పలుకుబడి, సేవా భావం ఉన్నవారిని సర్వేల ఆధారంగా గుర్తించి టికెట్లు ఇస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు పాత, కొత్త ఏమి లేదని అందరూ ఓట్లు వేయడం వల్లనే తాను ఎమ్మెల్యేగా గెలిచానని, సమన్వయంతో పని చేస్తేనే స్థానిక సంస్థల్లో విజయం సాధిస్తామన్నారు. వచ్చిన వారిని తాను గుర్తుపెట్టుకోవడం లేదనేది సరైంది కాదని, ఒకటి, రెండు సార్లు వచ్చిన వారిని గుర్తించకపోవచ్చు.. కానీ పార్టీ కోసం పనిచేసే వారిని ఎలా మరిచిపోతానన్నారు.

ఈ నెల 25న వర్ధన్నపేట నియోజకవర్గంలో జరిగే రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర రూటు మ్యాపును సిద్ధం చేస్తున్నట్లు ఇందులో అందరూ పాల్గొనాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, మాజీ ఎంపీపీ మార్నేని మధుమతి, మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

సదయ్య డిప్యూటేషన్ రద్దు చేయాలి

● పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ఎమ్మెల్యే నాయిని లేఖ

హనుమకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ప్రభుత్వ సీటీఈలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) ఎ.సదయ్య ఫారిన్ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. సదయ్య ఫారిన్ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని తనకు పలు విజ్ఞప్తులు అందాయని ఆ లేఖలో పేర్కొన్నారు.

సైకాలజీ నేపథ్యం ఉన్న వారికే సైకాలజీ ఫ్యాకల్టీలో నియమించాలని కానీ.. ఇంగ్లీష్ నేపథ్యం కలిగిన స్కూల్ అసిస్టెంట్ సదయ్యకు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని పలువురు తమ విజ్ఞప్తులో తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పైగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లీష్ టీచర్ల కొరత ఉండగా, ఇతర విద్యాసంస్థల్లోకి ఇలా డిప్యూటేషన్‌పై పంపడం సరికాదని అభిప్రాయపడ్డారు. వెంటనే సదయ్య డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని సిఫార్సు చేశారు.

నకిలీ వైద్యుల సెంటర్లపై దాడులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం చైర్మన్ డాక్టర్ కె.మహేశ్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.లాలయ్య కుమార్‌ల ఆదేశాల మేరకు వరంగల్ కాశిబుగ్గ ప్రాంతంలో ఇద్దరు నకిలీ వైద్యుల సెంటర్లపై తనిఖీలు నిర్వహించారు. కౌన్సిల్ సభ్యులు డాక్టర్ వి.నరేశ్‌కుమార్, జిల్లా యాంటీక్వాకరీ కమిటీ సభ్యుడు డాక్టర్ వి.రాకేశ్‌లు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. తిలక్ నగర్ ప్రాంతానికి చెందిన మామిడి ఈశ్వరయ్య అనే వ్యక్తి ఎల్ఐసీ ఏజెంట్‌గా పని చేస్తూ డాక్టర్ అని బోర్డు పెట్టుకొని జిల్లా ఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడినని చెప్పుకుంటూ రోగులను మోసం చేస్తున్నట్లు గుర్తించారు.

అలాగే ఎస్‌కే నయాం ఎక్స్‌రే టెక్నీషియన్ చదివి హిజామా కప్పింగ్ థెరపీ పేరుతో అర్హత, అనుమతి లేకుండా అశాస్త్రీయ పద్ధతిలో హైడోస్ స్టెరాయిడ్స్, యాంటీబయోటిక్ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు నకిలీ వైద్యులపై మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ఎన్ఎంసీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు వారు తెలిపారు. నకిలీ వైద్యులను నమ్మి పోసపోవద్దని డాక్టర్ వి.నరేశ్ కుమార్ తెలిపారు. అనుమానాస్పదమైన నకిలీ వైద్యుల సమాచారాన్ని 9154382727కు సమాచారం అందించాలన్నారు.

తెలుగు విభాగాధిపతి లింగయ్యకు ప్రతిభ పురస్కారం

కేయూ క్యాంపస్ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కేయూ తెలుగు విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్యకు ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం సదరన్ ప్రైవేట్ అధ్యాపకుల సంస్థ జాతీయ అధ్యక్షుడు పయరాడ నాగయ్య ప్రకటించారు. ఆగస్టు 31న గుంటూరులో నిర్వహించే డాక్టర్ సర్వపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని అతిథుల చేతుల మీదుగా మామిడి లింగయ్యకు ప్రతిభ పురస్కారాన్ని అందచేస్తారని తెలిపారు.

ప్రేమించిన యువకుడి ఇంటిపై దాడి

తొమ్మిది మందిపై హత్యాయత్నం కేసు నమోదు

యువతి తండ్రితో సహా ముగ్గురి రిమాండ్

తొర్రూరు రూరల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంపై రెండు కుటుంబాలకు చెందిన సభ్యుల మధ్య సోమవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో యువతి కుటుంబ సభ్యులు పదిమందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసు తెలిపారు. ఎస్సై గొల్లమూడి ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం, వెల్లికట్టె గ్రామానికి చెందిన కొమ్ము అజయ్ అదే గ్రామానికి చెందిన ఏశబోయిన రాములు కుమార్తె లావణ్య గత కొంతకాలంగా ప్రేమించుకొని జూలై 23న వివాహం చేసుకొని హైదరాబాద్‌లో అద్దె గృహంలో నివాసం ఉంటున్నారు. సోమవారం స్వగ్రామానికి వచ్చారనే విషయం తెలుసుకున్న యువతి తల్లి యాకమ్మ వెళ్లి నచ్చ చెప్పి ఇంటికి రావాలని ఒత్తిడి చేసింది.

దీంతో యువతి నిరాకరించడంతో యువతి తల్లి ప్రేమించిన యువకుడిని, కుటుంబ సభ్యులను తిడుతూ వెళ్లిపోయింది. రాత్రివేళ కాలనీలో అందరూ నిద్రిస్తుండగా ఒక్కసారిగా యువతి కుటుంబ సభ్యులు, బంధువులు ఇట్టుకలు, కత్తిపీటలు, కర్రలతో యువకుడి తల్లి దండ్రులపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడిలో యువకుడి తండ్రి వెంకన్న పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందస్తున్నట్లు తెలిపారు. అజయ్ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఏశబోయిన రాములు, ఏశబోయిన యాకమ్మ, ఏశబో యిన సాయికుమార్‌తో పాటు వారి కు టుంబ సభ్యులు బత్తుల సోమయ్య, ఏశబోయిన శ్రీను, ఏశబోయిన సాయిలు, బత్తుల కోమలత, బత్తుల వెంకటమ్మ, పోసాని యాకయ్యపై హత్యాయత్నం కేసు నమోదు చేసి ముగ్గురి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.



గాయపడిన వెంకన్న

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తండ్రి కర్మకాండలు కాకముందే కన్నుమూత



నవీన్ (ఫైల్)

మామునూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తండ్రి కర్మకాండలు పూర్తి కాకముందే తనయుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిలావరంగల్ మండలం గాడిపల్లి గ్రామానికి చెందిన అమ్మ నవీన్(36) తాపీ మేస్త్రిగా పని చేస్తున్నాడు. నవీన్ తండ్రి మొండయ్య వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. తండ్రి దశదిన కర్మ పూర్తి కాకుండానే పని ఉందని చెప్పి మంగళవారం ఉదయం నవీన్ తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం అయినా భోజనానికి రాకపోవడంతో ఆయన సోదరుడు రాజు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. దీంతో పొలం వద్దకు వెళ్లేసరికి పొలంలో బోర్లాపడి ఉన్నాడు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతికి గల కారణాలు తెలియడం లేదు. నవీన్‌కు భార్య ఇందుమతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీఐ రమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సమస్యలకు ప్రాణాలు తీసుకోవద్దు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత కుటుంబానికి సీఐ కౌన్సిలింగ్

హనుమకొండ టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలకు క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దని సుబేదారి సీఐ మేకల రంజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లి చర్చి పరిధిలో అద్దెకు నివాసం ఉంటున్న నర్సంపేటకు చెందిన అజ్మీరా రోజా అనే వివాహిత తన భర్త శ్రీనివాస్‌తో గొడవపడి క్షణికావేశంలో వడ్డెపల్లి చెరువులో పడి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు తెలిపారు. స్థానికులు గుర్తించి వెంటనే సుబేదారి పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ ఎం.రంజిత్‌కుమార్ అప్రమత్తమై బ్లూకోల్ట్స్ పోలీసుల ద్వారా వివాహిత ప్రాణాలు కాపాడి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి సీఐ రంజిత్‌కుమార్ వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

● మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు



విలేకరులతో మాట్లాడుతున్న వన్నాల శ్రీరాములు

బాలసముద్రం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి కేరళ రాష్ట్ర ప్రభుత్వం తరహాలో అనేక పథకాలు, రాయితీలు ప్రకటించాలని వర్ధన్నపేట మాజీ శాసన సభ్యుడు వన్నాల శ్రీరాములు డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. కేరళ రాష్ట్ర ప్రభుత్వం చేనేత ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించడానికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించిందని అన్నారు. చేనేత హస్త కళల కళాకారులకు ఆర్థిక సహాయ పథకం (ఆశా), ఎంట్రప్రెన్యూర్ సపోర్ట్ స్కీం వంటి పథకాలను వర్తింప చేస్తుందని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి చేయూత నివ్వాల్సింది పోయి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు జీఎస్టీ రద్దు చేయాలని కేంద్రానికి లేఖ రాయడం విడ్డూరంగా ఉందని వన్నాల ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం చేనేత, రెడీమేడ్ వస్త్రాలపై రూ.40లక్షల టర్నోవర్ వరకు జీఎస్టీ విధించడం లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం చేనేత సంఘాల నూలుపైన 5 శాతం జీఎస్టీలో, రెండున్నర శాతం కేంద్రమే రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నదని, మిగతా రెండున్నర శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందని వన్నాల శ్రీరాములు అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేసి కార్పొరేషన్ ద్వారా నూలు, రంగులు, రసాయనాలు, సిల్క్ నూలు సబ్సిడీపై సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు అవసరమైన వస్త్రాలను చేనేత కార్మికులు ఉత్పత్తి చేసినవి మాత్రమే టెస్కో ద్వారా కొనుగోలు చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని తద్వారా చేనేత కార్మికుల ఆకలి చావులు, ఆత్మహత్యలను నివారించవచ్చని శ్రీరాములు సూచించారు. గత ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు పదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తుందని వన్నాల విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని శ్రీరాములు హెచ్చరించారు.

24న ఉమ్మడి జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-7, 9, 11, 13, 15 బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 24న ఉదయం 8గంటలకు టీటీడీ కల్యాణ మండపంలో రిపోర్టు చేయాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని కన్నా సూచించారు.

దండకారణ్యంలో కాల్పుల విరమణను వెంటనే ప్రకటించాలి

పూర్వ విప్లవ విద్యార్థుల రాష్ట్ర కో కన్వీనర్ ఎంవీ రమణ



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎంవీ రమణ, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

వడ్డెపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో, తెలంగాణ రాష్ట్రంలో కాల్పుల విరమణను వెంటనే ప్రకటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పూర్వ విప్లవ విద్యార్థుల రాష్ట్ర కో కన్వీనర్ ఎంవీ రమణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీసా చట్టం, 1/70 అమలు కోసం భారత రాజ్యాంగంలోని 5, 6వ షెడ్యూల్ అమలు కోసం రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్ ప్రకారం ఆదివాసీలు జీవించే హక్కును కాపాడాలని కోరారు. తక్షణమే కాల్పుల విరమణ ఒప్పందం - శాంతి చర్చలు జరుపాలని అన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ మాట్లాడుతూ.. మావోయిస్టులు కాల్పులకు సిద్ధంగా ఉన్నామని, చర్చలు జరుపాలని పలు మార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసినా పాలకులు పెడచెవిన పెట్టారని అన్నారు. అటవీ ప్రాంతంలోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయకుండా దేశంలో కార్పొరేట్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని ప్రొఫెసర్ వెంకటనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్పుల విరమణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ మార్క శంకర్ నారాయణ, భరద్వాజ్, డాక్టర్ ఎం. వెంగళ్‌రెడ్డి, ఓంబ్రహ్మం, సదానందం, ఎండి రాజ్‌మహ్మద్, యాకయ్య, అమరేందర్, ఆయూబ్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7660	5300
మక్కలు	2100	1521
కందులు	5832	3022
పెసళ్లు	7022	3022
పల్లికాయ (సూక)	5500	3450
పల్లికాయ (పచ్చిది)	4900	1575
పసుపు (కాడి)	10198	9534
పసుపు (గోల)	10008	8700
తేజ మిర్చి	11500	8500
తేజ ఏసీ	14000	11500
వండర్‌హాట్	11500	6000
వండర్‌హాట్ ఏసీ	15000	11500
యూఎస్341ఏసీ	14200	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం



ఫార్మసీ సదస్సులో మాట్లాడుతున్న సరళాదేవి

టీబీ నిరోధక ఔషధాల తయారీకి ముందడుగు

హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్‌కుమార్

కేయూ క్యాంపస్ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి నిరోధన ఔషధాల తయారీలో కీలక ముందడుగు పడిందని హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె.నందకూరి ప్రకటించారు. మంగళవారం కేయూ ఆడిటోరియంలో మధ్యాహ్నం జరిగిన ప్లీనరీసెషన్‌లో డాక్టర్ వినయ్ కె.నందకూరి మాట్లాడారు. మైకోబాక్టీరియాతో క్షయవ్యాధి సోకుతుందని ట్యాబర్క్‌లోటస్‌లో ఔషధ నిరోధకత పెరుగుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో క్షయను నిరోధిస్తామని స్పష్టం చేశారు. సదస్సుకు టీసీఎస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ మోహన్‌రావు అధ్యక్షుడిగా వ్యవరించగా సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి.హన్మంతు ప్రెసిడింగ్ చేశారు.

గర్భాశయ క్యాన్సర్‌ను జయించవచ్చు..

మహిళలు గర్భాశయ క్యాన్సర్‌ను జయించవచ్చునని వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల స్త్రీల వైద్య నిపుణురాలు ప్రొఫెసర్ రమా సరళాదేవి సూచించారు. మంగళవారం కేయూ ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన సెషన్‌లో సరళాదేవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. పీసీఓడీ, గర్భాశయ క్యాన్సర్ అండ్రోజన్ అధిక ఉత్పత్తి, జంక్ ఫుడ్ వల్ల వస్తోందన్నారు. 17 ఏళ్లలోపు పెళ్లిల్లు అయ్యే ఆడపిల్లలకు హ్యూమన్‌పాపిలో వైరస్‌తో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. నిరోధకానికి గార్డసిల్ 4, 9, హెచ్‌పీ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. పొగతో మగపిల్లల్లో ఓరల్, ఆనల్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఐఐటీసీ సీనియర్ సైంటిస్టు డాక్టర్ నాగారపు లింగయ్య మాట్లాడుతూ.. దేశంలో క్యాన్సర్, టీబీ వ్యాధులకు సరసమైన ధరల్లో ఔషధాల తయారీ జరుగుతోందని చెప్పారు. గోమూత్రంతో క్యాన్సర్‌ను నిరోధించవచ్చునన్నారు. కేయూ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ వై.నరసింహారెడ్డిలు, జానపరెడ్డి కృష్ణవేణి, ప్రొఫెసర్ ఎం.సారంగపాణి, ప్రొఫెసర్ స్వరూపలు ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు.

కాగా ఫిజిక్స్ సెమినార్ హాల్‌లో యూజీసీ డీఏఈ సీఎస్ఆర్ ముంబయి మాజీ డైరెక్టర్ డాక్టర్ వసుదేవా సిరిగురి, హైదరాబాద్ ఎస్ఆర్ఎస్ ఎస్ఎఫ్ సైంటిస్టు డాక్టర్ వైకే సుబ్రహ్మణ్యం, మ్యాథ్స్ సెమినార్ హాల్‌లో ఐఐటీ ఖరగ్‌పూర్ గణితశాస్త్ర ప్రొఫెసర్ ఎన్.గణేశ్వన్వర్, ఓయూ గణితం రిటైర్డు ప్రొఫెసర్ కె.సత్యనారాయణ, కామర్స్ సెమినార్ హాల్‌లో ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, భారత ప్రభుత్వ ఏఐసీటీఈ అడ్వయిజర్, మెంబర్ సెక్రటరీ (వీసీ) ప్రొఫెసర్ మోరె రాములు, కెమిస్ట్రీ విభాగం సెమినార్ హాల్‌లో ఏఎంపీఆర్ఈ, సీఎస్ఐఆర్ భూపాల్ ప్రొఫెసర్ తల్లాడ భాస్కర్, హైదరాబాద్ బిట్స్ పిలానీ ఎమెరిటస్ ప్రొఫెసర్ బీఎం రెడ్డి, జువాలజీ విభాగం సెమినార్ హాల్‌లో హైదరాబాద్ ఎన్ఐఎన్, ఐసీఎంఆర్ సైంటిస్టు - ఎఫ్ డాక్టర్ కె.రాజేందర్‌రావులు ప్రసంగాలు నిర్వహించారు. కేయూ సెనెట్ హాల్‌లో హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది నిట్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, కెమిస్ట్రీ ప్రొఫెసర్ సుంకరిజ్యోతిల నేతృత్వంలో సదస్సు జరిగింది. సైన్స్ అభివృద్ధిపై కీలక ప్రసంగాలు చేశారు.

ఏఐ, డీప్ లర్నింగ్‌లతో అధునిక రక్షణ కృషి

ఏఐ, డీప్ లర్నింగ్ వంటి అధునిక సాంకేతిక రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు జరగుతున్నాయని డీఆర్‌డీఈ, ఎల్ఆర్‌డీఓ బెంగళూరు డైరెక్టర్ డాక్టర్ జి.విశ్వం అన్నారు. దేశ రక్షణకు సాంకేతిక రంగం కీలకమన్నారు. డీఆర్‌డీఏ రక్షణకు పరిశోధనలు చేస్తోందన్నారు. అకాడమీలు, పరిశ్రమలు, వివిధ సంస్థలతో సమన్వయం చేసుకుంటోందని తెలిపారు. వికసిత్ భరత్ 2047 లక్ష్య సాధనకు స్టార్ట్ అఫ్ మిషన్లను ఉత్సాహంగా నడుపుతామని చెప్పారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో యువత సత్తా చాటాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్ణారెడ్డి

- డిజిటల్ విప్లవంతో గొప్ప మార్పులు
- మల్టిపుల్ అప్రోచ్‌తో ముందుకు సాగాలి
- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్ణారెడ్డి
- తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలు ప్రారంభం



గిరిజన సంప్రదాయ నృత్యాకారులతో సతీశ్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వల్లూరి రామచంద్రం, ఈసం నారాయణ తదితరులు

కేయూ క్యాంపస్ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో యువత నైపుణ్యాలతో సత్తా చాటాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలక్రిష్ణారెడ్డి ఉద్బోధించారు. కేయూలో మూడు రోజుల పాటు జరిగే తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాల మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కేయూ ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహించగా గౌరవ అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలక్రిష్ణారెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డిజిటల్ విప్లవంతో గొప్ప మార్పులు వస్తున్నాయని చెప్పారు. యువత మల్టిపుల్ అప్రోచ్‌తో ముందుకుసాగాలని పిలపునిచ్చారు. నైపుణ్యాలు పెంచుకుని సాధికారికత సాధించాలన్నారు. దేశ యువత విద్య, వైజ్ఞానిక రంగాల్లో ప్రపంచానికి పోటీగా నిలుస్తోందని చెప్పారు. సైన్స్ క్రమబద్ధమైన అధ్యయనమని, టెక్నాలజీతో అన్ని రంగాల్లో ప్రాధాన్యత వహిస్తోందన్నారు. నాగరికతలో ప్రతీ తరంలో గొప్పమార్పులు వస్తున్నాని విశ్లేషించారు. 17, 18, 19 శతాబ్దంలో వచ్చిన మార్పులు 20 శతాబ్దంలో డిజిటల్ రంగంలో ప్రతిఫలిస్తున్నాయని అన్నారు. దేశంలో యువత 60 శాతం మేరకు ఉందన్నారు.

కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కేయూలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సు కేయూ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు గుర్తుగా టీసీఎస్-25, కేయూ సంయుక్తంగా నిర్వహిస్తోందన్నారు. సంక్షేమం, సేవ, సైన్స్ లక్ష్యంగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్వాంటం ఫిజిక్స్, ఎన్విరాల్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నూతన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అడిగిడుతోందన్నారు. వికసిత్ భారత్ - 2047 దిశగా తెలంగాణ రైజింగ్ సాగుతోందన్నారు. శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు, ఇండస్ట్రీల కలయిక అవసరమన్నారు. కేయూ పూర్వ విద్యార్థుల సంబంధాలను బలోపేతం చేసేందుకు అట్లాంటా, న్యూజెర్సీ, టెక్సాస్ (యూఎస్ఏ)లతో సహా ప్రపంచవ్యాప్తంగా గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహిస్తామని వెల్లడించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 100 ఏళ్లకు చేరుతోందన్నారు. వర్సిటీ తెలంగాణ సైన్స్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ సీహెచ్ మోహన్‌రావు మాట్లాడుతూ.. సామాజిక పరివర్తనకు సైన్స్ సాధనమన్నారు. దేశం సైన్స్‌కు కట్టుబడి ఉందన్నారు. దేశంలో స్వాతంత్ర్య అనంతరం జీవన ప్రమాణం, అక్షరాస్యత పెరుగిందన్నారు. విద్యార్థులకు క్రిటికల్ థింకింగ్ ఉండాలన్నారు. దేశ రక్షణ వ్యవస్థ బలమైందన్నారు. మన సత్తా ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి తెలిసిందన్నారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలకు వర్సిటీలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ లోకల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కేయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ భైరు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ఇన్నోవేటివ్ స్కిల్స్, ఎంపవర్‌మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫార్మషన్ యంగ్ ఇండియాపై తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ మూడు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని అన్నారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, ట్రెజరర్ ప్రొఫెసర్ ఎస్ఎంరెడ్డిలు సదస్సు ఉద్దేశాలను వివరించారు. వందన సమర్పణ చేశారు.

అబ్‌స్ట్రాక్టుల ఆవిష్కరణ

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ రెండో జాతీయ సదస్సును పురస్కరించుకుని ముద్రించిన పరిశోధన పత్రాల అబ్‌స్ట్రాక్టులను సదస్సుల్లో పాల్గొన్న ముఖ్యఅతిథి భారత రక్షణమంత్రిత్వ శాఖ సలహాదారు, డీఆర్‌డీఏ మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి, అతిథులు బాలక్రిష్ణారెడ్డి, కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, మోహన్‌రావు, సత్యనారాయణ, ప్రొఫెసర్ సీహెచ్ సంజీవరెడ్డి, డాక్టర్ నాగపూరి వేణుగోపాల్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. అలాగే టీసీఎస్ సహకారంతో వెలువరించిన రిటైర్డు రేడియో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగపూరి వేణుగోపాల్ వెలువరించిన భారతదేశంలో తొలి వనిత వైద్యులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కేయూ జియాలజీ అల్యూమినీ ఏజీఎస్ రెడ్డి రూపొందించిన ది రిసెర్చర్స్ కంపాస్ పుస్తకాన్ని అతిథులు స్టేజీపై ఆవిష్కరించారు.

గుస్సాడీ నృత్యాలు సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే హైదరాబాద్ సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ కె.నందుకూరి, డీఆర్‌డీఓ బెంగళూరు ఎల్ఆర్‌డీఈ డైరెక్టర్ జి.విశ్వం నేతృత్వంలో ప్లీనరీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ కె.అనితారెడ్డి, డాక్టర్ సుకుమారి, డాక్టర్ చిర్రా రాజు, నల్లగొండలోని మహాత్మాగాంధీ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ హత్తాప్ హుస్సేన్, కేయూ జియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, డీన్లు ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ జి.హన్మంతు, ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రొఫెసర్ మంచాల సదానందం, ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్, లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ట్రెజరర్, కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ బి.రమేశ్ ప్రొఫెసర్ ఈ. రాజనరేందర్, సత్తయ్య, స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్, తెలుగు విభాగాధిపతి మామిడి లింగయ్య, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి సంకినేని వెంకట్, చాడ రాధికారెడ్డి, దీపాజ్యోతి, మంద వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



:హాజరైన ప్రొఫెసర్లు, అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు

రూ.కోటి అప్పులు చేసి ఉడాయించిన వ్యాపారి?

ఆన్‌లైన్ గేమ్‌లు.. వ్యాపారంలో నష్టాలే కారణం

జనగామ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్‌లు, వ్యాపారంలో నష్టాల కారణంగా ఓ వ్యాపారి అప్పుల పాలై సుమారు రూ.కోటి పైగా అప్పుచేసి ఉడాయించిన ఘటన జనగామ జిల్లా కేంద్రంలో జరిగినట్లు ప్రచారం సాగుతోంది. జనగామలోని సూర్యాపేట రోడ్డులో చిల్లర కొంటా వ్యాపారం నిర్వహించే స్థానిక 50 ఏళ్ల వ్యాపారి ఆన్‌లైన్ రమ్మీ ఆటకు అలవాటు పడి, అప్పులు తెచ్చి మరీ గేమ్స్ ఆడేవాడని తెలుస్తోంది.

దీనికి తోడు తాను నిర్వహించే వ్యాపారంలోనూ తీవ్ర నష్టాలు రావడంతో అప్పులు పెరిగాయని సమాచారం. సుమారు రూ.కోటికి పైగా అప్పులు కావడంతో సోమవారం రాత్రికిరాత్రే ఉడాయించినట్లు స్థానికంగా ప్రచారం సాగుతోంది. వ్యాపారి ఉడాయించిన విషయం తెలియడంతో అప్పులు ఇచ్చిన వారు లబోదిబోమంటూ మొత్తుకుంటున్నారు. కొన్నేళ్ల నుంచి అద్దెఇంట్లో ఉంటూ వ్యాపారం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

పీఎంఏవై-జీ ఇళ్లల్లో భద్రత డొల్ల

లోక్‌సభలో ప్రస్తావించిన ఎంపీ కావ్య

హనుమకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (పీఎంఏవై-జీ) కింద గ్రామాల్లో నిర్మించిన ఇళ్లలో భద్రతా సమస్యలు ఉన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు.

మంగళవారం లోక్‌సభలో ఎంపీ ఈ అంశాన్ని లేవనెత్తారు. ఇళ్ల నిర్మాణం సరిగా లేకపోవడం, విద్యుత్ సమస్యలతో ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నారని అన్నారు. 2021 నుంచి ఇప్పటివరకు పీఎంఏవై-జీ కింద దేశంలో ఎన్ని ఇళ్లలో ఇటువంటి సమస్యలు ఉన్నాయో రాష్ట్రాల వారీగా వివరాలను కావ్య అడిగారు. అలాగే వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్ల భద్రతపై ఎలాంటి చర్యలు చేపట్టారో వాటి వివరాలను కూడా తెలియజేయాలని కోరారు. పీఏజేవై-జీ పథకం వల్ల గ్రామీణ కుటుంబాలకు ప్రయోజనాలు ఉన్నప్పటికీ వారి భద్రతా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. బలహీన వర్గాల కుటుంబాలు ప్రమాదంలో పడకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానం ఇస్తూ పీఎంఏవై-జీ పథకం కింద లబ్ధిదారులకు 1.20 లక్షల నుంచి 1.30లక్షల వరకు ఇల్లు కట్టుకోవడానికి సహాయం ఇస్తున్నట్లు చెప్పారు.

స్థానిక మేస్త్రీలతో ఇళ్లు కట్టించడానికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఫిర్యాదులు వస్తే 15 రోజుల్లో పరిష్కరించే విధానం ఉందని తెలిపారు.

ఉధృతంగా గోదావరి

- పేరూరు వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- రామన్నగూడెం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో...
- కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ఉరకలేస్తున్న ప్రవాహం



కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం

ఏటూరునాగారం రూరల్/మహదేవపూర్/వాజేడు, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరికలో చేరువలో ఉంది. గోదావరిలోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో మరింతగాపెరిగే అవకాశమున్నట్లు జలవనరుల శాఖ ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏటూరునాగారంలోని ముంపు ప్రాంతాలైన ఎస్సీకాలనీ, ఓడవాడలోని ప్రజలకు అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. మంగపేట మండలం కమలాపురంలోని ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇన్‌టేక్‌వెల్ వద్ద మధ్యాహ్నం 12 గంటలకు సముద్రమట్టానికి 8 మీటర్లు ఉండగా సాయంత్రానికి 6 గంటలకు 8.30 మీటర్లు నీటి మట్టం చేరింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాజేడు మండలంలో గోదావరి వేగంగా పెరిగింది. పేరూరు వద్ద సాయంత్రం 6 గంటలకు 17.67 మీటర్లకు నీటిమట్టం చేరింది. గోదావరి ప్రవాహం కారణంగా అంతర్రాష్ట్ర రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా మండలంలోని అంతర్గత రోడ్ల మీదకు గోదావరి వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి వేగంగా పెరుగుతోంది. బ్యారేజీ మొత్తం 59 గేట్లను ఎత్తి దిగువను నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో 7,46,328 క్యూసెక్కులు ఉంది.

కాళేశ్వరం వద్ద..

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ఉరకలెస్తోంది. గోదావరి, ప్రాణహిత నదులు జోరుగా ప్రవహిస్తున్నాయి. ఎగువ మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున వరద రావడం, తెలంగాణలో కురుస్తున్న వరుస వర్షాలకు గోదావరికి వరద పోటెత్తింది. మంగళవారం గోదావరి 10.50 మీటర్ల ఎత్తున ప్రవహిస్తోంది. వరద పోటుకు జ్ఞాన తీర్థం విగ్రహాలు సగం మునిగాయి. మంగళవారం ఉదయం నుంచే గోదావరి వరద పోటు జోరుగా సాగుతోంది.

ములుగు జిల్లాలో 98.4 మి.మీ.

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు జిల్లాలో సగటు వర్షపాతం 98.4 మి.మీటర్లు నమోదైంది. అత్యధికంగా ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో 187.2 మి.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా ములుగు జిల్లా కేంద్రంలో 28.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. వెంకటాపూర్ మండలంలో 28.2, తాడ్వాయి 113.6, గోవిందరావుపేట 36.8, కన్నాయిగూడెం 105.2, వాజేడు 78.4, వెంకటాపురం 145.2, మంగపేట 162.2 మి.మీ. వర్షపాతం రికార్డయింది.

పేరూరు వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

ములుగు జిల్లాలోని వాజేడు మండలంలో పేరూరు వద్ద గోదావరి ప్రమాద స్థాయి చేరుకుంది. మంగళవారం 15.750 మీటర్ల నీటమట్టం నమోదుకాగా రాత్రి 9 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరికగా 16.100 మీటర్లు నమోదైందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం నుంచి గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. కన్నాయిగుడెం మండలంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి అన్ని గేట్లను ఎత్తి వేయటంతో గోదావరికి వరద నీరు పోటేత్తింది. దీంతో మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు రాత్రి వేళ పునరావాస కేంద్రాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు.

భూపాలపల్లి జిల్లాలో 38.6 మి.మీ. వర్షపాతం

కృష్ణకాలనీ(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు మోస్తారు వర్షం కురిసింది. సింగరేణి ఏరియాలోని ఓసీ-2, ఓసీ-3లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. చెరువులు, కుంటల్లోకి భారీగా నీరు చేరింది. పలిమెల మండలంలో అత్యధికంగా 87.2 మి.మీ.వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా రేగొండ మండలంలో 21.0 మి.మీటర్ల వర్షపాతం రికార్డు అయ్యింది. జిల్లాలో సగటు వర్షపాతం 38.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. మహదేవపూర్‌లో 42.6, పలిమెలలో 87.2, మహముత్తారంలో 46.4, కాటారంలో 45.2 మల్హర్‌లో 28.4, చిట్యాల 27.6, టేకుమట్లలో 26.2, మొగుళ్లపల్లి 22.2, రేగొండ 21.0, గణపురం 21.2, భూపాలపల్లిలో 57.0, కొత్తపల్లిగోరి మండలంలో 12.3 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రుణ పునరుద్ధరణ బంగారమాయేనా!

(5వ పేజీ తరువాయి)

రూ.3లక్షలకు మించి బంగారు అభరణాలపై రుణాలు ఇవ్వకపోవటంతో తన పేరుతో పాటు భార్య, పిల్లలు, తల్లిదండ్రుల పేరు మీద కూడా బంగారం తాకట్టు పెట్టి అప్పులు తీసుకవస్తున్నారు. అయితే పంట దిగుబడి రాకపోవటంతోపాటు పిల్లల చదువులు, పెళ్లిలకు ఖర్చులు పెరుగుతుండటంతో బ్యాంకుల్లో అప్పులు అలాగే మిగిలిపోతున్నాయి. రైతులకు గత ఏడాది వరకు కూడా అప్పులకు వడ్డీ చెల్లిస్తే బ్యాంకర్లు రెన్యువల్ చేసేవారు. అయితే ప్రస్తుతం రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కొత్త నిబంధనలను తీసుకరావటంతో గోల్డ్ లోన్ రెన్యువల్‌లో అడ్డంకులు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బ్యాంకు రుణం తీర్చేందుకు అప్పులు

రైతులు విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పుడిప్పుడే వర్షాలు పడుతుండటంతో ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. దీంతోపాటు పాత అప్పులకు వడ్డీలు కట్టి కొత్తగా అప్పులు తీసుకునేందుకు రైతులు బ్యాంకుల చుట్టు తిరుగుతున్నారు. అయితే బంగారు రుణాలను తాకట్టు పెట్టి కాస్తంతా ఎక్కువ మొత్తంలో రుణాలు తీసుకోవాలనుకునే రైతులకు నిరాశే మిగులుతోంది. గోల్డ్ లోన్ రెన్యువల్ చేయాలంటే.. అసలుతో పాటు వడ్డీ కూడా కలిపి మొత్తం చెల్లించాలని బ్యాంకర్లు మెలిక పెడుతున్నారు. ఆర్‌బీఐ కొత్త నిబంధనల ప్రకారం అసలు, వడ్డీ చెల్లిస్తేనే గోల్డ్ రుణాలు రెన్యువల్ చేస్తామని కరాఖండిగా చెప్పుతున్నారు. చేతిలో చిల్లిగవ్వలేక పెట్టుబడికి అప్పుల కోసం బ్యాంకులకు వెళ్లిన రైతులకు పాత బాకీ అసలు, వడ్డీ చెల్లించాలని కోరుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

భూపాలపల్లిలోని ఓ జాతీయ బ్యాంకులో కొమురయ్య అనే రైతు బంగారు అభరణాలను తాకట్టు పెట్టి రూ.2,99,000 అప్పు తీసుకున్నారు. ఇందుకు రూ.27,514 వడ్డీ అయింది. అసలు, వడ్డీ మొత్తం కలిపి 3,26,514 చెల్లిస్తేనే తిరిగి రుణం రెన్యువల్ చేస్తామని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఒకటి రెండు రోజుల్లోనే అంత మొత్తాన్ని తీసుకువచ్చి బ్యాంకులో చెల్లించి, రుణాన్ని రెన్యువల్ చేసుకునే స్థోమత లేక సదరు రైతు ప్రవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది. అసలు, వడ్డీ చెల్లిస్తే ఒకటి, రెండు రోజుల్లో కొత్తగా రుణాన్ని ఇస్తామని బ్యాకర్లు చెప్పుతున్నప్పటికీ రైతు మాత్రం ఐదారు రోజుల్లో చెల్లిస్తామని రోజుకు లక్షకు వెయ్యి చొప్పున మూడు లక్షలకు రూ.3వేలు చెల్లించాల్సి వస్తుందని సదరు రైతు వాపోతున్నారు. ఇలా ఐదు రోజులకు రూ.15వేల వరకు ప్రైవేటు వడ్డీ వ్యాపారి చేతిలో పెట్టాల్సి వస్తోంది. అంటే రూ.3లక్షలకు ఏడాదికి రూ.27వేలు చెల్లిస్తే.. ప్రవేటు వడ్డీ వ్యాపారికి ఐదు రోజులకే రూ.15వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. బ్యాంకు వడ్డీ, ప్రవేటు వ్యాపారి వడ్డీ కలిపితే రూ.42వేలకు పైగా అవుతుండటంతో రైతుల కష్టం మిత్తీల పాలవుతుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల అప్పులు ఇచ్చేందుకు ప్రైవేటు వడ్డీ వ్యాపారులు కూడా లేకపోవటంతో కొంత మంది బ్యాంకు సిబ్బంది వడ్డీ వ్యాపారుల పాత్ర పోషిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. లక్షకు వెయ్యి చొప్పున అప్పు ఇచ్చి.. రుణం రాగానే వసూలు చేసుకుంటున్నారట.


ఆర్‌బీఐ నిబంధన కొంతమంది బ్యాంకర్లకు వడ్డీ వ్యాపారంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఇంకొన్ని చోట్ల గోల్డ్ లోన్‌కు సంబంధించిన అసలు లేకపోవటంతో రైతులు బంగారు అభరణాలను వేలం వేస్తామంటూ బ్యాంకుల నుంచి నోటీసులు, ఫోన్ కాల్స్ మెసేజ్‌లు కూడా వస్తున్నాయని ఆందోళన రైతులు చెందుతున్నారు. ఖరీఫ్ పంటలో సాగు బాట పట్టాల్సిన రైతులు.. బ్యాంకు రుణం తీర్చేందుకు ప్రవేటు వడ్డీ వ్యాపారుల ఇంటి చుట్టూ తిరుగాల్సి వస్తోందని వాపోతున్నారు.

పాత విధానమే మేలు

గోల్డ్ లోన్ విషయంలో పాత విధానాన్నే బ్యాంకర్లు అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. బంగారు అభరణాలను తాకట్టు పెట్టుకుని ఇచ్చే రుణాలకు అసలు కట్టకుండానే మిత్తీ చెల్లిస్తే, రుణాన్ని రెన్యువల్ చేసేవారు. దీంతో రైతులకు కూడా పెద్దగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యేవి కావని పేర్కొంటున్నారు.

బంగారం ధర పెరిగితే.. పెరిగిన ధరకు అనుగుణంగా లోన్ మొత్తం కూడా పెరిగేది. రైతుకు అవసరమయితే పెరిగిన బంగారం ధరకు అనుగుణంగా లోన్ మొత్తాన్ని పెంచి ఇచ్చే వారు. ప్రస్తుతం అసలు, వడ్డీ చెల్లించాలనే నిబంధన ఉండటంతో బంగారం ధర పెరిగిన లోన్ పెంచి ఇస్తామని బ్యాంకర్లు అంటున్నా.. రైతులు ససేమేరా అంటున్నారు. అసలు, వడ్డీ చెల్లించాలనే నిబంధనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్‌బీఐ దృష్టికి రైతుల ఆర్థిక పరిస్థితిని తీసుకెళ్లి.. బంగారు రుణాలను పాత పద్ధతిలో రెన్యువల్ చేసేలా ఒప్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని కోరుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీలు లేవనెత్తి రైతుల పక్షాన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చేందుకు కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రైవేటు వడ్డీలకు తెచ్చి రెన్యూవల్ చేసుకున్నా..



వర్ధన్నపేటలోని కెనరా బ్యాంకులో కొన్ని నెలల కిందట బంగారం తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నాను. పట్టాదారు పాసు పుస్తకం పెడితే ఎక్కువ రుణం అందించారు. ఇటీవల బంగారం రుణం రెన్యూవల్ చేయాలని బ్యాంకుకు వెళ్లగా, రెన్యూవల్ చేయాలంటే మొత్తం అమౌంట్ కట్టాలని బ్యాంకు అధికారులు సూచించారు. ఇదేంటని ప్రశ్నించగా మూడు నెలల నుంచి ఆర్బీఐ రూల్స్ మారాయని చెపుతున్నారు. దీంతో బయట వడ్డీకి తెచ్చి.. బంగారు రుణాన్ని రెన్యూవల్ చేసుకోవాల్సి వచ్చింది. చాలామంది రైతులు ఈ విధానంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

- దుబాసి సందీప్, వర్ధన్నపేట

ప్రజలను చైతన్య పరిచేందుకు యువత ముందుండాలి

ప్రజా వాగ్గేయకారుడు చుక్క రామనర్సయ్య

కేయూ క్యాంపస్ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్య పరిచేందుకు యువత ముందుండాలని ప్రజావాగ్గేయకారుడు చుక్క రామనర్సయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కేయూను సందర్శించి విద్యార్థి సంఘాల నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రామనర్సయ్య మాట్లాడుతూ.. కేయూతో పాటు వర్సిటీలు ఉద్యమాలకు నిలయాలుగా నిలిచాయని అన్నారు. సమాజంలో జరిగే అన్యాయాలను, అసమానతలను తొలగించాలని అన్నారు. పేదల పక్షాన విద్యార్థులు పనిచేయాలని సూచించారు. రాజకీయ పార్టీలు విద్యార్థులను పావులుగా వాడుకుంటున్నాయని అన్నారు. పాటకు సమాజాన్ని మేలుకొలిపే శక్తిఉందన్నారు. కళాకారులను ప్రభుత్వం, ప్రజలు ఆదరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ పరిశోధకులు డి.తిరుపతి, కేతపాక ప్రసాద్, కె.తిరుపతి, సూర్యకిరణ్, నాగరాజు, ఓ.చిరంజీవి, కళాకారులు ఎర్ర సూర్య పాల్గొన్నారు.



తీజ్ ఉత్సవాల్లో మాట్లాడుతున్న పోరిక వీరన్న నాయక్

అంబరాన్నింటిన తీజ్ సంబరాలు

వడ్డెపల్లి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ 57వ డివిజన్ వికాస్ నగర్‌లో తీజ్ ఉత్సవ కమిటీ కన్వీనర్, బంజారా సంక్షేమ సంఘం రాష్ట్ర కో కన్వీనర్ పోరిక వీరన్న నాయక్, బానోతు వెంకన్న నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన తీజ్ ఉత్సవాల సంబరాలు అంబరాన్నంటాయి. బంజారా మహిళలు సంస్కృతిని ప్రతిబింబిచేలా ఆట పాటలతో అలరించారు. తొలుత బంజారా ఆరాధ్య దైవాలు మేరా మాయాడీ, సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. వారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో తీజ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పోరిక అర్పిత నాయక్, సంగెం మాజీ జడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ నాయక్, జాటోత్ కిషన్ నాయక్, శ్రావన్ నాయక్, సోని నాయక్, సమ్మూలాల్, మూడు రమేష్ నాయక్, సందీప్, కిరణ్‌కుమార్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సుమతిరెడ్డిలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్

హసన్‌పర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి హాజరై కొత్తగా ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. అలాగే వివిధ విభాగాధిపతులు విద్యార్థులకు బోధన విధానాలు, ల్యాబొరేటరీ సదుపాయాలు, పరిశోధన అవకాశాలు, శిక్షణ, ప్లేస్‌మెంట్ అంశాలపై విపులంగా వివరిస్తారని తెలిపారు. ఇంజనీరింగ్‌లో మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని లష్కర్‌బజార్ మెయిన్ రోడ్డు, సిక్కువాడ, కిషన్‌పుర ఏరియాలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, లష్కర్‌బజార్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.

బోనం ఎత్తనున్న న్యూశాయంపేట

- ఉమ్మడి వరంగల్‌లో న్యూశాయంపేట బోనాలకు ప్రత్యేకత
- శ్రావణ మాసం చివరి గురువారం మొక్కులు సమర్పించుకోవడం ఆనవాయితీ



న్యూశాయంపేట పొచమ్మతల్లి

న్యూశాయంపేట, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): న్యూశాయంపేట ఊరంతా బోనమెత్తనుంది. ఊరంతా ఒకే రోజు బోనం ఎత్తడంతో పండుగ వాతావరణం నెలకొంటుంది. గ్రామాల్లో వారానికో ఓ కులస్తులు బోనాలు చేయడం సాధారణంగా గమినిస్తుంటాం. కానీ న్యూశాయంపేటలో మాత్రం ఒకే రోజు అన్ని కులాల వారు బోనాలు చేసి సందడి చేస్తారు. శ్రావణ మాసంలోని చివరి గురువారం ఇక్కడ బోనాలు చేయడం కొన్నేళ్లుగా వస్తున్న ఆచారం. బంధువులను పిలిచి కుటుంబసమేతంగా పోచమ్మను దర్శించుకొని తమను చల్లగా చూడాలని తల్లిని వేడుకుంటారు. బెల్లం శాక, వేపాకులతో బోనం నైతనపెట్టి తల్లిని స్మరించుకుంటూ ఊరు చివరిన ఉన్న ఆలయానికి చేరుకుంటారు.

కుమ్మరులే పూజారులు

న్యూశాయంపేటలో నిర్వహించే బోనాల పండుగకు కుమ్మరులే పూజారులుగా వ్యవహరిస్తారు.అమ్మవారి ప్రతిమను కుమ్మరి కులస్తులతో పాటు గ్రామంలోని వివిధ కులస్తులు ఊరేగింపుగా తీసుకొని రథ యాత్రగా వెళ్తారు. ఈ బోనాల పండుగలో మేకపోతుల బండి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. యాదవ కులస్తులు మేకపోతుల బండిని ఊరేగింపుగా తీసుకవస్తారు.గ్రామస్తులంతా కుటుంబసభ్యులతో కలిసి మేక పోతులబండితో వెళ్లిఅమ్మవారికి మొక్కులు చెల్లిస్తారు.

ఊరంతా సందడి

ఏటా శ్రావణ మాసంలో చివరి గురువారం వచ్చిందంటే న్యూశాయంపేటలో వారం ముందే పండుగ వాతావరణం నెలకొంటుంది. జీవనోపాధికోసం వివిధ ప్రాంతాలకు వెళ్లిన వారంతా బోనాల సమయంలో వచ్చి మొక్కులు సమర్పించుకుంటారు. కరీమాబాద్‌కు చెందిన ముస్లింలు మూడు రోజుల ముందే న్యూశాయంపేటకు వచ్చి గాజుల షాపులు ఏర్పాటు చేసి ఉపాధి పొందుతారు. మిఠాయి షాపులు, పిల్లలు ఆటవస్తువులను రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారులు విక్రయిస్తుంటారు. ఒక రకంగా చెప్పాలంటే గ్రామం ఓ జాతరను తలిపిస్తుంది.

మహిమ గల తల్లి పోచమ్మ



మహిమ గల తల్లి పోచమ్మ దేవత. పోచమ్మతల్లి ఉత్సవాల సందర్భంగా నా చిన్ననాటి నుంచి తల్లి ఊరేగింపు ఉత్సవ సమయంలో ప్రారంభం నుంచి ఊరేగింపు అయిపోయే వరకు సైనికుడిలా ఉంటా. కార్పొరేటర్‌గా పోచమ్మ బోనాల ఉత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖ శాంతులతో ఉండాలి.

- మామిండ్ల రాజు యాదవ్, 31వ డివిజన్ కార్పొరేటర్

ముందుండి నడిపిస్తాం...



పూర్వపు కాలం నుంచే పోచమ్మ బోనాలను మా కుటుంబం ముందుండి నడిపిస్తుంది. న్యూశాయంపేట ప్రజలు మాకు ఇచ్చిన గౌరవం. శ్రావణ మాసంలో చివరి గురువారంలో బోనాలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఊరంతా కలిసి కట్టుగా బోనాలను చేసుకుంటాం.

- వేల్పుల మోహన్‌రావు, మాజీ కార్పొరేటర్

చర్చి స్థలాన్ని ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం

అధికారులు పట్టించుకోవడం లేదంటున్న బాధితులు

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చర్చి స్థలాన్ని ఆక్రమించుకొని ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేస్తూ ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. బాధితుల కథనం ప్రకారం.. 53వ డివిజన్‌లోని లష్కర్‌సింగారంలో ఐపీసీ చర్చి పార్కింగ్ కోసం 2002లో 84గజాల స్థలాన్ని నక్క కనుకమల్లయ్య, పుల్లా భాస్కర్ దానం చేశారు. స్థలం పక్కకే నివాసం ఉంటున్న కడారి శోభ, కడారి యాదమ్మలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో చర్చి పార్కింగ్ స్థలంలో రాత్రికి రాత్రి బోరు వేసి ఇంటి నిర్మాణం కోసం పిల్లర్లు తవ్వరన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, హౌసింగ్ కార్పొరేషన్ పీడీ, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు.

వెంటనే ఇద్దరికీ కేటాయించిన ఇందిరమ్మ ఇళ్లను రద్దు చేయాలని ఐపీసీ చర్చి సభ్యులు రిబ్కారాణి, సందీప్, బాబులు అధికారులను కోరారు.

ఆరోగ్య మహిళ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్య క్లినిక్‌లో లభించే సేవలను వినియోగించుకోవాలని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. గోపాల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా క్లినిక్‌ను సందర్శించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఫార్మసీ, ల్యాబ్, వ్యాక్సిన్ భద్రపరిచే విభాగం, రికార్డును పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో జ్వర సర్వే, డ్రైడే పాఠశాలల్లో నిర్వహించే మెడికల్ క్యాంప్ వివరాలను వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ సాహితీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో గ్యాస్ పొయ్యి ప్రారంభం



అయోధ్యపురం పాఠశాలలో గ్యాస్ పొయ్యిని ప్రారంభిస్తున్న హెచ్ఎం మన్నె చంద్రయ్య

మడికొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాజీపేట మండలం అయోధ్యపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వం హెచ్‌పీ గ్యాస్‌ను మంజూరు చేసింది. స్థానిక పాఠశాల హెచ్ఎం మన్నె చంద్రయ్య కొబ్బరికాయ కొట్టి గ్యాస్ పొయ్యిని ప్రారంబించారు. దీంతో మధ్యాహ్న భోజనం వంటకానికి కట్టెల పొయ్యికి బదులు గ్యాస్‌పొయ్యి మంజూరు కావడంతో వంట కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జేరిపోతుల దివ్య పాల్గొన్నారు.

స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డు తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల, కళాశాలలో పనిచేసేందుకు రెండు స్వీపర్ (స్కావెంజర్) పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఇందుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు కళాశాలలో పనిచేసేందుకు ఒకరు, పాఠశాలలో పనిచేసేందుకు మరొకరు రెండు పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెలకు వేతనం రూ.15600 ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు టీఎస్ఆర్‌జేసీ హసన్‌పర్తి ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

రవీందర్‌కు ఫిజిక్స్‌లో డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల రవీందర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్‌లో డాక్టరేట్‌ను ప్రకటించింది. ఓయూ ప్రొఫెసర్ కటకం మధుకర్ పర్యవేక్షణలో 'గ్రీన్ సింథసిస్ డిరైవ్డ్ సల్ఫైడ్ టెల్లు రైడ్ బేస్డ్ నానో స్ట్రక్చర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ అప్లికేషన్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి రవీందర్‌కు డాక్టరేట్ ప్రకటించింది. కాగా రవీందర్ హనుమకొండలోని పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

ఏడుగురి డ్రైవింగ్ లైసెన్స్ తాత్కాలికంగా రద్దు

మట్టెవాడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఏడుగురి డ్రైవింగ్ లైసెన్స్‌లను ఆరునెలల పాటు సస్పెండ్ చేశారు. మంగళవారం నగరంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రంగశాయిపేటకు చెందిన మహ్మద్ అబ్దుల్ సలీం, ఖిలావరంగల్‌కు చెందిన అనుమాండ్ల భిక్షపతి, కస్తూరి శ్రీనాథ్, కొత్తవాడకు చెందిన ఆనందం శివకుమార్, ఏసీరెడ్డి నగర్‌కు చెందిన శ్రీరాముల రమేష్, తీగరాజుపల్లికి చెందిన రంగరాజు హరినాథ్, గొర్రెకుంటకు చెందిన శ్రీరాముల సాయికుమార్ అధిక మోతాదులో మద్యం సేవించి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో ట్రాఫిక్ సీఐ సుజాత సిఫారసు మేరకు జిల్లా రవాణా శాఖ అధికారి వారి లైసెన్స్‌లను ఆరు నెలల పాటు రద్దు చేశారు.

అమ్మవారి సన్నిధిలో ములుగు కలెక్టర్

వరంగల్ కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళి అమ్మవారిని మంగళవారం ములుగు జిల్లా కలెక్టర్ దివాకర దంపతులు దర్శించుకున్నారు. ఈవో రామల సునిత వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకుడు భద్రకాళి శేషు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

గిర్మాజిపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ క్రిస్టియన్ కాలనీకి చెందిన పోలెపాక రాబిన్‌సన్ (71) వ్యవసాయ మార్కెట్ గ్రేడ్1 ఉద్యోగిగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. వారి కుమారుడు అమెరికాలో ఉంటుండగా భార్య హెప్సిబాతో కలిసి ఆయన ఇక్కడే నివాసం ఉంటున్నారు. మూడు సంవత్సరాలుగా మూత్రపిండాలు, మధుమేహం, రక్తపోటు తదితర కారణాలతో బాధపడుతున్నారు. ఇటీవల ఆయన ఆరోగ్యం క్షీణించడంతో జీవితంపై విరక్తిచెంది మంగళవారం ఉదయం వరంగల్-చింతల్‌పల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ ఎస్.రవీందర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారని సీఐ పి.సురేందర్ తెలిపారు.

మునిసిపల్ భవనానికి మరమ్మతులు చేపట్టండి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- గ్రేటర్ మునిసిపల్ కార్యాలయంలో క్షేత్రస్థాయి పరిశీలన



మునిసిపల్ కార్యాలయంలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం పైకప్పు (సీలింగ్) పెచ్చులు ఊడి ప్రమాదకరంగా మారిందని, భవనానికి మరమ్మతులు చేపట్టాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. మంగళవారం ప్రధాన కార్యాలయం పురాతన భవనంతో పాటు మేయర్ చాంబర్‌పై అంతస్తును పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవన స్థితిగతులను అక్కడి ఇంజనీర్లను అడిగి తెలుసుకుని సమర్థవంతంగా పనులు నిర్వర్తించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బల్దియా ప్రధాన కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఇటీవల హెల్త్ సెక్షన్‌లో పైకప్పు సీలింగ్ ఊడిపోయి కంప్యూటర్లపై పడ్డట్టు తెలిసిందన్నారు. ఉద్యోగుల భద్రత అతి ముఖ్యమని, ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. కూలిన సీలింగ్ ప్రాంతంలో పాటు మిగతా ప్రాంతాల్లో మరమ్మతు చేయించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. డెత్, బర్త్ సెక్షన్‌లలో పని చేస్తున్న సిబ్బంది మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు మేయర్ చాంబర్‌లోని ఓ గదిని వాడుకోవాని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, పర్యవేక్షణాధికారి రావుల ఆనంద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి నూతన కమిటీ సభ్యులు

లయన్స్ సేవలను విస్తరించాలి

హసన్‌పర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): లయన్స్ సేవలను విస్తరించి సమాజ సేవకు కృషి చేయాలని లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట వద్ద ఓ ఫంక్షన్ హాలులో లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి 19వ కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం లయన్ ఇనుముల కృపాకర్ అధ్యక్షతన జరిగింది. రెండో ఉప జిల్లా గవర్నర్ లయన్ పుట్ట హరికిషన్‌రెడ్డి నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షుడిగా లయన్ ఆరెపల్లి శాంతికిరణ్, కార్యదర్శిగా శ్యాంసుందర్, కోశాధికారిగా మోర రవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ అజిత్‌కుమార్ స్వాగతోపన్యాసం చేయగా ముఖ్య అతిథిగా లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా హాజరై మాట్లాడారు.

లయన్స్ సేవలను విస్తృత పర్చాలంటే ఎక్కువ లయన్ సభ్యులు అవసరమన్నారు. దీంతో ఎక్కువ సర్వీసులు చేసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పూర్వ జిల్లా గవర్నర్, మల్టీపుల్ క్వెస్ట్ కోఆర్డినేటర్ లయన్ ముచ్చ రాజిరెడ్డి, మొదటి ఉపజిల్లా గవర్నర్ లయన్ నరహరి సుధాకర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పావుశెట్టి శ్రీధర్, నాగమల్ల సుధీర్, చెన్నూరి శ్రీనివాస్, చిలగాని మోహన్, గంగారపు రజనీకాంత్, గోనెల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయండి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- టౌన్‌ప్లానింగ్, మెప్మా అధికారులతో సమావేశం



కుడాలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో నూతన వెండింగ్ జోన్‌ల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం హనుమకొండ కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్, మెప్మా అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం నగరంలో ఉన్న స్ట్రీట్ వెండింగ్ జోన్‌లతో పాటు మరికొన్ని చోట్ల ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం సాధ్యం కాని జోన్ల పూర్తి వివరాలను తనకు అందించాలన్నారు. ప్రస్తుతం 11 జోన్లు ఉన్నాయని, మున్సిపల్ చట్టం ప్రకారం వీధివ్యాపారులు కేటాయించిన జోన్లకు వెళ్లి వ్యాపారాలు చేసుకోవాలన్నారు. ఇంకా వరంగల్ నగరంలో ఎస్‌హెచ్‌జీ కొత్త గ్రూపులు తయారుచేసి వారికి ఆర్థిక సహకారం అందించాలన్నారు.

ఈ యేడు 381 కొత్త గ్రూపుల లక్ష్యాన్ని నిర్ధేశించామని, ఇప్పటివరకు 110 గ్రూపులు తయారు చేశామన్నారు. అన్ని గ్రూపులకు కలుపుకుని బ్యాంకు లింకేజీ లక్ష్యం రూ.200కోట్లు కాగా, ఇప్పటివరకు రూ. 54 కోట్ల లింకేజీలు పూర్తయ్యాయని అన్నారు. టీఎల్ఎస్ సంఘాలు పెద్ద యూనిట్‌లను ఏర్పాటు చేసుకుంటే పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీ రవీందర్, ఏసీపీలు రజిత, ఇర్షాద్, టీఎంసీలు రమేష్, వెంకటరెడ్డి, టీపీఎస్‌లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలపై కేబుల్‌వైర్లను సరిచేయాలి..

విద్యుత్ అధికారులకు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలు

రాంనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్ వైర్లను సంబంధిత కేబుల్ ఆపరేటర్లు క్రమపద్ధతిలో సరిచేసుకునేలా చర్యలు చేపట్టాలని, లేదంటే తొలగించాలని విద్యుత్ అధికారులను సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల ఎస్ఈలు, ఆపరేషన్, టెక్నికల్ డీఈలతో మంగళవారం సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. గత ఏడాది నుంచి స్తంభాలపై కేబుల్ వైర్లు తొలిగించమని చెబుతున్నప్పటికీ కేబుల్ ఆపరేటర్లు పట్టించుకోవడం లేదని, దీనిపై తక్షణమే సర్కిల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్తంభాలపై గుత్తులుగా కేబుల్ వైర్లు ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే సరిచేయాలన్నారు. వినాయక తయారీ కేంద్రాలను సందర్శించి, ఆదారిలో ప్రమాదభరితంగా ఉన్న లైన్‌లను క్లియరెన్స్ చేయాలన్నారు. ఎత్తు గల విగ్రహాలు తరలిస్తున్న సమయంలో లైన్‌లకు తగలకుండా డిస్‌కనెక్షన్ చేయాలని సూచించారు. దుర్గామాత పండుగ సైతం సమీపిస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. వినాయక నిమజ్జనం మార్గాలన్నీ తనిఖీ చేయాలన్నారు. రూట్ క్లియరెన్స్ ఉండేలా సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. వినాయక మండలపాల నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేసి జాగ్రత్తలు సూచించాలన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ పండుగలను దిగ్విజయంగా పూర్తి చేయాలన్నారు.

విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లు తొలిగింపు

విద్యుత్ స్తంభాలపై ప్రమాదకరంగా ఉన్న వివిధ సంస్థలకు చెందిన కేబుల్ వైర్లను మంగళవారం సాయంత్రం గ్రేటర్ వరంగల్‌లో ఎన్పీడీసీఎల్ అధికారులు తొలగించారు. సరిచేసుకోవాలని సూచించినప్పటికీ కేబుల్ ఆపరేటర్లు స్పందించడం లేదన్నారు. ముప్పుగా మారిన కేబుల్స్‌ను సీఎండీ ఆదేశాల మేరకు తొలగించినట్లు హనుమకొండ, వరంగల్ డివిజన్ విద్యుత్ అధికారులు తెలిపారు. అదే విధంగా వరంగల్ డివిజన్‌లో వినాయక తయారీ కేంద్రాలను సందర్శించి ప్రతిమల ఎత్తును అడిగితెలుసుకొని షాపుల ఎదుట విద్యుత్ వైర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈలు సాంబరెడ్డి, మల్లికార్జున్, ఏడీఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
20 ఆగస్టు 2025

ఫ్యాషన్

కవ్వించే కుర్తా

పొట్టిగా, పొందికగా ఉండే షార్ట్ కుర్తాలు ఎంతో సౌకర్యంగా ఉంటాయి. వీటిని సరైన బాటమ్స్‌తో జోడిస్తే సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా వెలిగిపోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం!



- జీన్స్, లెగ్గింగ్స్, జెగ్గింగ్స్ ధరించినప్పుడు సౌకర్యంగా ఉండే షార్ట్ కుర్తాలు వేసుకోవచ్చు
- కాటన్, సింథటిక్ మెటీరియల్స్‌లో దొరికే ఈ చిట్టిపొట్టి కుర్తాలు ఆకర్షణీయంగా, ఆధునికంగా ఉంటాయి
- సౌకర్యానికి పెద్ద పీట వేసే షార్ట్ కుర్తాలను లాంగ్ స్కర్ట్‌తో మ్యాచ్ చేయొచ్చు
- ఈవినింగ్ పార్టీలు, ఫ్రెండ్స్‌తో హ్యాంగవుట్స్‌కు షార్ట్ కుర్తాలు స్టైలిష్‌గా ఉంటాయి.



- లతలు, పువ్వుల డిజైన్లు ఉన్న షార్ట్ కుర్తాలు యాంకిల్ లెంగ్త్ జీన్స్‌కు చక్కగా సూటవుతాయి. పెన్సిల్ హీల్స్‌ను ఈ డ్రస్‌కు మ్యాచ్ చేస్తే చూడముచ్చటగా కనిపిస్తారు
- సింపుల్‌గా, హుందాగా కనిపించాలనుకునేవాళ్లు షార్ట్ కుర్తాలను ఎంచుకోవచ్చు
- చికన్ వర్క్ కుర్తాల్లో షార్ట్ లెంగ్త్ కూడా ఉంటాయి. ఇవి కాలేజీ అమ్మాయిలకు చక్కగా సూటవుతాయి. సినిమాలు, షికార్లకు ఈ రకం కుర్తాలు అనువైన స్టైల్!



షార్ట్ కుర్తా ఫుల్ హ్యాండ్స్ వేసినా, షార్ట్ హ్యాండ్ ఉన్నా, స్లీవ్‌లెస్ అయినా... ఎలా ఉన్నా అందంగానే ఉంటుంది. కాబట్టి సందర్భాన్ని బట్టి అనువైన కుర్తా ఎంచుకోవాలి.



యాక్సెసరీస్ ఇలా...

- యాంటిక్ జ్యువెలరీ, ఉడెన్ లేదా టెర్రకోటా జ్యువెలరీ ఈ తరహా దుస్తులకు నప్పుతాయి
- స్లింగ్ బ్యాగ్ చక్కగా మ్యాచ్ అవుతుంది
- హై హీల్స్, ఫ్లాట్స్.. రెండు రకాల ఫుట్ వేర్ వేసుకోవచ్చు
- భారీ నెక్లెస్‌లూ, కడాలూ లాంటివి ధరించకపోవడమే మేలు

బాలికల భవిష్యత్తుకు భరోసా

పద్నాలుగేళ్లకే పెళ్లి... మరో ఏడాదికే బిడ్డ బాధ్యతలు... నిత్యం భర్త వేధింపులు... అన్నిటినీ తట్టుకొని, పరిస్థితులకు ఎదురుతిరిగారు **రోషిణీ పర్వీన్.** మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవడంతో పాటు... బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను చాటి చెబుతూ బాలికలను అప్రమత్తం చేస్తున్నారు. ఆమె అవిశ్రాంత కృషి అంతర్జాతీయంగా ప్రశంసలు పొందుతోంది...



"బిహార్ రాష్ట్రంలోని సిమల్‌బరీ అనే చిన్న గ్రామం మాది. నిరుపేద కుటుంబం అయినప్పటికీ... ఆ ఇబ్బందులేవీ తెలియకుండా ఆడుతూ పాడుతూ పెరిగాను. కానీ నాకు పద్నాలుగేళ్ల వయసున్నప్పుడు... పరిస్థితులన్నీ ఒక్కసారిగా మారిపోయాయి. అప్పుడు నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. మా అమ్మానాన్నా నాకు పెళ్లి చెయ్యాలని ప్రయత్నం మొదలుపెట్టారు. అప్పుడే పెళ్లి వద్దనీ, నాకు చదువుకోవాలని ఉందని మొత్తుకున్నాను. కానీ వాళ్లు వినలేదు. టెన్త్‌లోకి వచ్చీ రాగానే నాకు వివాహం చేశారు. నా భర్త వయసు నలభై అయిదేళ్లు. అంటే నా వయసుకన్నా మూడింతలు ఎక్కువ. ఎంతో సంకోచంతో అత్తింట్లోకి అడుగుపెట్టాను. ఆ మరునాటి నుంచే నరకం అంటే ఏమిటో నాకు అనుభవంలోకి వచ్చింది. నా భర్త నన్ను అనుక్షణం వేధించేవాడు. అనుమానంతో కొట్టేవాడు. ఆ బాధలు భరించలేక మూడు నెలలకే అక్కడ్నించి పారిపోయి... పుట్టింటికి వచ్చాను. కొన్నాళ్లకే... నేను గర్భవతినని తెలిసింది. ఆ రోజు ఎంతో విలపించాను.



సంబంధం లేదని తరిమేశాడు...

నేను ప్రసవించి, మగబిడ్డను కన్నాను. ఆ తరువాత మావాళ్లు మళ్లీ నన్ను నా భర్త ఇంటికి పంపించారు. దాదాపు ఏడాదిపాటు తనకు దూరంగా ఉన్న నన్ను ఇంటికి రానిచ్చేది లేదని అతను చెప్పాడు. అంతేకాదు, తనకూ, నాకూ ఎలాంటి సంబంధం లేదని తరిమేశాడు. మరోవైపు సమాజం నుంచి వెక్కిరింపులు మొదలయ్యాయి. నా పుట్టింటివారి స్థోమత అంతంతమాత్రం. నన్ను, నా బిడ్డను చంపుకోవాలా? లేదా పరిస్థితులకు ఎదురు నిలిచి పోరాడాలా? రెండో మార్గాన్నే ఎంచుకున్నాను. ఒక షోరూంలో పనిలో చేరాను. అప్పుడే 'చైల్డ్ లైన్ ఇండియా ఫౌండేషన్' అనే సంస్థ ప్రతినిధులతో పరిచయం అయింది. అంతదాకా ఎంతో న్యూనతతో ఉండేదాన్ని. కానీ నాచుట్టూ నాలాంటివారు ఎందరో కనిపించారు. మా రాష్ట్రంలో... ప్రతి అయిదుగురు మహిళల్లో ఇద్దరికి... పద్దెనిమిదేళ్లు రాకముందే వివాహం జరుగుతోందన్న వాస్తవాన్ని 'నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే' (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) నివేదికలు వెల్లడించాయి. కానీ అంత చిన్న వయసులో వివాహితలైన బాలికల దుస్థితిని సమాజం ఎందుకు పట్టించుకోవడం లేదు? కనీసమైన చదువు లేకుండా, భర్తల నుంచి, అత్తింటి వారి నుంచి నిరంతర వేధింపులను సహిస్తూ, సమాజం విధించే ఆంక్షలను భరిస్తూ రాలిపోతున్న మహిళలు ఎంతోమంది ఉన్నారు. దీనికంతటికీ కారణం బాల్య వివాహాలు. అందుకే వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిశ్చయించుకున్నాను. 'సేవ్ ది చైల్డ్', 'యునిసెఫ్' లాంటి సంస్థల భాగస్వామ్యంతో గ్రామ గ్రామానికి తిరిగి... బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించడం ప్రారంభించాను.

బాలికల బృందాల ఏర్పాటు...

గత రెండేళ్లలో దాదాపు అరవైకి పైగా బాల్య వివాహాలను స్వయంగా ఆపగలిగాను. కొన్ని వేల మంది బాలికల్లో చైతన్యాన్ని తీసుకువచ్చాను. దీనికి స్థానిక ప్రజాప్రతినిధుల సాయం తీసుకున్నాను. నేను, మరికొందరు కార్యకర్తలు కలిసి... ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతోందని తెలిస్తే... అక్కడికి వెళ్లి, వధువు తల్లిదండ్రులకు నచ్చజెప్పి వాటిని నిరోధిస్తున్నాం. కొన్నిసార్లు కౌన్సెలింగ్ సరిపోకపోవచ్చు. అలాంటి సమయాల్లో జిల్లా మేజిస్ట్రేట్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, పోలీసులు, బాలల అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారులు తదితరుల సహకారం తీసుకుంటున్నాం. బాల్య వివాహాలు చట్టరీత్యా శిక్షార్హమైన నేరం అనేది అర్థమయ్యేలా చెబుతున్నాం. తమ కూతుర్లకు పద్దెనిమిదేళ్లు వచ్చేదాకా పెళ్లి చేయబోమని తల్లితండ్రుల నుంచి అఫిడవిట్ తీసుకుంటున్నాం. మరోవైపు పలు గ్రామాల్లో బాలికల బృందాలను ఏర్పాటు చేశాను. వీరందరూ తమ ఇబ్బందులను కలిసి చర్చించుకుంటారు. బాల్య వివాహాల కోసం కుటుంబ సభ్యులు ఒత్తిడి చేస్తే... వెంటనే మాకు సమాచారం అందిస్తారు. కౌన్సెలింగ్, అవగాహన కల్పించడం, సామాజిక చైతన్యం, ప్రజల భాగస్వామ్యం... వీటి ద్వారా మాత్రమే బాల్య వివాహాలను అరికట్టగలం. అలాగే బాలికల విద్య, ఆరోగ్యం, సాధికారత లాంటి అంశాలపైన కూడా నేను పని చేస్తున్నాను. వారికి ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాలు అందేలా చూస్తున్నాను. వారి స్వయం ఉపాధికి సహకారం అందిస్తున్నాను."

అదే నా కల...

"నా ప్రయత్నాలకు దేశ, విదేశీ సంస్థల నుంచి గుర్తింపు లభించింది. 2022లో జెనీవాలో ఐక్యరాజ్య సమితి సదస్సులో పురస్కారాన్ని అందుకున్నాను. ఆ సదస్సులో నా ప్రసంగానికి మంచి స్పందన వచ్చింది. చిన్న వయసులోనే నాకు పెళ్లి జరిగి, గర్భవతిని అయినప్పుడు... జీవించాలనే ఆశను కోల్పోయాను. కానీ ఎంతోమంది బాలికలు చిన్న వయసులోనే వివాహం అనే సంకెళ్ల నుంచి బయటపడడానికి సాయం చేయగలగడం నాకు ఒక లక్ష్యాన్ని ఇచ్చింది. ఇప్పుడు... నాకు ఒకే ఒక కల ఉంది... నా జీవితకాలంలో బాల్య వివాహాలు లేని భారతదేశాన్ని చూడాలన్నది."

ఆరోగ్యశ్రీ గణాంకాల ఆధారంగా..

క్యాన్సర్ అట్లాస్ తయారుచేయాలి

రాష్ట్ర ప్రజల్లో ప్రతి ఒక్కరికీ 100 కిలోమీటర్ల పరిధిలోనే ప్రాథమిక క్యాన్సర్ కేర్ లభించేలా చర్యలు తీసుకోవాలి

- చికిత్స కోసం ప్రజలు రాష్ట్రం దాటి వెళ్లే పరిస్థితి ఉండొద్దు
- పిల్లల కోసం అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుచేయాలి
- హైదరాబాద్‌లో క్యాన్సర్ సింపోజియం నిర్వహించాలి
- రాష్ట్ర సర్కారుకు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు సూచనలు
- పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పలు వివరాలు



హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ ఆరోగ్యశ్రీలో నమోదయ్యే క్యాన్సర్ కేసుల గణాంకాలను విశ్లేషించి, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన క్యాన్సర్ అట్లాస్‌ను తయారుచేయాలని ప్రముఖ రేడియేషన్ అంకాలజిస్టు, రాష్ట్ర ప్రభుత్వ క్యాన్సర్ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు సూచించారు. 2030 నాటికి రాష్ట్రంలో ప్రతి పౌరుడికీ తాను ఉన్న చోటుకు 100 కిలోమీటర్ల పరిధిలోనే ప్రాథమిక క్యాన్సర్ కేర్ లభిస్తుందని ప్రభుత్వం ప్రకటించాల్సిందిగా కోరారు. ఏ పౌరుడూ క్యాన్సర్ చికిత్స కోసం రాష్ట్రం విడిచి వేరే చోటుకు వెళ్లే పరిస్థితి ఉండకూడదని పేర్కొన్నారు. పరీక్షలు, ముందస్తు గుర్తింపు ద్వారా క్యాన్సర్ మహమ్మారి భారాన్ని తగ్గించుకోవచ్చని ఆయన భరోసా ఇచ్చారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించి.. నిర్ధారణ అయిన వారిని సూపర్ స్పెషాలిటీ సేవలందించే ఆస్పత్రులకు రిఫర్ చేయాలన్నారు. మంగళవారం సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశానికి డాక్టర్ నోరి దత్తాత్రేయుడు హాజరయ్యారు. క్యాన్సర్ మహమ్మారిపై రాష్ట్ర దృక్కోణంలో ఒక పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. తెలంగాణలో క్యాన్సర్ కేసులు గత ఐదేళ్లలో 12.48% మేర పెరిగాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఐసీఎంఆర్, ఎన్‌సీడీఐఆర్(నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్ఫోమేటిక్స్ అండ్ రిసెర్చ్) గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 2020లో 47,620 క్యాన్సర్ కేసులు నమోదు కాగా.. ఇప్పుడా సంఖ్య 53,565కు పెరిగిందన్నారు. రాష్ట్రంలో మగవారి కంటే మహిళల్లోనే క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నట్లు వెల్లడించారు. 70 ఏళ్లలోపువారిలో ప్రతి ఏడుగురు మహిళల్లో ఒకరు, ప్రతి 9 మంది పురుషుల్లో ఒకరు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. 2025 చివరినాటికి దేశంలో కొత్తగా 14.7 లక్షల క్యాన్సర్ కేసులు నమోదు అవుతాయని, రాష్ట్రంలో కేసుల సంఖ్య 55 వేలకు పెరుగుతుందని తెలిపారు. దేశంలో రోజూ 1500 మంది క్యాన్సర్‌తో మరణిస్తుండగా.. ఒక్క గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తోనే 200 మంది మహిళలు మృత్యువాత పడుతున్నట్లు తెలిపారు. 900 మంది పొగాకు ఉత్పత్తుల కారణంగా కన్నుమూస్తున్నారని చెప్పారు. క్యాన్సర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

ఇవీ డాక్టర్ నోరి సూచనలు..

- క్యాన్సర్‌ను గుర్తించదగిన వ్యాధిగా పరిగణించాలి.
- సీబీసీఆర్(కేస్ బేస్డ్ క్లినికల్ రీజనింగ్), హెచ్‌బీసీఆర్ (హాస్పిటల్ బేస్డ్ క్యాన్సర్ రిజిస్ట్రీ), రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం, జీహెచ్‌ఎంసీ డేటాల ఆధారంగా క్యాన్సర్ కేసుల గణాంకాలను రూపొందించాలి.
- నిమ్స్ లేదా ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో సీసీసీ (సెంట్రలైజ్డ్ క్యాన్సర్ కేర్ కోఆర్డినేటర్ ఫర్ ది స్టేట్)ను ఏర్పాటు చేయాలి.
- రాజీవ్ ఆరోగ్యశ్రీ డేటాను సమగ్రంగా విశ్లేషించి, రాష్ట్రం కోసం క్యాన్సర్ అట్లాస్‌ను అభివృద్ధి చేయాలి.
- తెలంగాణలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఇన్‌స్టిటిట్యూట్ ఆఫ్ పీడియాట్రిక్ అంకాలజీని ఏర్పాటు చేయాలి (ఎంఎన్‌జేలో ఇప్పటికే వంద పడకలతో పీడియాట్రిక్ అంకాలజీ యూనిట్ నడుస్తోంది)
- 33 ప్రభుత్వ వైద్య కళాశాలల అనుబంధ ఆస్పత్రుల్లో క్యాన్సర్ కేర్ ప్రోగ్రామ్‌ను అమలు చేయాలి.
- క్యాన్సర్ నివారణ చర్యల్లో భాగంగా కళాశాల విద్యార్థులకు ఆ మహమ్మారిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి. అందులో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను భాగస్వామ్యం చేస్తూ.. ఆ అవగాహన బాధ్యతను నిమ్స్ లేదా ఎంఎన్‌జే ఫ్యాకల్టీ తీసుకోవాలి.
- నిమ్స్‌లో క్యాన్సర్ కేర్ ప్రోగ్రామ్ కోసం ఒక చైర్మన్‌ను నియమించాలి. అక్కడ హెచ్‌వోడీల్లో ఒకరిని అందుకోసం ఎంపిక చేయాలి.
- నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రుల సంయుక్త భాగస్వామంతో వచ్చే ఏడాది హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ అంకాలజీ సింపోజియమ్‌ను నిర్వహించాలి.
- నిమ్స్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రులను క్యాన్సర్ చికిత్స కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా అభివృద్ధి చేయాలి.
- గ్రామీణ, వెనుకబడిన వర్గాల ప్రజలకు క్యాన్సర్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలి. వైద్య ఖర్చులు తగ్గేలా, ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- వ్యాధులపై అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సాహించడంపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి.

నేటి నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు

- గాజుల రామారంలో మూడురోజుల పాటు నిర్వహణ
- చివరి రోజు రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నిక



హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు బుధవారం ప్రారంభం కానున్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజుల రామారంలోని కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్ (మహారాజా గార్డెన్స్)లో ఈ నెల 22 వరకు మూడు రోజులపాటు జరిగే మహాసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభించనున్న ఈ మహాసభలకు పార్టీ జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, సయ్యద్ అజీజ్ అతిథులుగా, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ కార్యదర్శి జాన్ వెస్లీ సౌహార్ద్ర ప్రతినిధులుగా హాజరు కానున్నారు. మహాసభల్లో 743 మంది ప్రతినిధులతోపాటు పార్టీ సీనియర్ నాయకులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొనున్నారు. కాగా, తొలిరోజు మధ్యాహ్నం ప్రతినిధుల సభ జరుగుతుంది. ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చర్చనీయాంశాల ఎజెండాను, కమిటీలను ప్రతిపాదిస్తారు. అనంతరం పలు నివేదికలపై సభలో చర్చించి తీర్మానాలు చేయనున్నారు. చివరి రోజు పార్టీ రాష్ట్ర నూతన కార్యవర్గం, కార్యదర్శి వర్గాన్ని ఎన్నుకోనున్నారు.

అసలు రూ.4లక్షలు.. వడ్డీతో కలిపి 42 లక్షలు!

- వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక హమాలీ ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక కరీంనగర్ జిల్లా కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌కు చెందిన తంగెళ్ల శ్రీనివాస్(44) అనే హమాలీ కార్మికుడు సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. బాధిత కుటుంబం పోలీసులకు చేసిన ఫిర్యాదు ప్రకారం.. తంగెళ్ల శ్రీనివాస్ భార్య మూడేళ్ల క్రితం విద్యుత్ ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడింది. ఆ సమయంలో బొమ్మకల్‌కు చెందిన నాగరాజు వద్ద శ్రీనివాస్ రూ.4 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఈ రుణానికి సంబంధించి శ్రీనివాస్ ఇప్పటిదాకా వడ్డీతో కలిపి నాగరాజుకు రూ.15 లక్షలు దాకా చెల్లించాడు. అయితే, ఇంకా రూ.27.60 లక్షలు బకాయి ఉందని పేర్కొంటూ శ్రీనివాస్‌కు నాగరాజు ఇటీవల ఓ నోటీసు పంపాడు. ఆపై, శ్రీనివాస్ పేరిట ఉన్న ఆరు గుంటల స్థలాన్ని అప్పు కింద తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని చింతపండు నాగరాజు, అతని సహచరుడు బట్టు రాజేందర్ ఒత్తిడి తెచ్చి వేధించారు. ఇదే విషయమై ఫోన్‌లో మాట్లాడుతూ సోమవారం రాత్రి 10 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన శ్రీనివాస్ తిరిగి రాలేదు. ఇంటి వెనుక వైపు ఉన్న మామిడి చెట్టుకు ఉరి వేసుకున్న శ్రీనివాస్‌ను మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు గుర్తించారు. ఈ మేరకు చింతపండు నాగరాజు, రాజేందర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫొటో జర్నలిస్టుల సంక్షేమానికి చర్యలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- 'ఆంధ్రజ్యోతి' ఫొటో గ్రాఫర్లకు అవార్డులు
- కళాత్మకత ఉంటేనే ఫొటోగ్రఫీలో రాణింపు: మంత్రి పొన్నం

హైదరాబాద్/సిద్దిపేట అర్బన్/నల్లగొండ టౌన్/బర్కత్‌పుర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఫొటో జర్నలిస్టుల సంక్షేమానికి, వారిలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపడుతామని సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో పంజగుట్టలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఫొటో జర్నలిస్టులకు నగదు పురస్కారాలను అందజేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఒక్క ఫొటో వెయ్యి భావాల్ని పలికిస్తుందని, కాలాన్ని బంధించి మధుర స్మృతులను అందించే శక్తి ఒక్క ఫొటోగ్రాఫర్లకే ఉంటుందన్నారు. ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించే దిశగా ప్రతి సంవత్సరం వరల్డ్ ఫొటోగ్రఫి డేను అధికారికంగా నిర్వహించి ఉత్తమ ఫొటోలను ఎంపిక చేసి విజేతలకు నగదు బహుమతులు, మెమెంటోలు ప్రదానం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరోవైపు.. ఫొటో అనేది ఓ తీపి జ్ఞాపకం అని, కళాత్మకత ఉంటేనే ఫొటోగ్రఫీలో రాణించగలుగుతారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన 23వ రాష్ట్రస్థాయి న్యూస్ ఫొటో కాంటెస్ట్ ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి పొన్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్లు వృత్తిపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎస్ హరి తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు

అవార్డులు అందుకున్నవారిలో ఐదుగురు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు ఉన్నారు. ఆర్. హరిప్రేమ్(చీఫ్ ఫొటోగ్రాఫర్) జనరల్ న్యూస్ పిక్చర్ క్యాటగిరిలో మొదటి బహుమతి పొందారు. బి. బాబురావు(సిద్దిపేట) ఆసరా పెన్షన్ (చేయూత)కు సంబంధించిన అంశంలో రెండో బహుమతి, ఎం. విజయ్ కుమార్ (నల్లగొండ) మూడు క్యాటగిరీల్లో.. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత విభాగాల్లో కన్సోలేషన్ బహుమతులు పొందారు. పి. అశోకుడు యాదవ్(హైదరాబాద్) జనరల్ న్యూస్ పిక్చర్ కన్సోలేషన్ బహుమతి, బి. హరీశ్ (వరంగల్, డిప్యూటీ చీఫ్ ఫొటోగ్రాఫర్) జనరల్ న్యూస్ పిక్చర్‌లో కన్సోలేషన్ బహుమతి పొందారు.

హరీశ్‌రావు ఫొటోకు మంత్రి పొంగులేటి క్యాప్షన్!

ఫొటో ఎగ్జిబిషన్‌లో ఓ ఫొటో మంత్రి పొంగులేటి దృష్టిని ఆకర్షించింది. ఆ ఫొటో ఎవరిదోకాదు.. బీఆర్‌ఎస్ నేత మాజీ మంత్రి హరీశ్ రావుది. హరీశ్‌రావు ఓ సందర్భంలో వ్యక్తం చేసిన హావభావాలను హైదరాబాద్‌కు చెందిన ఓ ఫొటోగ్రాఫర్ బంధించారు. ఆ ఫొటోను ఎగ్జిబిషన్ ఎంట్రీలకు పంపించి కన్సోలేషన్ బహుమతి సొంతం చేసుకున్నారు. మంత్రి తన ప్రసంగంలో హరీశ్ ఫొటో గురించి ప్రస్తావిస్తూ.. 'ఇంకేముంది.. అంతా అయిపోయింది" అంటూ తన దైన శైలిలో క్యాప్షన్ పెట్టారు. హరీశ్‌రావులో నెలకొన్న నైరాశ్యాన్ని ఈ ఫొటో ప్రపంచానికి పరిచయం చేసిందని వ్యాఖ్యానించారు.





అవార్డులు అందుకుంటున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు హరిప్రేమ్; బాబురావు; అశోకుడు యాదవ్



జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో



రూ.1.98 లక్షల కోట్ల బూస్ట్

న్యూఢిల్లీ: జీఎస్‌టీ పునర్‌వ్యవస్థీకరణతో పన్ను రేట్లు తగ్గి దేశంలో వినియోగం రూ.1.98 లక్షల కోట్ల మేర పెరగవచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా వేసింది. మన జీడీపీలో 0.6 శాతానికి సమానమిది. పన్ను రేట్ల కోతతో ప్రభుత్వానికి మాత్రం వార్షిక పన్ను ఆదాయం రూ.85,000 కోట్ల మేర తగ్గవచ్చని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో మాత్రం రాబడి రూ.45,000 కోట్ల మేర తగ్గవచ్చని భావిస్తోంది. జీఎస్‌టీ సంస్కరణల్లో భాగంగా దీపావళి నాటికి పన్ను రేట్లను హేతుబద్ధీకరించనున్నట్లు స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జీఎస్‌టీలో 5, 12, 18, 28 శాతం శ్లాబులున్నాయి. వాటిని 5, 18 శాతం శ్లాబులకు కుదించి.. పొగాకు, ఆల్కహాల్ వంటి 5-7 రకాల ఉత్పత్తులపైన మాత్రం 40% ప్రత్యేక రేటును విధించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.

చిన్న కారుకు పెద్ద ఊరట!

కాంపాక్ట్ ఎస్‌యూవీల ప్రవేశంతో ఆదరణ తగ్గిన చిన్న కార్లకు జీఎస్‌టీ రేట్ల పునర్‌వ్యవస్థీకరణతో పెద్ద ఊరట లభించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీ శ్లాబులో ఉన్న చిన్న కార్లను 18 శాతం పన్ను శ్లాబులో చేర్చితే గనుక వాటి ధరలు 8 శాతం వరకు తగ్గవచ్చని హెచ్‌ఎస్‌బీసీ తాజా నివేదిక అంచనా వేసింది. ప్యాసింజర్ వాహనాలపై ప్రభుత్వం 28 శాతం జీఎస్‌టీతో పాటు వాటి సైజు, పొడవును బట్టి కొంత సెస్సును కూడా విధిస్తోంది. దాంతో కార్లపై మొత్తం పన్ను భారం మోడల్‌ను బట్టి 29 శాతం నుంచి 50 శాతం స్థాయిలో ఉంది. పునర్ వ్యవస్థీకరణలో భాగంగా చిన్న కార్లపై జీఎస్‌టీని 18 శాతానికి తగ్గించి, పెద్ద కార్లను కొత్తగా ప్రతిపాదించిన 40 శాతం ప్రత్యేక శ్లాబులో చేర్చితే గనుక మారుతి ఆల్టో వంటి చిన్న కార్ల రేట్లు 8 శాతం వరకు, పెద్ద కార్ల ధరలు 3-5 శాతం వరకు తగ్గవచ్చని హెచ్‌ఎస్‌బీసీ నివేదిక పేర్కొంది.

భారత్‌పై సుంకాల ప్రభావం అంతంతే



స్వల్పకాలికంగా ఇబ్బందులు తప్పవు.. ఎస్ అండ్ పీ గ్లోబల్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రభావం దీర్ఘకాలంలో భారత జీడీపీ వృద్ధి రేటుపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది. భారత్ నుంచి జరిగే ఎగుమతుల్లో అమెరికా వాటా.. భారత జీడీపీలో ఒక శాతం మాత్రమేనని పేర్కొంది. దీనికి తోడు భారత జీడీపీలో 85 శాతం దేశీయ డిమాండ్‌పైన, 15 శాతం మాత్రమే ఎగుమతులపైన ఆధారపడి ఉన్న విషయాన్ని గుర్తు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలకు కట్టుబడి ఉండడం, ద్రవ్యోల్బణ కట్టడికి ఆర్‌బీఐ తీసుకుంటున్న చర్యలు కూడా దీర్ఘకాలంలో భారత జీడీపీ వృద్ధి రేటుకు దోహదం చేస్తాయని అంచనా వేసింది. వచ్చే మూడేళ్లలో భారత జీడీపీ ఏటా సగటున 6.8 శాతం చొప్పున పెరిగే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ గ్లోబల్ ఆసియా పసిఫిక్ ప్రాంత ప్రధాన ఆర్థికవేత్త విశ్రుత్ రాణా చెప్పారు. అయితే స్వల్పకాలంలో మాత్రం అమెరికా సుంకాల ప్రభావం భారత జీడీపీ వృద్ధి రేటుపై కొద్దిగా ఉంటుందని తెలిపారు. మౌలిక సదుపాయాల లేమి, అనుసంధాన సమస్యలను అధిగమిస్తే భారత ఆర్థిక వ్యవస్థ మరింత వృద్ధి రేటు సాధించే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ డైరెక్టర్ ఈఫాన్ ఫువా తెలిపారు. ప్రతిపాదిత రెండు శ్లాబుల జీఎస్‌టీని ఎస్ అండ్ పీ స్వాగతించింది. దీనివల్ల ప్రజలపై పన్నుల భారం తగ్గడంతో పాటు ప్రభుత్వ ఆదాయం పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

మాదీ అదే మాట ఫిచ్ రేటింగ్స్

మరో అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ ఫిచ్ రేటింగ్స్ కూడా అమెరికా సుంకాల ప్రభావం భారత కంపెనీలపై పెద్దగా ఉండదని తెలిపింది. భారత కంపెనీల్లో చాలా వాటికి అమెరికా మార్కెట్లో పెద్దగా స్థానం లేకపోవడమే ఇందుకు కారణమని పేర్కొంది. అయితే ప్రస్తుతం సుంకాల పోటు నుంచి మినహాయించబడిన ఫార్మా, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపై ట్రంప్ సర్కార్ భవిష్యత్‌లో సుంకాల భారం మోపే అవకాశం ఉందని హెచ్చరించింది. భారత-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరితే మాత్రం ఈ ముప్పు ఉండదని తెలిపింది. భారత ఐటీ సేవల కంపెనీలపైనా ట్రంప్ సుంకాల ప్రభావం ప్రస్తుతం పెద్దగా ఉండకపోవచ్చని ఫిచ్ అంచనా. దేశీయ మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడిన ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలు, సిమెంట్, భవన నిర్మాణ పరికరాలు, ఇంజనీరింగ్, నిర్మాణ రంగం, టెలికాం కంపెనీలపైనా అమెరికా సుంకాల ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. కొన్ని సమస్యలు ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరంలోనూ భారత జీడీపీ 6.5 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తుందని అంచనా వేసింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 6.7 శాతం వృద్ధి రేటు నమోదు చేసి ఉంటుందని ఇక్రా రేటింగ్స్ సంస్థ అంచనా వేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 0.2 శాతం ఎక్కువ.

ఫార్మాపై సుంకాలు వేస్తే కష్టమే

- కొంతైనా ఖాతాదారులు భరించక తప్పదు
- నాట్కో ఫార్మా సీఈఓ రాజీవ్ నన్నపనేని

హైదరాబాద్: ఫార్మా దిగుమతులపైనా అమెరికా సుంకాలు విధించే అవకాశం ఉందన్న వార్తలు భారత ఫార్మా కంపెనీలను భయపెడుతున్నాయి. అదే జరిగితే మొదట్లో కొన్ని ఇబ్బందులు ఉన్నా తర్వాత ఈ సుంకాల భారంలో కొంత భాగాన్ని అమెరికా ఖాతాదారులకే బదిలీ చేయక తప్పదని నాట్కో ఫార్మా వైస్ ఛైర్మన్, సీఈఓ రాజీవ్ నన్నపనేని అన్నారు. జూన్ త్రైమాసిక ఫలితాల అనంతరం జరిగిన ఎర్నింగ్స్ కాన్ఫరెన్స్ కాల్‌లో ఆయన ఈ విషయం చెప్పారు. అమెరికాతో పాటు ఇతర మార్కెట్లపైనా భారత ఫార్మా కంపెనీలు దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అయినా భారత ఫార్మా ఎగుమతులకు అతిపెద్ద మార్కెట్ అయిన అమెరికాను ఏ మాత్రం విస్మరించలేమన్నారు. అమెరికాలో తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం ఒక మార్గమన్నారు. భారత్ నుంచి దిగుమతయ్యే అన్ని వస్తువులపై సుంకాలు విధించిన ట్రంప్ సర్కార్ ప్రస్తుతానికి ఔషధాలు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్‌ను మాత్రం మినహాయించింది.

ఇంటెల్‌లో 10% వాటా కోసం ట్రంప్ సర్కారు ప్రయత్నాలు!

200 కోట్ల డాలర్ల వాటా కొనుగోలు యోచనలో జపాన్ సాఫ్ట్‌బ్యాంక్

న్యూయార్క్: అమెరికాకు చెందిన సెమీకండక్టర్ల (చిప్) తయారీ దిగ్గజం ఇంటెల్ కార్ప్‌లో 10 శాతం వాటా కొనుగోలుకు ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగం సంప్రదింపులు జరుపుతోంది. ఈ డీల్ కొలిక్కి వస్తే ఇంటెల్‌లో అమెరికా సర్కారు అతిపెద్ద వాటాదారుగా అవతరించనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయని బ్లూంబర్గ్ కథనం పేర్కొంది. యూఎస్ చిప్స్ అండ్ సైన్స్ చట్టంలో భాగంగా ఇంటెల్‌కు జారీ చేసిన గ్రాంట్లను పాక్షికంగా లేదా మొత్తంగా ఈక్విటీ వాటాగా మార్చుకోవాలని ట్రంప్ ప్రభుత్వం భావిస్తోంది. ఇంటెల్ ప్రస్తుత మార్కెట్ విలువ 10,500 కోట్ల డాలర్ల స్థాయిలో ఉంది. వాణిజ్య, మిలటరీ ప్రొడక్షన్ కోసం ఇంటెల్‌కు మొత్తం 1,090 కోట్ల డాలర్ల చిప్స్ యాక్ట్ గ్రాంట్లు లభించవచ్చని అంచనా. ఈ మొత్తాన్ని ఈక్విటీ వాటాగా మల్చుకుంటే, కంపెనీలో ట్రంప్ ప్రభుత్వానికి 10 శాతం వాటా దక్కే అవకాశం ఉందని రిపోర్టు వెల్లడించింది. కాగా, ఇంటెల్‌లో వాటా కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు జపాన్‌కు చెందిన టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్ ప్రకటించింది. ఒక్కో షేరుకు 23 డాలర్లు చెల్లింపు ద్వారా 200 కోట్ల డాలర్ల (దాదాపు 2 శాతం) వాటా కొనుగోలు చేయనున్నట్లు తెలిపింది. ఈ వార్తల నేపథ్యంలో ఇంటెల్ షేరు మంగళవారం ప్రారంభ ట్రేడింగ్‌లో 7.35 శాతం వరకు పెరిగి 25.39 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

నాలుగో రోజూ లాభాలొచ్చాయ్..

371 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో పయనించాయి. జీఎస్‌టీ జోష్‌తో మార్కెట్ వర్గాలు మంగళవారమూ ఉత్సాహంగా కొనుగోళ్లు జరిపారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు క్రమంగా తగ్గుముఖం పడుతుండటం కూడా మార్కెట్లకు కలిసివచ్చింది. సెన్సెక్స్ ఒక దశలో 482 పాయింట్లకు పైగా పెరిగినప్పటికీ, చివరికి 370.64 పాయింట్ల లాభంతో 81,644.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 103.70 పాయింట్ల వృద్ధితో 24,980.65 వద్ద స్థిరపడింది. భారీ కొనుగోళ్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 2.82 శాతం లాభంతో సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.3.44 లక్షల కోట్లు పెరిగి రూ.454.40 లక్షల కోట్లకు ఎగబాకింది.

రూ.1,000 కోట్లతో కర్నూలు ప్లాంటు విస్తరణ

చెన్నై: రామ్‌కో సిమెంట్.. ఆంధ్రప్రదేశ్, కర్నూలు జిల్లాలోని కొలిమిగుండ్ల ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తోంది. రూ.1,000 కోట్ల పెట్టుబడితో చేపట్టిన ఈ ప్లాంట్ విస్తరణ పనులు వచ్చే ఏడాది జూన్ నాటికల్లా పూర్తవుతాయని రామ్‌కో సిమెంట్ సీఈఓ ఏవీ ధర్మకృష్ణన్ వెల్లడించారు. మంగళవారం నాడిక్కడ కంపెనీ కన్‌స్ట్రక్షన్ విభాగం 'హార్డ్ వర్కర్' బ్రాండ్ ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కర్నూలులోని సమగ్ర ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 31.5 లక్షల టన్నులుగా ఉందన్నారు. ఈ ప్లాంట్ విస్తరణ పనులు పూర్తయితే కంపెనీ మొత్తం వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 2.44 కోట్ల టన్నుల నుంచి 3 కోట్ల టన్నులకు చేరుకుంటుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.8,500 కోట్లుగా ఉన్న కంపెనీ వార్షికాదాయం వచ్చే నాలుగైదేళ్లలో రూ.15,000 కోట్ల నుంచి రూ.16,000 కోట్లకు పెరిగే అవకాశం ఉందన్నారు. కాగా మారుతున్న భారత నిర్మాణ రంగ మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హార్డ్ వర్కర్ శ్రేణి ఉత్పత్తులను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం రూ.210 కోట్లు ఉన్న తమ కెమికల్స్ డివిజన్ వ్యాపారాన్ని వచ్చే నాలుగైదు సంవత్సరాల్లో రూ.2,000 కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ధర్మకృష్ణన్ చెప్పారు.

హైదరాబాద్‌లో కూపాంగ్ డెవలప్‌మెంట్ సెంటర్

న్యూఢిల్లీ: భారత్‌లో కార్యకలాపాలను విస్తరించినట్లు అమెరికన్ టెక్నాలజీ కంపెనీ కూపాంగ్ ఇంక్ మంగళవారం ప్రకటించింది. ఇప్పటికే బెంగళూరులో డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్వహిస్తున్న ఈ ఈ-కామర్స్ కంపెనీ.. హైదరాబాద్‌లోనూ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. గత నెలలోనే ప్రారంభమైన హైదరాబాద్ కార్యాలయం జెనరేటివ్ ఏఐ ఆవిష్కరణలు సహా డీప్ టెక్నాలజీ సామర్థ్యాలపై దృష్టిసారించనుందని కంపెనీ పేర్కొంది.

ఐటీ కెరీర్ కోసం టెక్‌బీ ప్రోగ్రామ్

హెచ్‌సీఎల్ టెక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) రంగంలో అవకాశాలను అందిపుచ్చుకుని కెరీర్‌ను ప్రారంభించాలనుకునే విద్యార్థుల కోసం హైదరాబాద్‌లో హెచ్‌సీఎల్ టెక్.. టెక్‌బీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇంటర్మీడియట్ లేదా ప్లస్ టూ పూర్తి చేసిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా టెక్‌బీ కార్యక్రమాన్ని రూపొందించినట్లు హెచ్‌సీఎల్ టెక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బరామన్ బాలసుబ్రమణ్యన్ తెలిపారు. డిగ్రీ, బీసీఏ, బీకాం, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సులను అందించేందుకు బిట్స్ పిలానీ, కేఎల్ యూనివర్సిటీ వంటి పేరొందిన విద్యా సంస్థలతో జట్టు కట్టినట్లు ఆయన చెప్పారు. కోర్సు పూర్తయిన అనంతరం విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు బాలసుబ్రమణ్యన్ తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,750 ▼	92,350 ▼	1,26,000 ▼
విజయవాడ	1,03,000 ▲	96,500 ▼	1,17,000 ▼
విశాఖపట్నం	1,02,150 ▼	92,350 ▼	1,26,000 ▼
రాజమండ్రి	1,00,750 ▼	92,350 ▼	1,16,800 ▼
ప్రొద్దుటూరు	1,00,500 ▼	92,460 ▼	1,16,500 ▼
ముంబై	99,168 ▼	90,838 ▼	1,13,625 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	525
వరంగల్	497	గోదావరి	520
చిత్తూరు	553	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	116
కరీంనగర్	102	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	98
కర్నూలు	102	నెల్లూరు	103
విశాఖపట్నం	113	అనంతపురం	103
గోదావరి	119		

చిత్రజ్యోతి
SINCE 1965



దర్శకుడు సుకుమార్ దంపతులు, నిర్మాత యలమంచిలి రవిశంకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో తన నటనకు గానూ జాతీయ అవార్డు అందుకొన్న సుకుమార్ కుమార్తె సుకృతి వేణిని సీఎం సన్మానించారు.

ఎన్టీఆర్ పెద్ద కోడలు కన్నుమూత

● నివాళులు అర్పించిన ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్





నందమూరి తారక రామారావు పెద్ద కుమారుడు జయకృష్ణ సతీమణి పద్మజ (62) మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. నందమూరి పద్మజ భౌతికకాయానికి ఫిల్మ్‌నగర్‌లోని ఆమె నివాసంలో మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. బాలకృష్ణ దంపతులు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ 'మాపెళ్లి విషయంలో జయకృష్ణ, పద్మజ పెద్ద దిక్కుగా ఉండి అన్నీ చూసుకున్నారు. ఇంట్లో అందరూ యంగ్ స్టర్స్‌గా ఉంటే మా అత్తగారి తర్వాత ఆవిడే కుటుంబ పెద్దగా అందరితో కలుపుగోలుగా ఉండేవారు' అని చెప్పారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

మూడు విభిన్న పాత్రల్లో అల్లు అర్జున్?


● వంద రోజులు కేటాయించిన దీపిక





అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం పైనే ఇప్పుడందరి దృష్టీ ఉంది. ఆకాశమే హద్దు అనే రీతిలో భారతీయ సినిమా చరిత్రలో ఇంతకుముందెన్నడూ లేని బడ్జెట్‌తో ఈ సినిమా తయారుకానుంది. అలాగే పలువురు హాలీవుడ్ టెక్నీషియన్లు ఈ సినిమాకు పని చేస్తుండడం విశేషం. ఈ సినిమాలో ఒకరు కాదు ఇద్దరు కాదు.. నలుగురు హీరోయిన్లు నటిస్తుండడం మరో విశేషం. వీరిలో దీపికా పదుకోన్ ది ప్రధాన పాత్ర. రష్మిక, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలు పోషించనున్నారు. నవంబర్ నుంచి దీపిక ఈ చిత్రం షూటింగ్‌లో పాల్గొంటారని తాజా సమాచారం. సాధారణంగా ఇలాంటి హై బడ్జెట్ సినిమాలకు హీరోలు వంద రోజులకు పైగా పని చేస్తుంటారు. కానీ దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ సినిమా కోసం దీపిక వంద రోజులు కేటాయించారంటే ఆమె పాత్ర కూడా ఎంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. ఇందులో ఆమె ఓ యోధురాలి పాత్ర పోషిస్తోందనీ, ఆమె లుక్ కూడా డిఫరెంట్‌గా ఉంటుందనీ, భారీ యాక్షన్ సీన్లు ఆమె మీద ప్లాన్ చేస్తున్నారని చెబుతున్నారు. ఇక చిత్రకథానాయకుడు అల్లు అర్జున్ డిఫరెంట్ లుక్స్ కలిగిన మూడు పాత్రలను పోషించనున్నారని బీ టౌన్ వర్గాల సమాచారం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ వచ్చే నెల ప్రారంభం కానుంది. 2027 ద్వితీయార్థంలో విడుదల చేయాలనేది దర్శకనిర్మాతల ఆలోచన.

సరికొత్త లుక్‌లో...



రామ్‌చరణ్ కథానాయకుడిగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న చిత్రం 'పెద్ది' షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు కీలక షెడ్యూళ్ల చిత్రీకరణను పూర్తి చేసింది చిత్ర బృందం. క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో మునుపెన్నడూ కనిపించని సరికొత్త లుక్‌లో రామ్‌చరణ్ కనిపించనున్నారు. ఇందుకోసం సెలబ్రిటీ స్టైలిస్ట్ అలీ హకీమ్ రామ్‌చరణ్ లుక్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్‌తో ఆయన తీసుకున్న ఫొటోలు ప్రస్తుతం నెట్టింట సందడి చేస్తున్నాయి. ఈ సినిమాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. నిర్మాణ సంస్థలు మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న చిత్రం విడుదలవుతోంది.

బెంచ్ మార్క్ మూవీ అవుతుంది



'కబడ్డీ బ్యాక్‌డ్రాప్‌లో ఇప్పటి వరకు కొన్ని కథలు వచ్చాయి. అయితే మేము తెరకెక్కించినంత సీరియస్‌గా ఇప్పటివరకూ ఏ సినిమా రాలేదు. ఇది కచ్చితంగా ఒక బెంచ్ మార్క్ మూవీ అవుతుంది' అని అన్నారు నిర్మాత శ్రీని గుబ్బల. విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకుడు. ఈనెల 29న విడుదలవుతున్న సందర్భంగా శ్రీని గుబ్బల మాట్లాడుతూ 'నల్గొండ కబడ్డీ ఆటగాడు నాగులయ్య జీవితం ఆధారంగా ఈ కథని రూపొందించారు. సినిమా మంచి కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఉంటుంది. అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించినపుడు అందరూ చాలా అభినందించారు' అని అన్నారు.

సినీ కార్మికుల సమ్మెకు శుభం కార్డు?





- చిరంజీవితో సమావేశమైన దిల్‌రాజు
- నేడు నిర్మాతల నిర్ణయం?

సినీ కార్మికులకూ, నిర్మాతలకు మధ్య వేతన పెంపుపై ఏర్పడిన వివాదం నేపథ్యంలో నిరసన ప్రదర్శనలు, విమర్శలు, ప్రతి విమర్శలతో మంగళవారం వాతావరణం మరింత వేడెక్కింది. ఫిల్మ్ ఛాంబర్‌కూ, ఫెడరేషన్‌కూ మధ్య కొన్ని రోజులుగా సాగుతున్న చర్చలు మంగళవారం పలు నాటకీయ పరిణామాల మధ్య అనూహ్య మలుపు తీసుకున్నాయి. ముందు అనుకున్న ప్రకారం మంగళవారం సాయంత్రం ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్ సమావేశం జరగాల్సి ఉంది. అయితే ఉదయం కార్మికులతో కలసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సమ్మె విషయంలో వెనుకడుగే లేదంటూ తేల్చి చెప్పడంతో ఏం జరగబోతోందో అనే ఉత్కంఠ నెలకొంది. ఆ తర్వాత ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించి, డిమాండ్ల సాధన కోసం అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించింది. మరోవైపు ఛాంబర్ సమావేశానికి ముందు చిరంజీవి ఇంటికి వెళ్లిన నిర్మాత దిల్‌రాజు, సుప్రియా, జెమినీ కిరణ్ ఆయనతో చర్చించారు. అనంతరం వారంతా ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్‌భూషణ్‌తో కలసి ఫెడరేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అయితే ఈ చర్చలు ఓ కొలిక్కి రాకపోవడంతో ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ. 'మా డిమాండ్లపై ఛాంబర్ సుముఖత వ్యక్తం చేసింది. అయితే వేతనాల పెంపు ఎంత శాతం అనేది రేపు చర్చల తర్వాత నిర్ణయిస్తామని ఛాంబర్ ప్రతినిధులు చెప్పారు. బుధవారం ఉదయం మరో దఫా నిర్మాతలతో చర్చించి సాయంత్రం నాలుగు గంటలకు తమ నిర్ణయాన్ని ఛాంబర్ తెలియజేస్తుంది' అని చెప్పారు.

నిర్మాతలే షూటింగ్స్ ఆపడం అన్యాయం: తమ్మారెడ్డి భరద్వాజ

'కార్మికుల వేతనాలు పెంచాలని అందిరికీ తెలిసినా, ఏదో ఒక సాకు చూపి 15 రోజులుగా ఆలస్యం చేస్తున్నారు. నిర్మాతలే షూటింగ్స్ ఆపుతున్నారు. ఈ పద్ధతి ఎక్కడా లేదు, ఇది అన్యాయం' అని దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. మంగళవారం ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం జరిగిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సినీ కార్మికులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కన్నా ఎక్కువ జీతం వస్తుందని కొందరంటున్నారు. నెలలో ముప్పై రోజులూ పని దొరికితేనే అది సాధ్యం. ఇండస్ట్రీలో ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు పదిరోజులు కూడా పనిదొరకడం లేదు' అని భరద్వాజ అన్నారు. 'చేసిన పనికి వేతనం పొందడం మన హక్కు. నిర్మాతలు ఇప్పటికి దినసరి వేతనాలే రూ. 13 కోట్ల వరకూ చెల్లించాల్సి ఉంది. ఇక నుంచి ఏ రోజు వేతనాలు ఆరోజే చెల్లించాలి' అని ఆయన డిమాండ్ చేశారు. తమ్మారెడ్డి విమర్శలపై నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించారు. 'ప్రియమైన తమ్మారెడ్డి సార్.. ఈ ఆకస్మిక సమ్మెతో ఆర్థిక బ్లాక్‌మెయిల్‌కు పిలుపునిచ్చింది యూనియన్ వారే కానీ నిర్మాతలు కాదు. ఇది నిర్మాతలు కోరుకున్న సమ్మె కాదు. వారి తలమీద బలవంతపు సమ్మెట పోటు అని గుర్తించవలసిందిగా మనవి' అని పేర్కొన్నారు.

చిరకాలం గుర్తుంటుంది

విజయ్ డొంకాడ



'డైరెక్టర్ ప్రవీణ్ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. 'పరదా' చిరకాలం గుర్తుండిపోయే చిత్రమవుతుంది. కమర్షియల్‌గా ఎంత విజయం సాధిస్తుందనేది ప్రేక్షకులు నిర్ణయిస్తారు' అని అన్నారు నిర్మాత విజయ్ డొంకాడ. అనుపమ పరమేశ్వరన్ నటించిన చిత్రం 'పరదా'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో విజయ్ డొంకాడ నిర్మించారు. సినిమా ఈనెల 22న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో విజయ్ చిత్ర విశేషాలు పంచుకున్నారు. 'ప్రవీణ్ 'సినిమా బండి' చిత్రం అప్పటి నుంచి నాకు తెలుసు. ఆనంద మీడియా బేనర్ పెట్టిన తర్వాత తొలి సినిమాగా గుర్తుండిపోయే కథ చెప్పాలని అనుకున్నాం. అప్పుడు ప్రవీణ్ 'పరదా' ఐడియా చెప్పారు. ఇది ఒక ఫిక్షనల్ స్టోరీ. కథ విన్న వెంటనే అనుపమ ఓకే చెప్పారు. ఫస్ట్ కాపీ చూసి ఈ సినిమా తన కెరీర్‌లో బెస్ట్ సినిమా అవుతుందని భావోద్వేగానికి గురయ్యారు. ప్రచార బాధ్యతలూ తనపైనే వేసుకున్నారు. మలయాళంలో దుల్కర్ సల్మాన్ రిలీజ్ చేస్తున్నారు. సినిమాని నిర్మాత సురేశ్ బాబు, హీరో రానా చూశారు. వాళ్లు కొన్ని విలువైన సూచనలు చేశారు. తర్వాత సినిమా ఇంకా బెటర్ అయ్యింది' అని అన్నారు.

హారర్ కామెడీ



చిన్ను, గీతిక రతన్ జంటగా ప్రసాద్ ఏలూరి తెరకెక్కిస్తున్న చిత్రం 'లవ్ యూ రా'. సముద్రాల మంత్రయ్య బాబు, కొన్నిపాటి శ్రీనాథ్ ప్రజాపతి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 5న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆడియో లాంచ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్ ప్రజాపతి మాట్లాడుతూ 'అందరికీ ఆకట్టుకునే చిత్రమిది' అని చెప్పారు. 'సినిమా అందరినీ కడుపుబ్బా నవ్వించేలా ఉంటుంది. ఇందులో హారర్, కామెడీ, లవ్.. ఇలా అన్ని అంశాలుంటాయి' అని చిన్ను తెలిపారు.

ప్రపంచకప్ జట్టులో శ్రీచరణి


శ్రీచరణి


హర్మన్‌ప్రీత్

రేణుక రీఎంట్రీ ● షఫాలీకి మొండిచేయి ● టీమిండియా ఎంపిక

భారత మహిళల వరల్డ్‌కప్ జట్టు

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), ప్రతికా రావల్, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్, రేణుక సింగ్ ఠాకూర్, అరుంధతి, రిచా ఘోష్ (వికెట్ కీపర్), క్రాంతి గౌడ్, అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్, శ్రీచరణి, యాస్తిక భాటియా (వికెట్ కీపర్), స్నేహ్ రాణా.

ముంబై: ఇంగ్లండ్ టూర్‌లో ఆకట్టుకొన్న తెలుగమ్మాయి శ్రీచరణికి జాక్‌పాట్ తగిలింది. మంగళవారం ప్రకటించిన మహిళల వన్డే వరల్డ్ కప్ జట్టులో ఆమెకు చోటుదక్కింది. ఫిట్‌నెస్ సాధించిన పేసర్ రేణుక సింగ్ జట్టులోకి పునరాగమనం చేసింది. టాపార్డర్‌లో ప్రతికా రావల్‌కు చాన్స్ దక్కగా.. షఫాలీకి సెలెక్టర్లు మొండిచేయి చూపారు. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యవహరించనున్నారు. భారత్, శ్రీలంకల్లో వచ్చే నెల 30 నుంచి వరల్డ్‌కప్ జరగనుంది. కాగా ఇటీవలే ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో 10 వికెట్లు పడగొట్టిన కడప జిల్లాకు చెందిన శ్రీచరణి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గానూ ఎంపికైంది. కాగా, మెగా టోర్నీకి ముందు.. అంటే సెప్టెంబరు 14 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే మూడువన్డేల సిరీస్ కోసం కూడా భారత జట్టును సెలెక్టర్లు ప్రకటించారు. ఇంగ్లండ్ పర్యటనలో ఆడిన జట్టును దాదాపుగా ప్రపంచకప్‌నకు ఎంపిక చేశారు. ఒక్క మార్పు మినహా విశ్వకప్ జట్టునే ఈ సిరీస్‌కూ ఖరారు చేశారు. ఆల్‌రౌండర్ అమన్‌జోత్ కౌర్ స్థానంలో ఆసీస్‌తో వన్డేలకు సయాలీ సత్‌ఘరేను తీసుకొన్నారు. గాయంతో బాధపడుతున్న అమన్‌జోత్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో పునరావాసంలో ఉంది. ప్రపంచకప్ సమయానికి ఆమె కోలుకొనే అవకాశం ఉంది. యువ సీమర్ క్రాంతి గౌడ్, అరుంధతిలకు కూడా టీమ్‌లో చోటు లభించింది. శ్రీచరణితోపాటు దీప్తి శర్మ, రాధా యాదవ్, స్నేహ్ రాణాలతో స్పిన్ విభాగం బలంగా కనిపిస్తోంది.


సూర్యకుమార్

అనేక ఊహాగానాల మధ్య ఎట్టకేలకు ఆసియాకప్ టీ20 టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. ఇటీవలి టెస్టు సిరీస్‌లో అదరగొట్టిన శుభ్‌మన్ గిల్ పొట్టి ఫార్మాట్‌లో పునరాగమనం చేయనున్నాడు. ఇక పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో విశేషంగా రాణిస్తున్నప్పటికీ.. శ్రేయాస్ అయ్యర్‌ను పట్టించుకోకపోవడం ఫ్యాన్స్‌ను నిరుత్సాహపరిచింది. అలాగే ఫామ్‌లో ఉన్న జైస్వాల్‌ను స్టాండ్‌బైగా ఎంపిక చేయగా.. ఐపీఎల్‌లో ఆకట్టుకోలేకపోయిన రింకూ సింగ్, హర్షిత్‌లను మాత్రం జట్టులోకి తీసుకోవడం గమనార్హం.

గిల్ వచ్చేశాడు

వైస్ కెప్టెన్‌గా ఎంపిక

సూర్యకే పగ్గాలు


గిల్

శ్రేయా‌స్‌కు నిరాశ

జట్టులోకి పేసర్ బుమ్రా — ఆసియా కప్‌నకు టీమిండియా


తిలక్ వర్మ

ముంబై: ఏడాది తర్వాత శుభ్‌మన్ గిల్ భారత టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. వచ్చే నెల 9 నుంచి యూఏఈలో జరిగే ఆసియాకప్ టోర్నీ కోసం మంగళవారం సెలెక్టర్లు 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో భారత్ బరిలోకి దిగనుండగా.. అతడికి డిప్యూటీగానూ గిల్ వ్యవహరించనున్నాడు. గతంలో అక్షర్ ఈ బాధ్యతలు నిర్వర్తించాడు. స్టార్ పేసర్ బుమ్రా సైతం జట్టులోకి రావడంతో పేస్ బలం రెట్టింపు కానుంది. అయితే ఐపీఎల్‌తో పాటు ఏడాది కాలంగా ఈ ఫార్మాట్‌లో విశేషంగా రాణిస్తున్న శ్రేయాస్ అయ్యర్‌కు సెలెక్టర్లు మొండిచేయి చూపారు. ఇక 25 ఏళ్ల గిల్ చివరి టీ20 మ్యాచ్‌ను గతేడాది జులై 30న శ్రీలంకపై ఆడాడు. ఆ తర్వాత బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లతో జరిగిన టీ20 సిరీస్‌లకు అతన్ని ఎంపిక చేయలేదు. ఇక ఇంగ్లండ్‌తో ఇటీవలి టెస్టు సిరీస్‌లో గిల్ అంచనాలకు మించి రాణించడం చూశాం. జైస్వాల్ సైతం పోటీలో ఉన్నా గిల్ వైపే మొగ్గు చూపారు. అయితే గిల్ రాకతో జట్టు ఓపెనర్ల సంఖ్య అభిషేక్, శాంసన్‌లతో కలిపి మూడుకు చేరింది. దీంతో అభిషేక్‌కు జతగా గిల్‌ను ఆడించి శాంసన్‌ను మిడిలార్డర్‌కు మార్చే అవకాశం ఉంది. అటు జట్టు దుబాయ్ చేరాక ప్రత్యర్థి జట్టు బలాలు, పరిస్థితులను గమనించి గిల్‌ను ఎక్కడ ఆడించాలనేది నిర్ణయం తీసుకుంటారని అగార్కర్ తెలిపాడు. బ్యాటింగ్ విభాగంలో హార్దిక్, తిలక్ వర్మ, శివమ్ దూబేలతో పాటు ఐపీఎల్‌లో ఇబ్బంది పడిన హిట్టర్ రింకూ సింగ్ చోటు దక్కించుకున్నాడు. బ్యాకప్ కీపర్‌గా జితేశ్ శర్మపై సెలెక్టర్లు నమ్మకముంచారు. ధ్రువ్ జురెల్ పేరును కూడా పరిగణనలోకి తీసుకున్నా అతడిని స్టాండ్‌బైగా ఎంపిక చేశారు. ఆర్‌సీబీ తరఫున జితేశ్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

బుమ్రా రాకతో..: ఆసియాకప్ తర్వాత విండీస్‌తో టెస్టు సిరీస్ ఉండడంతో స్టార్ పేసర్ బుమ్రా ప్రాతినిధ్యంపై సందేహాలు నెలకొన్నాయి. ఎందుకంటే సెప్టెంబరు 28న ఫైనల్ జరుగనుండగా.. అక్టోబరు 2 నుంచే టెస్టు ఆరంభమవుతుంది. అయితే పెద్ద టోర్నీల్లో బుమ్రా ఆడితేనే బావుంటుందనే ఆలోచనతో సెలెక్టర్లు అతడిని ఎంపిక చేశారు. దీంతో టీ20 ప్రపంచకప్ తర్వాత బుమ్రా ఈ ఫార్మాట్‌లో ఆడబోతున్నాడు. ఏదిఏమైనా బుమ్రా రాకతో భారత బౌలింగ్ మరింత పటిష్టం కానుంది. అతడికి జతగా పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, అర్షదీప్ సింగ్ బరిలోకి దిగనున్నారు. హర్షిత్ రాణా రిజర్వ్ పేసర్‌గా ఉండనున్నాడు. అంచనా వేసినట్టుగానే స్పిన్ త్రయం కుల్దీప్, అక్షర్, వరుణ్ చక్రవర్తిలకు చోటు దక్కింది. కోచ్ గంభీర్ ఆల్‌రౌండర్లకు ప్రాముఖ్యం ఇస్తుండడంతో వాషింగ్టన్ సుందర్‌ను కూడా తీసుకుంటారనే కథనాలు వెలువడ్డాయి. కానీ అతడిని స్టాండ్‌బైగానే పరిగణించారు.

శ్రేయాస్ ఎదురుచూడాల్సిందే..


అగార్కర్


శ్రేయాస్

ఐపీఎల్‌లో వరుసగా రెండుసార్లు సారథిగా తన జట్ల (కోల్‌కతా, పంజాబ్)ను ఫైనల్‌కు చేర్చడంతో పాటు బ్యాటింగ్‌లోనూ శ్రేయాస్ అయ్యర్ ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది సీజన్‌లో 175 స్ట్రయిక్ రేట్‌తో 604 పరుగులు సాధించాడు. అటు చాంపియన్స్ ట్రోఫీలోనూ కీలక పాత్ర పోషించాడు. అలాగే ఫార్మాట్ ఏదైనా చెలరేగి గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ, రంజీ, ఇరానీ ట్రోఫీల్లోనూ ముంబై జట్టును విజేతగా నిలిపాడు. అయినా టీ20 జట్టులో శ్రేయాస్‌కు చోటు దక్కకపోవడంతో సెలెక్టర్లపై ఫ్యాన్స్ గుర్రుగా ఉన్నారు. కనీసం స్టాండ్‌బై ఆటగాడిగానూ పనికిరాడా? అని విమర్శిస్తున్నారు. అయితే వీటికి సమాధానంగా అన్నట్టు అజిత్ అగార్కర్ స్పందించాడు. 'ఆసియాకప్‌నకు శ్రేయాస్ ఎంపిక కాకపోవడం దురదృష్టకరం. ఇందులో అతడి తప్పు లేదు.. మా తప్పు లేదు. ఎందుకంటే శ్రేయాస్‌ను ఎవరి స్థానంలో తీసుకోవాలో చెప్పండి? జట్టులో అత్యంత పోటీ వాతావరణం ఉంది. అందుకే తను మరికొంత కాలం వేచిచూడాల్సిందే' అని అగార్కర్ తేల్చాడు.

సూర్యకు చెక్ పెట్టేందుకేనా?

భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఇప్పుడు టీ20 జట్టు వైస్‌కెప్టెన్‌గానూ ఎంపిక చేశారు. ఏడాది క్రితం కూడా అతను ఈ బాధ్యతలు నిర్వర్తించినా అప్పట్లో ఈ అంశం చర్చనీయాంశం కాలేదు. కానీ తాజా పరిణామాలు మాత్రం ప్రస్తుత కెప్టెన్ సూర్యకుమార్‌కు ఓ హెచ్చరికగానే పరిశీలకులు భావిస్తున్నారు. ఐపీఎల్‌లో సూర్య మెరుగ్గానే రాణించినా గతేడాది అంతర్జాతీయ స్థాయిలో మాత్రం 26.81 సగటుతో నిరాశపరిచాడు. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టీ20 సిరీస్‌లో సూర్య ఐదు మ్యాచ్‌ల్లో చేసింది 28 పరుగులే. ఇందులో రెండు డకౌట్లు కూడా ఉన్నాయి. కెప్టెన్‌గా సూర్య విజయాలశాతం ఎక్కువగానే ఉన్నా ఆసియాకప్‌లో బ్యాటర్‌గా ఖచ్చితంగా నిరూపించుకోవాల్సి ఉంది. లేని పక్షంలో గిల్‌కు పగ్గాలు అప్పగించేందుకు సెలెక్టర్లు ఏమాత్రం సంకోచించరు. గిల్ ఇప్పటికే ఇంగ్లండ్ పర్యటనలో సారథిగా, బ్యాటర్‌గా శభాష్ అనిపించుకున్నాడు. అటు వన్డే ఫార్మాట్‌లోనూ కెప్టెన్ రోహిత్ కెరీర్‌పై సందేహాలు నెలకొనగా.. వైస్ కెప్టెన్ గిల్‌ను ప్రమోట్ చేసే అవకాశం ఉంది. ఇలా అన్ని ఫార్మాట్లకు గిల్ ఏకైక సారథిగా మారే రోజు దగ్గరలోనే ఉందని క్రీడా పండితులు బలంగా విశ్వసిస్తున్నారు. ఇదే ప్రశ్న అగార్కర్‌ను విలేకరులు అడగ్గా.. 'నేను ప్రస్తుతం టీ 20 క్రికెట్ గురించే చెప్పగలను. గిల్ ఇప్పటికే టెస్టు కెప్టెన్. అలాగే అతను చివరిసారి టీ20 ఆడినప్పుడు వైస్‌కెప్టెన్‌గానే ఉన్నాడు. ఇంగ్లండ్‌లో మాదిరే ఇక్కడా అతడిలో నాయకత్వ లక్షణాలు చూడాలనుకుంటున్నాం' అని అగార్కర్ సమాధానమిచ్చాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

భారత టీ20 జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేశ్ శర్మ, రింకూ సింగ్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, బుమ్రా, అర్షదీప్, హర్షిత్ రాణా.

స్టాండ్‌బై: ప్రసిద్ధ్ క్రిష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వీ జైస్వాల్.

క్రీడా బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: జాతీయ క్రీడా పాలనా బిల్లు చట్టంగా మారింది. ఉభయ సభల్లో బిల్లు పాస్ కావడంతో.. రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము కూడా ఆమోదముద్ర వేసినట్టు సోమవారం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీంతో పదేళ్ల ఎదురుచూపులకు మోక్షం లభించింది. కీలకమైన జాతీయ క్రీడా బోర్డు ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

సెమీస్‌లో స్వియటెక్ జోడీ

యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ చాంపియన్‌షిప్


స్వియటెక్ రూడ్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌షిప్‌లో స్వియటెక్, డిఫెండింగ్ చాంప్ సారా ఎరాని జంటలు సెమీస్ చేరుకొన్నాయి. క్వార్టర్స్‌లో స్వియటెక్ -కాస్పర్ రూడ్ ద్వయం 4-1, 4-2తో కేటీ మెక్‌నెల్లీ-ముసెట్టి జంటపై గెలిచింది. తొలిరౌండ్‌లో కీన్-టియాఫోపై స్వియటెక్ జోడీ గెలిచింది. క్వార్టర్స్‌లో ఎరాని-వవస్సోరి జంట 4-1, 5-4(4)తో ముచోవా-రుబ్లేవ్‌పై నెగ్గింది. మొదటి రౌండ్‌లో రిబకినా-ఫ్రిట్జ్‌పై 4-2, 4-2తో ఎరాని జంట నెగ్గింది. కాగా, వీనస్ విలియమ్స్-రిల్లీ ఒపెల్కా 2-4, 4-5(2)తో ముచోవా-రుబ్లేవ్ ద్వయం చేతిలో, ఒసాక-మోన్‌ఫిల్స్ జోడీ 3-5, 2-4తో కేటీ-ముసెట్టి జంట చేతిలో తొలి రౌండ్‌లోనే ఓడారు.

రష్మికకు స్వర్ణం.. మనుకు కాంస్యం

ఆసియా షూటింగ్


రష్మిక మను

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): భారత స్టార్ షూటర్ మను భాకర్ ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకం సాధించింది. సీనియర్ విభాగం మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్ ఫైనల్స్‌లో 219.7 పాయింట్లు స్కోరు చేసిన మను.. మూడోస్థానంలో నిలిచి కాంస్యం అందుకుంది. ఇక, ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో పాలక్, సురుచి సింగ్‌లతో కలిసి మను భాకర్ కాంస్యం నెగ్గి రెండో పతకం ఖాతాలో వేసుకుంది. అలాగే జూనియర్ బాలికల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో భారత అమ్మాయి రష్మి సాగల్ స్వర్ణం కొల్లగొట్టింది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్‌లోనూ రష్మిక.. వంశిక, మోహినిలతో కలిసి పసిడి నెగ్గి గోల్డెన్ డబుల్ సాధించింది. కాగా, యూత్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కనక్ స్వర్ణం, ఆగమ్ గ్రేవాల్ రజతం నెగ్గారు. ఇక, టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు పసిడి సాధించింది. జూనియర్ బాలుర ఎయిర్ పిస్టల్‌లో గవిన్ కాంస్యం అందుకోగా.. యూత్ పురుషుల ఎయిర్ పిస్టల్‌లో గిరీష్ స్వర్ణం, దేవ్ ప్రతాప్ కాంస్యం గెలిచారు. ఇక, యూత్ పురుషుల టీమ్ ఈవెంట్‌లోనూ భారత జట్టు పసిడి సాధించడం విశేషం.

బాబర్, రిజ్వాన్‌లకు మరో షాక్

లాహోర్: సీనియర్లు బాబర్ ఆజమ్, వన్డే కెప్టెన్ రిజ్వాన్‌లను ఆసియా కప్ జట్టుకు ఎంపిక చేయకుండా ఝలకిచ్చిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వారిద్దరికి మరో షాక్ ఇచ్చింది. వారిని ఏకంగా సెంట్రల్ కాంట్రాక్ట్ 'ఎ' కేటగిరీ నుంచి తప్పించి 'బి' గ్రేడ్‌కు పంపింది. మంగళవారం 30 మంది ఆటగాళ్లకు కాంట్రాక్ట్‌లు ఇవ్వగా.. ఒక్కరికి కూడా ఎలీట్ కేటగిరీలో చోటుదక్కలేదు.

కింగ్స్‌పై బుల్స్ గెలుపు

విశాఖపట్నం స్పోర్ట్సు (ఆంధ్రజ్యోతి): ఏపీఎల్‌లో భాగంగా మంగళవారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో భీమవరం బుల్స్ 27 పరుగుల తేడాతో కాకినాడ కింగ్స్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బుల్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 214 పరుగులు చేసింది. సాయిశ్రవణ్ (58 పరుగులు), రేవంత్‌రెడ్డి (51) అర్ధ సెంచరీలు సాధించారు. కింగ్స్ బౌలర్లలో సుదర్శన్, మణికంఠకు చెరి రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో కాకినాడ 19.5 ఓవర్లలో 187 రన్స్‌కే ఆలౌటైంది. కేఎస్ భరత్ (76) కెప్టెన్స్ ఇన్నింగ్స్ ఆడినా ఫలితం దక్కలేదు. బుల్స్ బౌలర్లలో శివ, సత్యనారాయణ రాజు, మనీష్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. మరో మ్యాచ్‌లో రాయల్స్ ఆఫ్ రాయలసీమ (161/5)పై అమరావతి రాయల్స్ (17.3 ఓవర్లలో 163/3) గెలిచింది.

కేశవ్ పాంచ్

తొలి వన్డేలో ఆసీస్‌కు దక్షిణాఫ్రికా షాక్



కెయిన్స్: ఆస్ట్రేలియా పర్యటనలో మూడు వన్డేల సిరీస్‌ను దక్షిణాఫ్రికా ఘనంగా బోణీ చేసింది. మంగళవారం జరిగిన మొదటి మ్యాచ్‌లో లెఫ్టామ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (5/33) కెరీర్ బెస్ట్ గణాంకాలు నమోదు చేయడంతో సఫారీ జట్టు 98 పరుగుల తేడాతో ఆతిథ్య ఆసీస్‌కు షాకిచ్చింది. తొలుత దక్షిణాఫ్రికా.. ఓపెనర్ మార్‌క్రమ్ (82), కెప్టెన్ బవుమా (65), మాథ్యూ బ్రెజెకె (57) అర్ధ సెంచరీలతో 50 ఓవర్లలో 8 వికెట్లకు 296 పరుగులు చేసింది. హెడ్ 4, డ్వార్షుయిస్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో సఫారీ బౌలర్లు కేశవ్‌కు తోడు ఎంగిడి (2/28), బర్గర్ (2/54) ధాటికి ఆసీస్ 40.5 ఓవర్లలో 198 పరుగులకే కుప్పకూలింది. సారథి మిచెల్ మార్ష్ (88) ఒంటరి పోరాటం చేశాడు. ఐదు వికెట్లతో అదరగొట్టిన కేశవ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

గుకేష్‌పై ప్రజ్ఞానంద గెలుపు

సింక్వెఫీల్డ్ కప్ చెస్

సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): సింక్వెఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో ప్రపంచ చాంపియన్ గుకేష్‌కు ప్రజ్ఞానంద షాకిచ్చాడు. క్లాసికల్ ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ టోర్నీ మొదటి రౌండ్లో గుకేష్‌ను కేవలం 36 ఎత్తుల్లోనే చిత్తు చేశాడు. ఈ విజయంతో ప్రజ్ఞానంద లైవ్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానానికి దూసుకెళ్లాడు. ఇతర తొలి రౌండ్ గేమ్‌లలో నోదిర్బెక్‌పై అరోనియన్ నెగ్గగా.. కరువానాతో డూడా, శామ్యూల్‌తో వెస్లీ, మాగ్జిమ్‌తో అలీ రెజా గేమ్‌లను డ్రాగా ముగించారు. ఆరంభ రౌండ్ ముగిసేసరికి ప్రజ్ఞానంద, అరోనియన్ సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

పాక్ స్థానంలో బంగ్లా ఖరారు

ఆసియా కప్ హాకీ

న్యూఢిల్లీ: భారత్‌లో జరిగే ఆసియాకప్ హాకీ టోర్నమెంట్‌లో పాకిస్థాన్, ఒమన్ జట్ల స్థానాల్లో బంగ్లాదేశ్, కజకిస్థాన్ బరిలోకి దిగనున్నాయి. ఈనెల 29 నుంచి సెప్టెంబరు 7 వరకు బిహార్‌లోని రాజ్‌గిర్‌లో టోర్నీ జరగనుంది. అయితే, పాక్ ఆటగాళ్లకు వీసాలు మంజూరు చేస్తామని భారత ప్రభుత్వం చెప్పినా.. ఆ జట్టు భద్రతా కారణాల సాకుతో టోర్నీ నుంచి వైదొలగింది. దీంతో ఆ జట్టు బదులు బంగ్లాకు చోటు కల్పించినట్టు నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. అలాగే, ఒమన్ కూడా టోర్నీకి దూరమవడంతో కజకిస్థాన్‌కు ఆడే అవకాశం దక్కింది. మొత్తం 8 జట్లు పోటీపడే టోర్నీలో పూల్-ఎ నుంచి ఆతిథ్య భారత్, చైనా, జపాన్, కజకిస్థాన్.. పూల్-బి తరఫున డిఫెండింగ్ చాంప్ కొరియా, మలేసియా, చైనీస్ తైపీ, బంగ్లాదేశ్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. తొలి మ్యాచ్‌లో చైనాతో భారత్ తలపడనుంది.

విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను తీసేయండి

- కేబుల్ ఆపరేటర్ల తీరు వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు
- అనుమతుల్లేని విద్యుత్ కనెక్షన్లపై కఠిన చర్యలు: భట్టి విక్రమార్క



హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలపై ప్రాణాంతకంగా మారిన కేబుల్ వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. కేబుల్ వైర్లను తొలగించాలని సంవత్సర కాలంగా కేబుల్ ఆపరేటర్లకు పలుమార్లు నోటీసులు ఇచ్చి.. తగినంత సమయం ఇచ్చామని, అయినా వారు స్పందించకపోవడంతో ప్రజల ప్రాణానికి ముప్పు ఏర్పడిందని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని ఉపేక్షించేది లేదని, రాష్ట్రవ్యాప్తంగా అధికారులు, సిబ్బంది విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను తొలగించే కార్యక్రమంపై దృష్టి పెట్టాలని సూచించారు. అనుమతులు లేకుండా అక్రమంగా విద్యుత్తు కనెక్షన్లు ఏర్పాటు చేసుకుంటే కఠినంగా స్పందించి, వాటిని తొలగించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడైనా విద్యుత్ శాఖ సిబ్బంది సహాయంతోనే విద్యుత్ కనక్షన్ తీసుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానం లేని వ్యక్తుల ద్వారా కనెక్షన్లు తీసుకోవడం వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడతోందని హెచ్చరించారు. హైదరాబాద్ మహానగరంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల్లోని పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాల క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం భట్టి విక్రమార్క అధ్యక్షత మంగళవారం సచివాలయంలో జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క పాల్గొన్నారు. రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందేందుకు పెట్టుబడులు కీలకమని, ఆర్థిక వనరులను జాగ్రత్తగా వినియోగించుకుంటూ ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఒకవైపు అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేస్తూనే మరోవైపు ఆదాయాన్ని పెంచేలా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు.

గణేశ్ విగ్రహాల తరలింపులో విద్యుదాఘాతాలు!

(మొదటిపేజీ తరువాయి)


వికాస్ ఠాకూర్(ఫైల్)

కథనం ప్రకారం... హైదరాబాద్‌లోని హుసేని ఆలం చంద్రికాపురానికి చెందిన అఖిల్, వికాస్ ఠాకూర్ సహా మరికొందరు తమ ప్రాంతంలో ప్రతిష్ఠించేందుకు కావాల్సిన విగ్రహం కోసం రత్లావత్ ధోనికి చెందిన ట్రాక్టర్‌లో జల్‌పల్లిలో వెళ్లారు. కొనుగోలు చేసిన విగ్రహంతో తిరిగి వస్తుండగా బండ్లగూడ రాయల్‌సీ హోటల్ సమీపంలో పైనున్న విద్యుత్ తీగలు వినాయక విగ్రహానికి తగిలాయి. దీంతో విద్యుత్ షాక్ కొట్టడంతో ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న యువకులంతా ఒక్కసారిగా కిందికి దూకేశారు. అయితే, ట్రాక్టర్ డ్రైవర్ ధోనితోపాటు, వికాస్ ఠాకూర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. తోటి యువకులు వారిని ఓవైసీ ఆస్పత్రికి తరలించగా ఇరువురు అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. అయితే, ధోని, వికాస్ ఠాకూర్ మరణానికి విద్యుదాఘాతం కారణం కాదని విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ విలేకరులతో అన్నారు. విగ్రహం విద్యుత్ తీగలకు తాకినప్పుడు ఓ మెరుపు వచ్చిందని, దానిని చూసిన యువకులంతా వాహనం నుంచి కిందికి దూకారని చెప్పారు. ఈ క్రమంలో గాయపడి వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారని వివరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండలం నాగులపల్లి తండాకు చెందిన రత్లావత్ ధోని ట్రాక్టర్ నడుపుతూ తన తండ్రి, తమ్ముడు, చెల్లిని పోషిస్తున్నాడు. ధోనికి మూడు నెలల క్రితం వివాహం నిశ్చయమవ్వగా నవంబరులో పెళ్లి జరగాల్సి ఉంది. ఈ లోపే ప్రాణాలు కోల్పోయాడు. ధోని కుటుంబసభ్యులు నష్టపరిహారం డిమాండ్ చేస్తూ బండ్లగూడ పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఇక, బిహార్ నుంచి హైదరాబాద్ వలస వచ్చిన ఓ కుటుంబానికి చెందిన వికాస్ ఠాకూర్ డిగ్రీ చదువుతూ.. జూపార్క్ పార్కింగ్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు.

పుట్టిన రోజునే తుది శ్వాస

సిరిసిల్లకు చెందిన 15 మంది యువకులు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పరిధిలోని పెర్కిట్‌లో వినాయకుడి విగ్రహాన్ని కొనుగోలు చేసి మంగళవారం ఉదయం స్వస్థలానికి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఆరేపల్లి స్టేజ్ వద్ద వీరి వాహనంలో ఉన్న వినాయక విగ్రహానికి పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో విద్యుదాఘాతానికి గురై వాహనంలో ఉన్న కొమ్ము లక్ష్మీనారాయణ(20) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా సాయి అనే మరో యువకుడు గాయపడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటర్ విద్యార్థి అయిన సిరిసిల్లకు చెందిన లక్ష్మీనారాయణ పుట్టినరోజు మంగళవారం(ఆగస్టు 19) కాగా, అదే రోజున అతను మరణించడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.


ఆరేపల్లి స్టేజీ వద్ద ప్రమాదస్థలిలో అధికారులు

వినాయక మండపం పనుల్లో ఉండగా విద్యుదాఘాతం !


రాంచరణ్ (ఫైల్)

అంబర్‌పేట: హైదరాబాద్, బాగ్ అంబర్‌పేటలో వినాయక మండపం పనులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై గాయపడిన అదే ప్రాంతానికి చెందిన ఎం. రాంచరణ్(18) ఆస్పత్రిలో మరణించాడు. బాగ్‌అంబర్‌పేట తురాబ్‌నగర్‌కు చెందిన రాంచరణ్ డెకరేషన్ పనులు చేస్తుంటాడు. బాగ్‌అంబర్‌పేట రెడ్ బిల్డింగ్ చౌరస్తా సమీపంలో స్నేహితులతో కలిసి సోమవారం రాత్రి ఓ వినాయక మండపం నిర్మాణం పనులు చేపట్టాడు. ఇందులో భాగంగా మండపం ఎత్తు పెంచే క్రమంలో అడ్డు వస్తున్న విద్యుత్ తీగను రాంచరణ్ కర్రతో పైకి ఎత్తేందుకు యత్నించాడు. అయితే, వర్షం కురుస్తుండడం, కర్ర తడిచిపోయి ఉండడంతో ఒక్కసారిగా షాక్ కొట్టినట్టు అయింది. దీంతో భయపడిన రాంచరణ్ మండపం పైనుంచి కిందికి దూకగా అతని తల వెనక భాగంలో తీవ్ర గాయమైంది. అయితే, కాచిగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంచరణ్ మంగళవారం సాయంత్రం మరణించాడు.

కల్తీసారా తాగిన వారి వీసాలు రద్దు

- దేశ బహిష్కరణకు కువైత్ నిర్ణయం
- మళ్లీ రాకుండా జీవితకాల నిషేధం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

మద్య నిషేధం అమలులో ఉన్న కువైత్‌లో కల్తీ సారా కలకలం కొనసాగుతోంది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కువైత్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఈ దుర్ఘటన అనంతరం భారతీయులు, ఇతర విదేశీ కార్మికులు నివసిస్తున్న ప్రాంతాల్లో పోలీసులు రేయింబవళ్లు తనిఖీలు చేస్తున్నారు. వీసా, ఇంటి చిరునామాలో ఎలాంటి లొసుగులు కనిపించినా అరెస్టు చేసి జైలుకు తరలిస్తున్నారు. దీంతో ఇక్కడ ప్రవాసాంధ్రులు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. కల్తీ సారాతోపాటు వ్యభిచారం, ఇతర నేరాలకు నెలవైన జ్లీబ్ అల్ శూయుఖ్ అనే ప్రాంతాన్ని పూర్తిగా నేలమట్టం చేసి, దాన్ని పునర్నిర్మించే ప్రతిపాదనను కూడా కువైత్ ప్రభుత్వం పరిశీలిస్తోంది. 8 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో ఉన్న ఈ ప్రాంతం అనేక నేరాలకు అడ్డాగా మారింది. ఇక్కడ ప్రవాసాంధ్ర కార్మికులు, ఇతర భారతీయులు, బంగ్లాదేశీయులు నివసిస్తున్నారు. కల్తీ సారా సేవించి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న భారతీయులతో సహా విదేశీయులందరూ కోలుకున్న అనంతరం వారందరి వీసాలు రద్దు చేసి దేశ బహిష్కరణ విధించడంతోపాటు వారు జీవితంలో మళ్లీ తమదేశంలో అడుగు పెట్టకుండా నిషేధించాలని కువైత్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇస్లామిక్ చట్టం అమలులో ఉన్న కువైత్‌లో సారా విక్రయం, వినియోగం నిషేధం. దీన్ని ఉల్లంఘించినందుకు ఈ చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్టు కువైత్ అధికారులు ప్రకటించారు. కల్తీ సారా తాగిన వారిలో 40 మంది భారతీయులు సహా మొత్తం 160 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఒక్క ఇటుక పేర్చలేని దద్దమ్మ సీఎం రేవంత్ రెడ్డి

టన్నెల్ తవ్వడమే చేతగాని సన్నాసులు కాళేశ్వరంపై విమర్శలా?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విసుర్లు

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల మాట దేవుడెరుగు చివరకు ఒక్క ఇటుక కూడా పేర్చలేని దద్దమ్మ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్కారు ముక్కు నేలకు రాయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సరిగ్గా సుంకిశాల రిటైనింగ్ వాల్ నిర్మించే తెలివి లేని, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వడమే చేతగాని కాంగ్రెస్ సన్నాసులు కాళేశ్వరం ప్రాజెక్టులపై విమర్శలు చేయడమా? అని ప్రశ్నించారు. మరోమారు కాళేశ్వరం ప్రాజెక్టుపై నోరు పారేసుకోబోమని లెంపలేసుకోవాలన్నారు. మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలం గుడిబండ పెద్దవాగుపై నిర్మించిన చెక్ డ్యామ్ 2నెలల్లోనే ఎందుకు కొట్టుకుపోయిందో సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ.. నాసిరకం పనులతో రైతుల పొలాలు, మోటారు పైపులైన్లతోపాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కొట్టుకు పోయిందన్నారు.

శోభాయాత్ర ప్రమాదంపై హక్కుల కమిషన్ విచారణ

- సెప్టెంబరు 22లోగా నివేదికివ్వాలని డిస్కం సీఎండీకి ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్‌లో కృష్ణ జన్మాష్టమి సందర్భంగా జరిగిన శోభయాత్రలో విద్యుత్‌షాక్‌తో అయిదుగురు ప్రాణాలు కోల్పోయి, పలువురు గాయపడిన సంఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా విచారణకు స్వీకరించింది. సంఘటనకు గల కారణాలు, అధికారుల జవాబుదారీతనం, తక్షణ పరిష్కార చర్యలు, బాధితుల కుటుంబాలకు పరిహారం, పునరావాసం, దీర్ఘకాలిక భద్రతా చర్యలను వివరిస్తూ సమగ్ర నివేదికను సెప్టెంబరు 22 నాటికి సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు టీజీహెచ్‌ఆర్సీ ఛైర్మన్ డా.జస్టిస్ షమీమ్ అక్తర్.. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీని ఆదేశాలు ఇచ్చారు.

కాంగ్రెస్‌తోనే మైనార్టీల అభివృద్ధి: మంత్రి లక్ష్మణ్

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు పూర్తి అండగా ఉంటూ, వారి అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. మైనార్టీల్లో అత్యంత వెనకబడిన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. 173 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న బడుల్లో విద్యావాలంటీర్లను నియమించే అవకాశం కల్పించామని ఆయన తెలిపారు.

'కన్ఫర్డ్'లుగా 17 మంది సిఫారసు!

- డిప్యూటీ తహసీల్దార్ క్యాడర్‌కు చెందిన స్పెషల్, సెలెక్షన్ గ్రేడ్ అధికారులను రికమండ్ చేసిన సీసీఎల్ఏ

హైదరాబాద్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే జాబితాలో 17 మంది డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) క్యాడర్‌కు చెందిన స్పెషల్ గ్రేడ్, సెలెక్షన్ గ్రేడ్ అధికారులను కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా సిఫారసు చేసింది. ఈ 17 మంది కూడా ప్రస్తుతం ఆర్డీవో, డిప్యూటీ కలెక్టర్ హోదాలకన్నా పైస్థాయిలో ఉన్నవారే! అయితే ఇంతపెద్ద సంఖ్యలో సీసీఎల్ఏ సిఫారసు చేయడం తెలుగు రాష్ట్రాల నుంచి ఇదే మొదటిసారి కావడం విశేషం. సీసీఎల్ఏ సిఫారసు చేసిన 17 మంది కూడా 1994లో డిప్యూటీ తహసీల్దార్లుగా నియామకమైన వారే! సాధారణంగా రాష్ట్ర రెవెన్యూ సర్వీసు నుంచి ఎవరైనా కన్ఫర్డ్ ఐఏఎస్ పొందాలంటే 56ఏళ్ల లోపు వయసు, వరుసగా ఎనిమిది ఏళ్ల పాటు డిప్యూటీ కలెక్టర్‌గా చేసి ఉండాలి. అయితే ఇటీవల తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసు నిబంధనలను ప్రభుత్వం సవరించడం గమనార్హం.

మా అవకాశాలకు దెబ్బ

- 'కన్ఫర్డ్'ల సిఫారసులపై గ్రూప్-1 ఉద్యోగుల ఆందోళన

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఒకే జాబితాలో 17 మంది డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) క్యాడర్‌కు చెందిన స్పెషల్ గ్రేడ్, సెలెక్షన్ గ్రేడ్ అధికారులను కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా సీసీఎల్ఏ సిఫారసు చేయడంపై గ్రూప్-1 ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కన్ఫర్డ్ ఐఏఎస్‌గా సిఫారసుకు కావాల్సిన అర్హతలు డీటీల్లో కొందరికి లేకపోయినా వారికి అనుకూలంగా ఉండేలా తెలంగాణ సివిల్ సర్వీసు నిబంధనలు సవరించారని విమర్శిస్తున్నారు. సిఫారసు జాబితాలోకి ఎక్కువ మంది వచ్చేవిధంగా ఉద్యోగ విరమణ చేసిన వారిని, చనిపోయిన వారి సీనియారిటీని తొలగించారని ఆరోపిస్తున్నారు. అందునా.. సర్వీసు నిబంధనలను సవరిస్తే.. అవి, మార్పులు చేసిన రోజు నుంచే వర్తిస్తాయని, ప్రభుత్వం మాత్రం తెలంగాణ సివిల్ సర్వీసు నిబంధనలను సవరిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల విషయంలో ఈ నియమాన్ని పాటించలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రాష్ట్ర రెవెన్యూ సర్వీసు నుంచి ఎవరైనా కన్ఫర్డ్ ఐఏఎస్ పొందాలంటే 56ఏళ్లలోపు వయసు, 8 ఏళ్ల పాటు వరుసగా డిప్యూటీ కలెక్టర్‌గా చేసి ఉండాలనే నిబంధన ఉందని.. 17 మందిలో కొందరి విషయంలో ఈ రూల్ పాటించలేదని విమర్శిస్తున్నారు. తాజా సిఫారసులతో 2017లో గ్రూప్-1 ద్వారా డిప్యూటీ కలెక్టర్లుగా నేరుగా నియామకమైన తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. మరో నాలుగు నెలల్లో తాము కన్ఫర్డ్ ఐఏఎస్‌కు అర్హత సాధించే అవకాశం ఉందని.. ఇంతలోపే డిప్యూటీ తహసీల్దార్ క్యాడర్‌లో నియామకమైన 17 మందిని సిఫార్సు చేస్తే తమ అవకాశాలు దెబ్బతింటాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇదే నిబంధనలను వర్తింపజేయాలంటూ 1995 తర్వాత డిప్యూటీ తహసీల్దార్లుగా నియామకమైన వారు కూడా కన్ఫర్డ్ ఐఏఎస్ పదోన్నతుల కోసం పోటీ పడే అవకాశం ఉంటుందని.. దీని వల్ల గ్రూప్-1 ద్వారా డిప్యూటీ కలెక్టర్లుగా నియామకమయ్యే వారు నష్టపోయే ప్రమాదం తలెత్తుతుందని వాపోతున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయ్యాక పదోన్నతుల విషయంలో శాశ్వత ప్యానల్ ఏర్పాటు కాలేదని.. తాత్కాలిక ప్యానల్స్ ద్వారా పదోన్నతులు పొందిన వారిని కన్ఫర్డ్ ఐఏఎస్‌కు ఎలా సిఫార్సు చేస్తారని 2017 బ్యాచ్ అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. 2026 జనవరిలో ఐఏఎస్ పొందాల్సిన 2017 గ్రూప్-1 అభ్యర్థులు మరో పదేళ్లపాటు వేచి ఉండాల్సిన పరిస్థితి. సీనియారిటీ నిర్ణయించే ముందు ప్యానల్ నిర్ధారించకపోవడం, అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను కూడా స్వీకరించకుండా గుట్టు చప్పుడు కాకుండా సీసీఎల్ఏ కన్ఫర్డ్ ఐఏఎస్ అభ్యర్థుల జాబితాను తయారు చేయడం అధికార వర్గాల్లో విమర్శలకు దారితీస్తోంది.





మహబూబాబాద్ జిల్లా గూడూరు సొసైటీలో క్యూలైన్‌లో నిల్చున్న రైతులు; గట్టు సహకార కేంద్రం వద్ద యూరియా కోసం గొడుగులు పట్టుకుని నిల్చున్న రైతులు

జోరు వానలోనూ బారులు

తెల్లవారకముందే యూరియా కోసం పరుగులు.. గొడుగులు పట్టుకుని భారీ క్యూ లైన్లలో నిరీక్షణ

పలు జిల్లాల్లో కొనసాగుతున్న రైతుల తిప్పలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

యూరియా కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)ల వద్ద రైతులు పడిగాపులు కాస్తూనే ఉన్నారు. అరకొర స్టాక్ వస్తుండటంతో తెల్లవారకముందే అన్నదాతలు పీఏసీఎస్‌లకు పరుగులు తీస్తున్నారు. ఇంత చేసినా దొరికేది ఒక్క బస్తానే. రోజంతా వానలో నిలబడ్డా కొందరికి అదీ దక్కడం లేదు. దీంతో అన్నదాతలు ఆవేదనతో వెనుదిరుగుతున్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు పీఏసీఎ్‌సకు వస్తున్న యూరియా స్థానిక అవసరాలకు సరిపోవడం లేదు. సొసైటీకి మంగళవారం 1,200 యూరియా బస్తాలు రాగా, సుమారు 2 వేల మంది లైన్‌లో నిరీక్షించారు. కొంతమంది ఒక రోజు ముందే చేరుకుని సొసైటీ, దుకాణ సముదాయాల ఎదుట నిద్రపోయారు. వందలాది మంది ఉదయం 6 గంటల నుంచే సొసైటీ వద్దకు వచ్చారు. ఆధార్ కార్డులతో మహిళా రైతులు, వృద్ధులు, యువకులతో పాటు రైతుల పిల్లలు సైతం లైన్‌లో నిలబడ్డారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గంటల తరబడి లైన్‌లో నిరీక్షించారు. అధికారులు ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున 1,200 మందికి అందించారు. మిగతా రైతులకు టోకెన్లు ఇచ్చారు. గూడూరు అటవీ శాఖ కార్యాలయం, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి యూరియా కోసం వచ్చిన రైతులకు టోకెన్లు ఇచ్చారు. గద్వాల జిల్లా గట్టు మండలంలో రైతులు తెల్లవారుజామునే పీఏసీఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. వెంట తెచ్చుకున్న పట్టాదారు పాసుబుక్కులు, తువ్వాళ్లను లైన్‌లో పెట్టారు. గంటల తరబడి లైన్‌లో నిలుచున్న రైతులు ఈ-పాస్ యంత్రం మొరాయించడంతో సహనం కోల్పోయి అధికారులతో వాగ్వాదానికి దిగారు. కార్యాలయం లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. పీఏసీఎస్ ఛైర్మన్ అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు. రైతులు ఆందోళనకు దిగడంతో పోలీసులు సముదాయించారు. అధికారులు ఒక్కొక్కరికి రెండు బస్తాలు ఇవ్వడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్, చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో రైతులు యూరియా కోసం తెల్లవారుజామునే సహకార సంఘాల వద్దకు చేరుకున్నారు. చిగురుమామిడి మండలం ఇందుర్తిలో ఉదయం ఐదు గంటల నుంచే యూరియా కోసం రైతులు క్యూలో ఉన్నారు. మధ్యాహ్నం వరకు వేచి ఉండగా ఒక్కో రైతుకు రెండు బస్తాలు ఇచ్చారు. సైదాపూర్ మండల కేంద్రంలోని వెన్కేపల్లి సొసైటీలో ఒక్కో రైతుకు ఒక బస్తా పంపిణీ చేశారు. ఆలస్యంగా వచ్చిన వారికి యూరియా అందకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెదక్, సంగారెడ్డిలోనూ..

మెదక్, సంగారెడ్డి జిల్లాలో యూరియా కోసం అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. మంగళవారం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రైతులు దుకాణాల వద్ద బారులు తీరారు. పొలం పనులు మానుకుని గంటల తరబడి లైన్‌లో నిలబడ్డారు. నిజాంపేట, చేగుంట, నర్సాపూర్, చిన్నశంకరంపేట తదితర మండల కేంద్రాలోని ఎరువుల దుకాణాల వద్ద పెద్ద ఎత్తున రైతుల క్యూ కనిపించింది. లోడ్ రాగానే ఖాళీ అవుతుండటంతో క్యూలో నిల్చున్నా దొరకని పరిస్థితి ఉందని రైతులు అసహనం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌పై అక్కసుతోనే యూరియా సరఫరా చేయట్లేదు

- తెలంగాణ వాటాను వెంటనే ఇవ్వాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పై ఉన్న అక్కసుతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన మేరకు యూరియాను సరఫరా చేయట్లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన యూరియా వాటాను తక్షణమే కేంద్రం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక్కడి రైతులు యూరియా కోసం ఆందోళన చేస్తుంటే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఢిల్లీలో నిద్రపోతున్నారని విమర్శించారు. యూరియా కోసం ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖ రాశారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికార ఒప్పందంతోనే యూరియాను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. మాజీ రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ జయంతి సందర్భంగా మంగళవారం గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి మహేశ్‌గౌడ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు తదితరులు నివాళులర్పించారు. కాగా, తాండూరు నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నేతలు మంగళవారం నాడు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మహేశ్‌గౌడ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

దక్షిణమధ్య రైల్వేలో మహిళా శక్తి!

మహిళల పర్యవేక్షణలో ఐదు కీలక విభాగాలు

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఐదు కీలక విభాగాలకు మహిళల నేతృత్వంతో దక్షిణ మధ్య రైల్వే 'మహిళా శక్తి'కి తార్కాణంగా నిలుస్తోంది. రైళ్ల కార్యకలాపాల నిర్వహణలో సంక్లిష్టమైన, వ్యూహాత్మక నిర్ణయాలతో కూడిన ఆపరేటింగ్ శాఖకు కె.పద్మజ ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. టికెట్ల విక్రయం, రిజర్వేషన్లు, స్టేషన్ల నిర్వహణ, సరుకు రవాణా, మార్కెటింగ్, ఆదాయ వనరుల పెంపు బాధ్యతలు నిర్వర్తించే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా ఇటీ పాండే.. రైల్వే, ప్రయాణికుల భద్రతకు కీలకమైన ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌గా అరోమాసింగ్ ఠాకూర్.. ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్‌గా డాక్టర్ నిర్మల నరసింహన్.. ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా హేమ సునీత విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష

- యూరియా ఇవ్వకుండా రైతులను .. ఇబ్బంది పెడుతున్న మోదీ సర్కారు
- పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీల నిరసన
- ధర్నాకు ప్రియాంకగాంధీ మద్దతు



పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ధర్నాలో పాల్గొన్న ప్రియాంకగాంధీ

న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని కాంగ్రెస్ ఎంపీలు ఆరోపించారు. మోదీ సర్కారు ఉద్దేశపూర్వకంగానే తెలంగాణ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. తెలంగాణకు యూరియా ఇవ్వాలని కోరుతూ పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీల నిరసన మంగళవారం కూడా కొనసాగింది. సభ ప్రారంభం కావడానికి ముందు పార్లమెంట్ ఆవరణలోని మకర్ ద్వారం వద్ద తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘురాంరెడ్డి, కడియం కావ్య, బలరాం నాయక్, వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్, రఘువీర్ రెడ్డి, సురేశ్ షెట్కార్ సహా ఇతర ఇండియా కూటమి ఎంపీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'మా వాటా మాకు ఇవ్వండి - తెలంగాణ రైతుల్ని కాపాడండి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ఆందోళనలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ పాల్గొని మద్దతు తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ నిర్వహిస్తున్న యూరియా పోరాటానికి అండగా ఉంటానని ఆమె భరోసా ఇచ్చారు. అనంతరం సభలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్లకార్డు చేతబట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూరియా సమస్య పరిష్కారం కోసం ఢిల్లీలో ఆందోళన కార్యాచరణపై ఎంపీలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. తెలంగాణకు యూరియా ఇవ్వాలంటూ నిరసన, ఆందోళన చేపడుతున్న రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు కేంద్ర మంత్రులనూ కలిసి సమస్యలు వివరిస్తున్నారు. మంగళవారం కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు కాంగ్రెస్ ఎంపీలు వినతిపత్రం అందజేశారు. వారంలో 62 వేల మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణకు ఇస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీలు తెలిపారు.



కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న రామచందర్‌రావు

బీసీ రిజర్వేషన్లపై తప్పుదారి పట్టిస్తున్న కాంగ్రెస్

రాజకీయాల్లో మత పరమైన రిజర్వేషన్లు సరికాదు

- రాష్ట్రంలో ఈసారి అధికారం బీజేపీదే
- యూరియా పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని కేంద్రంపైకి నెడుతున్నారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

వికారాబాద్, హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను మోదీ అడ్డుకుంటున్నారంటూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేనిది కాంగ్రెస్‌కేనన్నారు. మతం ఆధారంగా రిజర్వేషన్లకు తమ పార్టీ వ్యతిరేకమని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం వికారాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యకర్తల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకం కాదని, ఇప్పటికే వారు బీసీ-బీ, బీసీ-ఈ, ఈబీసీ కోటాలో విద్యా, ఉద్యోగాల్లో లబ్ధి పొందుతున్నారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం యూరియా సరఫరా చేయడం లేదని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం సరఫరా చేసిన యూరియా రైతులకు ఎందుకు అందడం లేదో గుర్తించాల్సిన బాధ్యతను మరిచి... ఆ వైఫల్యాన్ని కేంద్ర ప్రభుత్వంపై నెట్టివేసే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సునామీ వచ్చినా.. ఏ శక్తి అడ్డొచ్చినా రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే.. వికారాబాద్ జిల్లా పేరును అనంతగిరిగా మారుస్తామని, జిల్లాను పర్యాటక కేంద్రంగా, దక్షిణ ఊటీగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల పాలన చూసిన ప్రజలు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని రామచందర్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని మరో ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర సర్కారు రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందని... దళారులకు వంత పాడుతోందని దుయ్యబట్టారు. "రాష్ట్రానికి 9.5 లక్షల టన్నుల యూరియా అవసరం కాగా, కేంద్రం 12 లక్షల టన్నులు సరఫరా చేసింది. ఐనా ఎందుకు కొరత ఏర్పడిందో రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. యూరియా పక్కదారి పట్టిన ఘటనపై ఎందుకు దర్యాప్తు చేయడం లేదని నిలదీశారు.

యూరియా.. వరి మాయ

(మొదటి పేజీ తరువాయి)



అయిజ మండలంలోని సింగిల్ విండో వద్ద యూరియా కోసం తోపులాట

మండలం గుడిమాల్కాపూర్‌కు చెందిన రవికుమార్ అనే రైతు నాలుగెకరాల్లో వరి సాగు చేశాడు. మునుపు ఎకరాకు 90 కిలోల చొప్పున యూరియా చల్లేవాడు. ఇప్పుడు 100 కిలోల నుంచి 130 కిలోల వరకు చల్లుతున్నానని చెబుతున్నాడు. యూరియా వేయకపోతే పంట ఏపుగా పెరగడం లేదని, కలుపు మందుల వాడకం వల్ల మొక్క ఎదగకపోతే యూరియాను వాడాల్సి వస్తోందని చెబుతున్నాడు. ఏడాదికి పది కిలోల యూరియా అదనంగా వాడకపోతే పంటకు ఇబ్బందవుతోందని అంటున్నాడు. రైతులు ఎల్లారెడ్డి, రవి కుమారే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా రైతుల్లో ఎక్కువమంది యూరియాను అవసరానికి మించి ఎక్కువగా చల్లుతున్నారు. ఇందుకు వరి సాగు బాగా పెరగడం ఓ కారణం అయితే.. పంటలకు ఎక్కువగా చల్లితే పంట ఏపుగా పెరుగుతుందనే అభిప్రాయంతోనే చాలామంది యూరియాను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం యూరియాకు తీవ్ర కొరత ఏర్పడటంతో రైతులు సింగిల్ విండోలు, ఆగ్రోస్, ప్రైవేటు ఫెర్టిలైజర్ల వద్ద బారులు తీరుతుండటం చూస్తున్నాం. ప్రస్తుతానికి అవసరం లేకున్నా, కావాల్సినప్పుడు దొరుకుతుందో లేదోనన్న ఆందోళనతో కొందరు బడా రైతులు పెద్ద మొత్తంలో యూరియాను స్టాక్‌చేసి పెట్టుకోవడమూ యూరియా కొరత ఏర్పడటానికి ఓ కారణంగా చెబుతున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడేనాటికి రాష్ట్రంలో 23.07 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేసేవారు. ఈ సీజన్‌లో 67.5 లక్షల ఎకరాలకు చేరింది. అంటే 2014 నుంచి రాష్ట్రంలో వరిసాగు పెరుగుతూ వచ్చిందన్నమాట. అదే సమయంలో మిగతా ప్రధాన పంటలైన మొక్కజొన్న, పత్తి సాగును రైతులు తగ్గిస్తున్నారు. 2014-15 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా పత్తి సాగు 41.57 లక్షల ఎకరాల్లో సాగైతే, గత సంవత్సరం 43.48 లక్షల ఎకరాల్లో సాగైంది. మొక్కజొన్న 2024-25 ఖరీఫ్ సీజన్‌లో 5.42 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. మిగతా పంటలైన జొన్న, కంది వంటి పంటల సాగు కూడా పదేళ్లుగా తగ్గుతూ వస్తోంది. ఇందుకు వరిసాగులో యాంత్రీకరణ పెరగడం, కూలీలు తక్కువగా అవసరపడటం, ఫలితంగా పెట్టుబడి భారం తగ్గడమే కారణం. ప్రభుత్వం నిరుటి నుంచి సన్నాలకు బోనస్ రూ. 500 అందిస్తుండటం, ధాన్యం విక్రయాలు మిగతా పంటలతో పోల్చితే వేగంగా, సులభంగా జరగడం మరో కారణంగా చెప్పవచ్చు.

యూరియా అధిక వాడకంతోనూ సమస్యే

పంటల సాగులో యూరియా అధిక వినియోగం వల్ల ముప్పు ఏర్పడుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. యూరియాకు బదులుగా సహజ ఎరువులు, కాంప్లెక్స్ ఎరువులు వాడాలని సూచిస్తున్నాయి. రైతులు పశువుల పెంపకం తగ్గించడంతో సహజ ఎరువుల వినియోగం దాదాపుగా తగ్గిపోయింది. కాంప్లెక్స్ ఎరువులైన డీఏపీ రూ. 1530, 20-20-0-13 రూ. 1350, 28-28-28-0 రూ. 1700, 19-19-19 రూ. 1950, 10-26-26, రూ. 1800, 24-24-0 రూ. 1900ల ధర పలుకుతున్నాయి. వెంటనే పంట ఏపుగా ఎదగడం కోసం రైతులు తక్కువ ధర రూ. 266కే దొరికే యూరియాను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వరిలో సాధారణంగా పోటాష్‌తో కలిపి వేస్తే 60 కేజీల యూరియా, 35 కేజీల పోటాష్ వాడాలి. ఒకవేళ పోటాష్ కలపకపోతే 90 కేజీల వరకు వినియోగించవచ్చు. కానీ 135 కేజీల నుంచి 150 కేజీల వరకు రైతులు పంట చివరి వరకు యూరియాను వినియోగిస్తున్నారు. ఇది సాధారణంగా వాడాల్సిన మోతాదు కంటే దాదాపు రెట్టింపుగా ఉంటోంది. ఇటీవలి కాలంలో కలుపు కూలీలను తగ్గించుకునేందుకు ముందుగానే రైతులు గడ్డి మందు వేయడం పెరిగింది. గడ్డి మందు ప్రభావంతో పంట ఎదగడం ఆలస్యమవుతోంది. ఈ కారణంతో కూడా రైతులు యూరియాను చల్లుతున్నారు. లేకపోతే పంట ఏపుగా పెరగదని చెబుతున్నారు. మిర్చి విషయానికొస్తే ఎకరాకు 65 కేజీల వరకు పంట చివరి వరకు వినియోగించాలి. కానీ దాదాపు 100 కేజీలపైనే ఎకరాకు వాడుతున్నారు.

కాళేశ్వరం కమిషన్ నివేదిక అక్రమం

- జస్టిస్ ఘోష్ నివేదికను కొట్టివేయండి
- కమిషన్ మమ్మల్ని కేవలం సాక్షులుగా పిలిచి తప్పుదోవ పట్టించింది
- హైకోర్టులో కేసీఆర్, హరీశ్ పిటిషన్లు

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్లక్ష్యం, అక్రమాలపై విచారణ కోసం వేసిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక అక్రమమంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. తమ పరువుకు నష్టం కలిగించేలా, ఏకపక్షంగా ఉన్న ఆ నివేదికను కొట్టివేయాలని కోరారు. ఆ నివేదికకు సంబంధించి తమకు ఎలాంటి ప్రతులు, సమాచారం అందలేదని.. కానీ నివేదికలోని అంశాలను సీఎం, మంత్రులు మీడియా సమావేశం నిర్వహించి వెల్లడించారని కోర్టుకు వివరించారు. ఇది దురుద్దేశపూరిత చర్య అని.. తమ పేరు, ప్రతిష్ఠలకు భంగకరమని పేర్కొన్నారు.

బాధ్యులెవరో తేల్చడం కమిషన్ పనికాదు

కాళేశ్వరంపై విచారణ కమిషన్ వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 6 చెల్లదని.. ఎలాంటి అధికార పరిధి లేకుండానే, కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952కు విరుద్ధంగా సదరు జీవో ఇచ్చారని పిటిషన్లలో కేసీఆర్, హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలకు వ్యక్తిగతంగా ఎవరు బాధ్యులో తేల్చాలని జీవోలో ఉందని.. అసలు జ్యుడీషియల్ విచారణ చేసే అధికారం విచారణ కమిషన్లకు ఉండదనే విషయాన్ని పట్టించుకోలేదని కోర్టుకు వివరించారు. గతంలో జరిగిన విషయాలకు ఎవరు బాధ్యులని తేల్చడం విచారణ కమిషన్ అధికార పరిధిలోకి రాదన్నారు.

సాక్షులుగా పిలిచి తప్పుదోవ పట్టించింది

ఆధారాల కోసం కేవలం సాక్షులుగా పిలుస్తున్నామంటూ సమన్లు ఇచ్చిన కమిషన్.. తమపై ఆరోపణలు చేయడం ద్వారా తప్పుదోవ పట్టించిందని కేసీఆర్, హరీశ్‌రావు తమ పిటిషన్లలో పేర్కొన్నారు. కమిషన్ ఇచ్చే నివేదిక ఎవరైనా వ్యక్తిపై ఆరోపణలు చేసేలా, వారి ప్రతిష్ఠకు భంగం కలిగేలా ఉంటే.. కచ్చితంగా సదరు వ్యక్తికి కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం సెక్షన్-8 బీ, సెక్షన్ 8 సీ కింద నోటీసు ఇవ్వాలని కోర్టుకు వివరించారు. పిటిషనర్ల వాదన వినడంతోపాటు సాక్షులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశం ఇవ్వాల్సి ఉంటుందని గుర్తు చేశారు. అలా చేయకపోవడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమన్నారు. కమిషన్ దురుద్దేశం, పక్షపాతంతోనే తమకు నివేదిక ప్రతిని ఇవ్వలేదని.. ఈ కారణంతో సదరు కమిషన్ నివేదిక మొత్తాన్ని కొట్టివేయవచ్చని పేర్కొన్నారు. సదరు నివేదిక న్యాయ సమీక్షకు ఏ విధంగానూ నిలవదని, దానిని కొట్టివేయాలని హైకోర్టును కోరారు.

స్థానిక ఎన్నికల కోసం రాజకీయ నాటకాలు

కమిషన్ నివేదికలో తమకు వ్యతిరేకంగా ఉన్న అంశాలను మీడియా సమావేశం పెట్టి వెల్లడించడం, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇవ్వడం, మీడియాలో ప్రచురించడం ద్వారా ప్రతిష్ఠను దెబ్బ తీయాలనే దురుద్దేశం కనిపిస్తోందని పిటిషన్‌లో కేసీఆర్, హరీశ్‌రావు ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పైచేయి సాధించడం కోసం రాజకీయంగా నాటకాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్లు త్వరలో హైకోర్టు సింగిల్ జడ్జి ఎదుట విచారణకు రానున్నాయి.

ఇందిరమ్మ ఇంటి బిల్లుకు రూ.15 వేలు లంచం
పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

- సూర్యాపేట కలెక్టర్ ఉత్తర్వుల జారీ
- ఉత్తమ్ ఆగ్రహం.. ఏసీబీలో కేసు నమోదుకు ఆదేశం

పాలకవీడు/ ఆమనగల్లు/ తాండూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో లంచం కోసం డిమాండ్ చేసిన ఒక అధికారి, ఇద్దరు ప్రభుత్వోద్యోగులు మంగళవారం ఏసీబీ వలలో చిక్కుకోగా, ఒక పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు గురయ్యారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో ఇందిరమ్మ ఇల్లు పైలట్ గ్రామంగా ఎంపికైన జాన్ పహాడ్‌లో లబ్ధిదారుల్లో పూర్తయిన ఒకరి ఇంటి బిల్లులు మంజూరు చేయడానికి 2 దఫాల్లో రూ.15 వేలు ఇవ్వాలని కార్యదర్శి వెంకయ్య డిమాండ్ చేసిన ఆడియో సోమవారం సోషల్ మీడియాలో వైరలైంది. దీనిపై హౌసింగ్ పీడీ సిద్ధార్థ, డీఈ జబ్బార్ అహ్మద్, పాలకవీడు ఎంపీడీఓ లక్ష్మి మంగళవారం చేపట్టిన విచారణలో పంచాయతీ శివారు కొత్త తండాలో ముగ్గురు లబ్ధిదారుల నుంచి రూ.20 వేల చొప్పున రూ.60 వేలు లంచం తీసుకున్నట్లు గుర్తించారు. వారి నివేదిక మేరకు కార్యదర్శి వెంకయ్యను కలెక్టర్ తేజస్ నందలాల్‌కు మంగళవారం సస్పెండ్ చేయడంతోపాటు గ్రామం వదిలి వెళ్లరాదని ఆదేశించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. సదరు కార్యదర్శిపై ఏసీబీలో కేసు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఇక రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలంలోని ఓ గ్రామ రైతు తన పట్టాదారు పాస్ పుస్తకంలో జెండర్ సవరణకు తహసీల్దార్ సీహెచ్ లలితకు గత నెల 29న రూ.50 వేలు సమర్పించుకున్నా పని కాలేదు. మరోమారు మళ్లీ తహసీల్దార్ సరిత, సర్వేయర్ కోట రవిలను సంప్రదిస్తే చెరో రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు డబ్బు డిమాండ్ చేసిన తహసీల్దార్, సర్వేయర్ ఫోన్ సంభాషణలను రికార్డు చేసి, ఏసీబీ అధికారులకు అందజేశాడు. దీంతో ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ బృందం ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు చేసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ సరిత, సర్వేయర్ రవిలను అరెస్టు చేశారు. వికారాబాద్ జిల్లా తాండూరు మునిసిపాలిటీ పరిధిలో ఒక షెడ్డుకు ఇంటి నంబర్ ఇవ్వడానికి ఈర్షద్ అనే వ్యక్తి నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆర్‌ఐ రమేశ్ రూ.20 వేలు డిమాండ్ చేశాడు. చివరకు రూ.15 వేలకు అంగీకరించాడు. దీనిపై బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారి సూచన మేరకు మంగళవారం రమేశ్‌కు రూ.15 వేలు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇంటి నంబర్ల కేటాయింపునకు డిమాండ్ చేసిన డబ్బులో మునిసిపల్ కమిషనర్‌కూ వాటా ఇవ్వాలని తనతో రమేశ్ చెప్పినట్లు బాధితుడు మీడియాకు చెప్పారు. ఏసీబీ అధికారులు వచ్చే వరకూ కార్యాలయంలోనే ఉన్న మునిసిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి బయటకెళ్లిపోయారు. రికార్డులను పరిశీలించడానికి ఏసీబీ అధికారులు ఫోన్ చేసినా, ఇంటికి పోలీసులను పంపినా అందుబాటులోకి రాలేదు.

కడెంకు కనీస మరమ్మతులు చేయలేదు

- మేం వచ్చాక రూ.9 కోట్లు మంజూరు చేశాం: జూపల్లి

ఖానాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో కడెం ప్రాజెక్టుకు కనీసం మరమ్మతులు చేయలేదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. నాటి పాలకుల తీరుతో వరుసగా రెండేళ్లు జలాశయం వద్ద ఆందోళనకర పరిస్థితులను చూశామని తెలిపారు. కడెంకు భారీ వరదలు వస్తున్న నేపథ్యంలో మంగళవారం జూపల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం జూపల్లి మీడియాతో మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కడెం ప్రాజెక్టు మరమ్మతుల కోసం 9కోట్లు మంజూరు చేశామని తెలిపారు. నేడు ఎంత వరద వచ్చినా గేట్ల ద్వారా సాఫీగా నీరు వెళ్లే పరిస్థితి కల్పించామని చెప్పారు.

కేయెన్స్ పరిశ్రమను కేంద్రం లాక్కుపోయింది!

- సబ్సిడీలు కుమ్మరించి తరలించింది
- బీజేపీని ఏమీ అనలేక కాంగ్రె‌స్‌పై కేటీఆర్ ఏడుపు: దుద్దిళ్ల

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పారిశ్రామిక రంగంపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలన్నీ అవాస్తవాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. కేయెన్స్ సెమీ కండక్టర్ పరిశ్రమ ఇక్కడి నుంచి వెళ్లిపోయిందని అనడం కంటే కేంద్రం, గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వాలు భారీ సబ్సిడీలు కుమ్మరించి లాక్కుపోయాయని చెప్పడం సబబని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేటీఆర్‌కు ఈ వాస్తవాలు తెలిసినా ప్రజలను మభ్యపెట్టడానికి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపుతున్న గురించి బీజేపీని విమర్శించే ధైర్యం లేకనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

తెలంగాణ రెడ్‌కో చైర్మన్‌గా డాక్టర్ శరత్

హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీజీ రెడ్‌కో) చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ.శరత్‌ను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శరత్ ఈ పదవిలో రెండేళ్ల పాటు పని చేయనున్నారు. వేతనాలు, భత్యాలపై ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి ప్రత్యేకంగా ఉత్తర్వులు ఇవ్వనున్నారని జీవోలో పేర్కొన్నారు.

మార్వాడీలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి

- అఖిల భారతీయ అగర్వాల్ మహాసభ

బర్కత్‌పుర, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మార్వాడీలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని అఖిల భారతీయ అగర్వాల్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ డిమాండ్ చేశారు. మార్వాడీ గోబ్యాక్ అంటూ కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీని వల్ల మార్వాడీల్లో అభద్రతా భావం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కాచిగూడలో మహేష్ అగర్వాల్ విలేకరులతో మాట్లాడారు. మార్వాడీలకు భద్రత కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు గవర్నర్, డీజీపీలను కలిసి వినతి పత్రాలు ఇస్తామని తెలిపారు. మార్వాడీలను బెదిరిస్తూ వ్యాపారాలను అడ్డుకుంటున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సామరస్యం ముగిసింది..ఇక సమరమే

- కమిటీల పేరుతో సర్కారు కాలయాపన
- ఇకపై ఎవరితోనూ మాట్లాడేది లేదు
- అక్టోబరు 12న చలో హైదరాబాద్:ఉద్యోగుల జేఏసీ

హైదరాబాద్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో సామరస్యం ముగిసిందని, డిమాండ్ల సాధనకు ఇక సమరమే మిగిలిందని తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యచరణ సమితి(జేఏసీ) పేర్కొంది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు నోటితో పలకరించి.. నొసటితో వెక్కిరించినట్లుగా ఉందని వ్యాఖ్యానించింది. నాంపల్లిలోని టీఎన్‌జీవో కార్యాలయంలో జేఏసీ కార్యనిర్వాహక కమిటీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. అనంతరం జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కమిటీ ప్రతినిధులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికాలంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛనుదారుల సమస్యలపై కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. అందుకే సెప్టెంబరు 8వ తేదీ నుంచి రాష్ట్ర మంతా బస్సు యాత్ర చేపట్టి గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యోగులను కదలిస్తామని చెప్పారు. అక్టోబరు 12న చలో హైదరాబాద్ నిర్వహిస్తామని ప్రకటించారు. తమ సమస్యల పరిష్కారం కోసం 20 నెలలుగా వేచి ఉన్నా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదని తెలిపారు. ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ హక్కుల సాధన కోసం ఇక ఎవరికి భయపడేది లేదని, ఎవరితోనూ మాట్లాడేది లేదని జేఏసీ చైర్మన్ పేర్కొన్నారు. లక్ష మందితో అక్టోబరు 12న సభను విజయవంతం చేస్తామని పింఛనుదారుల సంఘం చైర్మన్ కె.లక్ష్మయ్య తెలిపారు. తమ పైసలు తమకియ్యనప్పుడు జీపీఎఫ్, టీజీఎల్‌ఐ నెలవారీ జమ ప్రభుత్వ ఖాతాలో ఎందుకు జమ చేయాలని జేఏసీ కో చైర్మన్ అంజిరెడ్డి ప్రశ్నించారు.

నియో పోలీస్ లే అవుట్ నుంచి
నేరుగా ఔటర్‌కు

- అందుబాటులోకి ట్రంపెట్ ఫ్లై ఓవర్ ఇంటర్ చేంజ్
- నేడు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం



ట్రంపెట్ ఫ్లై ఓవర్ ఇంటర్ చేంజ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కోకాపేట నియోపోలీస్ లే అవుట్ నుంచి నేరుగా ఔటర్ రింగ్ రోడ్డుపైకి రాకపోకలు సాగించేందుకు వీలుగా హెచ్ఎండీఏ నిర్మించిన ట్రంపెట్ ఫ్లై ఓవర్ ఇంటర్ చేంజ్ అందుబాటులోకి రానుంది. నియో పోలీస్ లే అవుట్ వైపు మూవీ టవర్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఎంట్రీ, ఎగ్జిట్ టోల్‌ప్లాజాలతో గల ట్రంపెట్ ఇంటర్ చేంజ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ నిర్మించిన ఈ ఫ్లై ఓవర్ ద్వారా కేవలం 20 నిమిషాల్లోనే శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోవచ్చు. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న ఈ ఫ్లై ఓవర్ పనులు ఇటీవల హెచ్ఎండీఏ పూర్తి చేసింది. నియోపోలీస్ లే అవుట్‌లో నివాసముండే వారికి మెరుగైన రవాణా సౌకర్యంలో భాగంగా ట్రంపెట్ ఫ్లై ఓవర్‌ను రూ.65 కోట్లతో నిర్మించారు. 1.27 కి.మీ పొడవుతో నాలుగు వరుసలతో ఫ్లై ఓవర్‌ను పూర్తి చేశారు. ఈ ఫ్లై ఓవర్‌పై వెళ్లే వాహనదారులు టోల్‌ఫీజును చెల్లించాల్సి ఉంటుంది.

భద్రాద్రి జిల్లాలో రేపటి సీఎం పర్యటన వాయిదా

చండ్రుగొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటన వాయిదా పడింది. చండ్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి గురువారం ఆయన హాజరుకావాల్సి ఉండగా.. అందుకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే ఉపరాష్ట్రపతి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్తున్న కారణంగా భద్రాద్రి జిల్లా పర్యటన వాయిదా పడినట్టు సభా వేదిక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు తెలిపారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటన కూడా విడుదలైంది. తదుపరి ముఖ్యమంత్రి పర్యటన ఉండే తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపింది. కాగా, దశాబ్దాలుగా తాము ఎదురు చూస్తున్న సొంతింటి కల నెరవేరబోతోందని కొండంత ఆశతో ఉన్న బెండాలపాడు గ్రామంలోని ఆదివాసీలు సీఎం పర్యటన రద్దుతో నిరాశకు గురయ్యారు.

తెలుగువాడిని గెలిపించుకుందాం!

(మొదటిపేజీ తరువాయి)

కోసం కృషి చేయాలంటూ టీడీపీ, బీఆర్ఎస్, వైసీపీ, ఎంఐఎం, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, కేసీఆర్, వైఎస్ జగన్, అసదుద్దీన్ ఒవైసీ, పవన్ కళ్యాణ్‌లకు విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల్లో సుదర్శన్‌రెడ్డికి మద్దతు కూడగట్టాలని వామపక్ష నేతలను కోరారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి మాట్లాడారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం తెలుగు ప్రజల గౌరవ ప్రతిష్ఠలను పెంచిందని చెప్పారు. దేశ రాజకీయాల్లో.. ఎన్నికల్లో నెగ్గడానికి ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం చేస్తున్న ఎన్డీయే ఒక పక్కన ఉంటే.. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ, రాజ్యాంగ బద్ధమైన సంస్థలను పరిరక్షించాలని చూస్తున్న ఇండియా కూటమి మరోపక్కన ఉందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లను రద్దు చేయాలని కుట్రలు చేస్తున్న వారిని ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడించేందుకు ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రకటించడం మనందరికీ గర్వకారణమని చెప్పారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి రాజకీయాలకు అతీతుడని, తెలంగాణ రైతు బిడ్డ, రాజ్యాంగ నిపుణుడని అన్నారు. తెలంగాణ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో జడ్జిగా, ఇతర రాష్ట్రాల్లో చీఫ్ జస్టిస్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించారని గుర్తు చేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఆయన్ను గెలిపించాల్సిన బాధ్యత ప్రతి తెలుగు వాడిపైన ఉందని చెప్పారు.

ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

రాజ్యాంగ పరిరక్షణ కోసం న్యాయ కోవిదుడైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతి చేయాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీల నాయకత్వాలు రాజకీయాలకు అతీతంగా ఆయనకు



మద్దతు ఇవ్వాలని ఇండియా కూటమి, తెలంగాణ ప్రభుత్వం తరపున కోరుతున్నానన్నారు. తెలుగు రాష్ట్రం నుంచి పీవీ నర్సింహారావు ప్రధాని అయినప్పుడు.. నంద్యాల లోక్‌సభకు జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన్ను గెలిపించేందుకు అప్పటి ప్రధాన ప్రతిపక్ష నేత, టీడీపీ అధినేత ఎన్టీఆర్ ముందుకు వచ్చారని గుర్తు చేశారు. తెలుగువాడైన పీవీ ప్రధాని కావడం తెలుగువారందరికీ గర్వకారణమని చెప్పిన ఆయన.. ఉప ఎన్నికల్లో టీడీపీ తరఫున అభ్యర్థిని పోటీకి పెట్టలేదని చెప్పారు. సిద్ధాంతపరంగా వైరుధ్యం ఉన్నా పీవీకి సంపూర్ణ మద్దతు పలికి ఆయన గెలుపునకు సహకరించి.. రాజకీయంగా విజ్ఞత ప్రదర్శించారని గుర్తు చేశారు. ఉప రాష్ట్రపతిగా సుదర్శన్‌రెడ్డి గెలిస్తే.. రేపటి రోజున ఆయన రాష్ట్రపతి అయ్యేందుకూ అవకాశం ఉంటుందన్నారు. అందరూ ఏకమై ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకుని.. సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయ కోవిదుడైన సుదర్శన్ రెడ్డి ఉపరాష్ట్రపతిగా ఉంటే ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉంటుందని, అంతిమంగా దేశానికి మేలు జరుగుతుందని చెప్పారు.

బీసీలకు 42% రిజర్వేషన్ వస్తుంది

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో సుదర్శన్‌రెడ్డి గెలిస్తే విద్య, ఉద్యోగాలు, ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్.. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలని చూస్తున్న, విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను అడ్డుకుంటున్న ప్రధాని మోదీకి ప్రతినిధి అని చెప్పారు. ఎన్డీయే అభ్యర్థి గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేసే ప్రక్రియ వేగంగా అమలవుతుందన్నారు. ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి బలహీన వర్గాల బలమైన గొంతుకన్నారు. రాష్ట్రంలో కులగణన సర్వే నిర్వహించిన తర్వాత ఏర్పాటు చేసిన స్వతంత్ర నిపుణుల కమిటీకి సుదర్శన్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరించారని గుర్తు చేశారు. చైర్మన్‌గా ఆయన సూచన మేరకే విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాధాకృష్ణ గెలిస్తే ఓబీసీలకు అన్యాయం జరుగుతుందని, సుదర్శన్‌రెడ్డి గెలిస్తే 42% రిజర్వేషన్ వస్తుందని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశంలోని అందరూ ఆత్మప్రభోధానుసారం ఓటేయాలని సూచన చేశారు. ఈనెల 21న సుదర్శన్‌రెడ్డి నామినేషన్ ప్రక్రియ పూర్తవుతుంద చెప్పారు.

మోదీ అంటే బీఆర్ఎస్‌కు భయమా?

రాష్ట్రంలోని రైతుల అవసరాల మేరకు యూరియాను సరఫరా చేయాలంటూ లేఖలు, విజ్ఞప్తుల రూపంలో కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం పదే పదే కోరినా స్పందన లేకపోవడం దారుణమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే రైతులకోసం మోదీ సర్కారుపై ఒత్తిడి తెచ్చేందుకు తమతో కలిసి రావాల్సిన బీఆర్ఎస్ ఎంపీలు.. పార్లమెంటులో పత్తా లేరన్నారు. గల్లీలో లొల్లి చేసేందుకు ఉత్సాహం చూపేవాళ్లు.. ఢిల్లీలో మోదీని ప్రశ్నించేందుకు ఎందుకు భయపడుతున్నారంటూ నిలదీశారు. రాష్ట్ర రైతాంగానికి అండగా నిలవాల్సిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు మోదీ భజనలో బిజీగా ఉన్నారని ధ్వజమెత్తారు. నిర్లక్ష్య, వివక్ష పూరిత వైఖరిని ప్రదర్శిస్తోన్న కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఎండగట్టిన, పార్లమెంటు వేదికగా తెలంగాణ రైతుల పక్షాన నిలిచిన ప్రియాంకగాంధీకి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని పేర్కొన్నారు.

సుప్రీం నిర్ణయం ఆలస్యమైతే పార్టీ పరంగా రిజర్వేషన్లు

ప్రభుత్వ బిల్లులపై గవర్నర్/రాష్ట్రపతి 90 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు గడువు పెట్టిన నేపథ్యంలో.. కోర్టు తుది నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు సంబంధించి తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులు రాష్ట్రపతి వద్ద, పంచాయతీరాజ్ చట్ట సవరణ ఆర్డినెన్సు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న సంగతిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కోర్టు తుది నిర్ణయం ఆలస్యమైతే పార్టీల పరంగా బీసీలకు 42% టికెట్లు ఇద్దామని ప్రతిపాదించి ఎన్నికలకు వెళ్లడమే ప్రత్యామ్నాయమని చెప్పారు. ఈ నెల 23న జరిగే టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ భేటీలో ఏం చేయాలా అన్న దానిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మంగళవారం తన నివాసంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణ కోసమే సుదర్శన్‌రెడ్డిని ఉప రాష్ట్రపతి ఎన్నికల అభ్యర్థిగా ఇండియా కూటమి ఎంపిక చేసిందని, ఇందులో తన పాత్ర ఏమీ లేదన్నారు. సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో తాను పాల్గొంటానని చెప్పారు. సుదర్శన్‌రెడ్డికి మద్దతు కోసం కేసీఆర్‌ను కలుస్తారా అన్న ప్రశ్నకు అధిష్ఠానం ఏం ఆదేశిస్తే అది చేస్తానన్నారు. ఆయనకు తన ముఖం చూడడం ఇష్టం ఉందో.. లేదోనని అనుమానం వ్యక్తం చేశారు. తాను శాంపిల్ కోసం ఏ స్కీమ్‌లూ పెట్టబోనని, పెట్టిన పథకం గ్రౌండ్ దాకా వెళ్లేలా చూస్తున్నామని చెప్పారు. అడిగిన వాళ్లందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు ఇస్తున్నామని తెలిపారు.

సింగరేణికి
గోల్డెన్ చాన్స్

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించింది. ఇందులో సింగరేణి సంస్థ పాలుపంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో అన్వేషణకు అనువైన బ్లాక్‌లపై సింగరేణి.. నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసి అధ్యయనం జరిపించింది. మధ్యప్రదేశ్‌లోని పదార్‌లో ఉన్న ప్లాటినమ్ గ్రూప్ ఎలిమెంట్స్ బ్లాక్, ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రగిరి వద్ద ఉన్న ఒంటిల్లులోని రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ బ్లాక్, కర్ణాటకలోని బంగారం, రాగి బ్లాకులు తమకు అనువైనవని సింగరేణి అధికారులు గుర్తించారు. వీటి కోసం ఈ నెల 13, 14, 19 తేదీల్లో కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో నిర్వహించిన వేలంలో సింగరేణి కూడా పాల్గొంది. కర్ణాటకలోని దేవదుర్గ్‌లో ఉన్న బంగారం, రాగి బ్లాక్‌ల అన్వేషణ లైసెన్స్‌ను దక్కించుకుంది. కాగా, కర్ణాటక దేవదుర్గ్‌లో బంగారం, రాగి నిక్షేపాలు ఉన్న ప్రాంతంలో సింగరేణి అన్వేషణ జరిపి, తుది ఫలితాలను కేంద్రానికి నివేదిక రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం ఆ గనుల్లో తవ్వకాల కోసం కేంద్రం వేలం నిర్వహిస్తుంది. సదరు వేలంలో సింగరేణి కూడా పాల్గొనే అవకాశం ఉంది. వేలంలో గనులను దక్కించుకున్న సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలో 37.75 శాతాన్ని ఆ గని జీవిత కాలం పాటు సింగరేణికి చెల్లించాల్సి ఉంటుంది.

వ్యవసాయ కుటుంబంలో జన్మించి..
ఉప రాష్ట్రపతి అభ్యర్థి స్థాయికి

- రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారం నుంచి సుప్రీంకోర్టు జడ్జి దాకా
- అంచెలంచెలుగా ఎదిగిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి
- పలు కీలక కేసుల్లో సంచలన తీర్పులు

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వ్యక్తిగత సమాచారం

పుట్టిన తేదీ: 1946 జూలై 8
పుట్టిన స్థలం: రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం, ఆకులమైలారం గ్రామం
తల్లిదండ్రులు: భూచిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, అనసూయమ్మ
భార్య: పద్మారెడ్డి
కుమారులు: బి.శశిధర్‌రెడ్డి, బి.వంశీదర్‌రెడ్డి
కూతురు: సుమిత



హైదరాబాద్/కందుకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారత ఉప రాష్ట్రపతి పదవికి ఇండియా కూటమి తరఫున అభ్యర్థిగా ఎంపికైన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మధ్యతరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ఆకుల మైలారం గ్రామంలో 1946 జూలై 8న జన్మించిన భూచిరెడ్డి సుదర్శన్‌రెడ్డి విద్యాభ్యాసం హైదరాబాద్‌లో కొనసాగింది. 1971లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పట్టా పొందారు. అదే ఏడాది డిసెంబరు 27న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో సభ్యుడయ్యారు. 1988 ఆగస్టు 8న ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రభుత్వ ప్లీడరుగా సుదర్శన్‌రెడ్డి నియమితులయ్యారు. రిట్ పిటిషన్లు, సివిల్ తగాదాల కేసుల్లో వాదనలు వినిపించారు. 1990లో కేంద్ర ప్రభుత్వంలో అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులై ఆరు నెలలపాటు పని చేశారు. 1993లో ఉమ్మడి ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి న్యాయ సలహాదారుగా వ్యవహరించారు. అదే ఏడాది ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 1995 మే 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. 2005లో పదోన్నతిపై గువాహటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 2007లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. నాలుగున్నరేళ్లపాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. 2011 జూలై 8న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసిన అనంతరం గోవాకు మొట్టమొదటి లోకాయుక్త చైర్మన్‌గా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పనిచేశారు. 2024 డిసెంబరులో హైదరాబాద్ అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ) శాశ్వత ట్రస్టీగా బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన సమయంలో పలు కీలక కేసుల్లో సంచలన తీర్పులు ఇచ్చారు. నల్లధనం కేసులపై కేంద్ర ప్రభుత్వ అలసత్వాన్ని విమర్శిస్తూ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే సల్వా జుడుం (మావోయిస్టులపై చర్యల కోసం గిరిజన యువకులను నియమించడం) చట్టవిరుద్ధమని తీర్పు ఇచ్చారు. ప్రజాసంఘాలతో మంచి సంబంధాలున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడంతో ఈ ప్రాంత ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ఇండియా' అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వయంగా ప్రతిపాదించారు. ఇండియా కూటమి నేతలందరూ ముక్తకంఠంతో మద్దతు తెలిపారు. సమావేశంలో ఎన్సీపీ నేత శరద్ పవార్, శివసేన-యూబీటీ నేతలు అరవింద్ సావంత్, సంజయ్ రావత్, తృణమూల్ నేత డెరెక్ ఓ బ్రెయిన్, డీఎంకే నేతలు కనిమొళి, తిరుచ్చి శివ, సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్‌తో పాటు కాంగ్రెస్ ఎంపీలు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, ప్రమోద్ తివారీ పాల్గొన్నారు. సమావేశం బయట ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున సంజయ్ సింగ్ కూడా మద్దతును ప్రకటించారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివిధ ప్రతిపక్ష పార్టీ నేతల సమక్షంలో సుదర్శన్‌రెడ్డి పేరును ప్రకటించారు. జసిస్ సుదర్శన్ రెడ్డి దేశంలో అత్యంత ప్రముఖ న్యాయ నిపుణుడని, ప్రగతిశీల భావాలు కలిగిన ఆయన ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కీలకమైన సేవలు అందించారని తెలిపారు. ఆయన నిరంతరం సామాజిక ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం పోరాడారని చెప్పారు. ఉప రాష్ట్రపతి ఎన్నికను ఒక సైద్ధాంతిక పోరుగా ఖర్గే అభివర్ణించారు. దేశ స్వాతంత్రోద్యమ విలువలు రాజ్యాంగంలోని ప్రజాస్వామిక స్ఫూర్తికి ప్రతీకగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి నిలిచినందువల్లే ఆయనను ప్రతిపక్షాలు ఉమ్మడి అభ్యర్థిగా ఎంచుకున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఈ విలువలపై దాడి జరుగుతోందని, అందుకే ఈ ఎన్నికల్లో కలిసికట్టుగా, పట్టుదలతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 21న ఆయన నామినేషన్ దాఖలు చేస్తారని ఖర్గే తెలిపారు.

రేవంత్ కీలక పాత్ర

ఇండియా కూటమి సోమవారం అభ్యర్థి ఎంపికపై సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ ఒక నిర్ణయానికి రాలేక పోయింది. దక్షిణాది నుంచే అభ్యర్థిని ఎంపిక చేయాలని అందరూ నిర్ణయించినప్పటికీ ఏ పార్టీ పేరును ప్రతిపాదించలేకపోయింది. డీఎంకే నేత తిరుచ్చి శివతో పాటు పలువురు పేర్లను చర్చించారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ నుంచి పలు పేర్లు చర్చకు వచ్చాయి. తెలంగాణ ప్రస్తావన వచ్చినపుడు ఖర్గే.. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడినట్లు తెలిసింది. ఇరువురూ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరుపై చర్చించారు. ఆయనను ఒప్పించే బాధ్యతను రేవంత్‌కే అప్పగించారు. సోమవారం సాయంత్రం రేవంత్‌రెడ్డి జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో చర్చించి ఆయనను ఒప్పించారని, ఆయన ఓకే అన్న తర్వాత ఖర్గేకు ఆ విషయం తెలిపారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మంగళవారం వివిధ పార్టీల నేతలతో అనధికారికంగా చర్చించినపుడు వారు కాంగ్రె స్ ప్రతిపాదనకు వెంటనే అంగీకరించారు. బీసీ కులగణన సర్వేను అధ్యయనం చేయడానికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో స్వతంత్ర కమిటీని నియమించిన నేపథ్యంలో రాహుల్ గాంధీ, ఖర్గే గతంలో ఆయనతో మాట్లాడారు. రాహుల్ రాష్ట్ర పర్యటనకు వచ్చినపుడు కూడా సుదర్శన్‌రెడ్డి ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యమైన తటస్థులైన వారి పేర్లు చర్చించినపుడు తెలంగాణ నుంచి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరు ప్ర ముఖంగా ప్రస్తావనకు వచ్చింది. బీజేపీ భావజాలాన్ని బలంగా వ్యతిరేకిస్తున్న మేధావి మాత్రమే కాక సామాజిక న్యాయానికి తోడ్పడుతున్న వ్యక్తిగా సుదర్శన్‌రెడ్డి కంటే మంచి అభ్యర్థి లభించరని కాంగ్రెస్ అధిష్ఠానం అభిప్రాయపడింది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఖర్గే స్వయం గా ఫోన్ చేసి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఢిల్లీకి వెంటనే రమ్మని అభ్యర్థించారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న సుదర్శన్‌రెడ్డికి పలువురు ఇండియా కూటమి ఎంపీలు స్వాగతం చె ప్పారు. వారిలో కాంగ్రెస్ ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లురవి తదితరులు ఉన్నారు బుధవారం ఇండియా కూటమి ఎంపీల భేటీలో సుదర్శన్‌రెడ్డిని పరిచయం చేస్తారు. గురువారం సుదర్శన్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్ కూడా హాజరవుతారు.

ఆయిల్‌పాం పరిశోధన
కేంద్రానికి నిరాకరణ

- పార్లమెంట్‌లో కేంద్రం స్పష్టం

న్యూఢిల్లీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రత్యేకంగా ఆయిల్‌పాం పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను కేంద్రం అంగీకరించలేదు. ఈ విషయాన్ని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ (ఐఐవోపీఆర్) దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణ రైతులకు అవసరమైన సహాయాన్ని అందిస్తోందని, అందువల్ల మరో కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని కేంద్రం పేర్కొంది. అయితే, ఈ ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో 50 వేల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేసే లక్ష్యానికి కేంద్రం సహకరిస్తుందని మంత్రి తెలిపారు.

మెదక్‌లో రూ.1,775 కోట్లతో లాజిస్టిక్స్ పార్కు

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పార్కిబండలో రూ. 1,775 కోట్లతో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు (ఎంఎంఎల్‌పీ) ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ వెల్లడించారు.. మంగళవారం లోక్‌సభలో ఎంపీ బలరాం నాయక్ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.



నాగర్‌కర్నూల్ జిల్లాలో దుందుభి నది పొంగి ప్రవహిస్తుండడంతో కోతకు గురైన రహదారి



నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం మీరాబాయి తండా వద్ద కొట్టుకుపోయిన రోడ్డు

రహదారులు.. అతలాకుతలం!

ఇటీవలి వర్షాలకు ధ్వంసమైన రోడ్లు.. కొన్ని చోట్ల కొట్టుకుపోయిన పరిస్థితి

- వాగుల్లో వరద ఉధృతికి దెబ్బతిన్న కల్వర్టులు
- గ్రామీణ ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం చెరువుపల్లి-కేశవాపురం మధ్య ఉన్న వాగులో వరద ఉధృతికి కల్వర్టు కొట్టుకుపోయింది.. వనపర్తి జిల్లా నుంచి మదనాపూర్ మండలంలో ఊకచెట్టు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.. కుమరం భీం జిల్లా చింతలమానేపల్లి మండలంలో గూడెం కోయపల్లి రోడ్డు నామరూపాల్లేకుండా పోయింది. ఇలా.. ఒకటి, రెండూ కాదు.. రాష్ట్రంలో వందలాది రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో వంతెనలు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. దీంతో వందలాది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోగా.. ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలోని చెరువుపల్లి-కేశవాపురం రోడ్డు మధ్య ఏటి వాగు వరద ఉధృతికి కల్వర్టు కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. శాలిగౌరారం-కట్టంగూరు రోడ్డు 20 కిలోమీటర్ల మేర గుంతలమయమై వాహనాలు నడపడానికి వీల్లేకుండా ఉంది. చందంపేట మండలం చందంపేట-పొగిళ్ల రోడ్డు సుమారు 40కిలోమీటర్ల మేర గుంతలు పడడంతో అధ్వానంగా తయారైంది. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం-బొల్లెపల్లి, రుద్రవల్లి-జూలూరు లోలెవల్ వంతెనల పై నుంచి మూసీ పరవళ్లు తొక్కుతోంది. దీంతో మూసీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం మీరాబాయి తాండా వద్ద వరద ఉధృతికి బ్రిడ్జి పక్కన ఉన్న రోడ్డు కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బోధన్ డివిజన్‌లోని కోటగిరి, వర్ని, పోతంగల్, రుద్రూర్, బోధన్ ప్రాంతంలో వర్షాల వల్ల చాలా ప్రాంతాల్లో రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 103.32 కిలోమీటర్ల రోడ్లు కోతకు గురయ్యాయి. 58 కల్వర్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నిర్మల్ జిల్లాలో 4 వంతెనలు, 87 కిలో మీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.77 లక్షలు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మహబూబ్‌నగర్- హైదరాబాద్ జాతీయ రహదారిలో అప్పన్నపల్లి ఫ్లైఓవర్‌పై పలు చోట్ల గుంతలు పడడంతో ప్రమాదభరితంగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లా ఊట్కూర్ మండలం పగిడిమర్రి బ్రిడ్జిపై నుంచి నీరు పారుతుండడంతో అమీన్‌పూర్, ఓబ్లాపూర్, సామనూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భూనేడ్- మద్దూర్ మధ్య వాగు వంతెన మీదుగా పారుతోంది. భూనేడ్- కొత్తపల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో రాకపోకలు స్తంభించాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ వద్ద దుందుభి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కల్వకుర్తికి వెళ్లే రహదారి కోతకు గురైంది. వంగూరు గేటు సమీపంలో కేఎల్ఐ కాల్వకు గండి పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వనపర్తి జిల్లాలోని సరళాసాగర్ ఆటోమెటిక్ సైఫన్లు తెరుచుకోవడంతో ఊక చెట్టు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మదనాపూర్, ఆత్మకూరు మధ్యనున్న బ్రిడ్జి మీద రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాల జిల్లాలో 3.12 కిలోమీటర్ల మేర రోడ్లు, 5చోట్ల కాజ్‌వేలు కోతకు గురయ్యాయి. మరమ్మతులకు 35.5లక్షలు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఆసిఫాబాద్ జిల్లాలో మాలన్‌గోంది వద్ద కల్వర్టు కోతకు గురైంది. రాజూరా , బూర్గుడ గ్రామాల మధ్య కల్వర్టు కోతకు గురికావడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. పెంచికల్‌పేట-బెజ్జూరు మధ్య రోడ్డు గుంతలమయంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 24 రోడ్లు దెబ్బతిన్నాయని అధికారులు వెల్లడించారు.



నల్లగొండ జిల్లాలో అధ్వానంగా మారిన శాలిగౌరారం- కట్టంగూరు రోడ్డు



మహబూబ్‌నగర్ జిల్లా భూనేడ్-కొత్తపల్లి మధ్య నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి దగ్గర నీటి ప్రవాహంతో నిలిచిన రాకపోకలు

గోదావరి, కృష్ణ.. ఉగ్రరూపం!

(మొదటిపేజీ తరువాయి)



కమలాపురంలోని ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి నీటిమట్టం 8.30 మీటర్లకు చేరడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అపమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇక, ఎగువన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 1.75లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 39 గేట్లను ఎత్తి 2.75లక్షల క్యూసెక్కులను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి బుధవారం నాటికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి (43అడుగులకు) చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో కృష్ణ, భీమా, తుంగభద్ర నదులకు వరద పెరుగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు అత్యధికంగా 3.90లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చి చేరుతోంది. దీంతో పది గేట్లను 14అడుగుల మేర ఎత్తి 3,44,750 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 65,436 క్యూసెక్కులను వదులుతున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు 4,10,186 క్యూసెక్కుల వరద వస్తుండగా, 26 గేట్లు ఎత్తి అంతే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో మంగళవారం కూడా భారీ వర్షం కురిసింది. భూపాలపల్లి జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో సింగరేణి ఓసీ-2, ఓసీ-3లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. వందలాది ఎకరాల్లో పత్తి పంట నీట మునిగింది. కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే మహాముత్తారం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. టేకులగూడెం వద్ద భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ రహదారిపైకి వరద పోటెత్తింది. దీంతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దపల్లి జిల్లాలో గోదావరి ప్రవాహం పెరుగుతుండడంతో తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లోనూ 47,743 టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. మంజీరా ఉధృతితో ఆరో రోజూ వన దుర్గ మాత ఆలయం జలదిగ్బంధంలోనే ఉంది. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్, పటాన్‌చెరు, హత్నూర, పుల్కల్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని దిలాల్‌పూర్ వద్ద కెనాల్ కట్ట తెగిపోయింది. భువనగిరికి చెందిన మత్స్యకార్మికుడు వెంకటేశ్(40), తాజ్‌పూర్‌కు చెందిన జహంగీర్(52) చిన్నేటి వాగులో చేపలు పడుతుండగా, వరద ఉధృతికి కొట్టుకుపోయి.. మృతి చెందారు.

నేడు 4 జిల్లాల్లో భారీ వర్షాలు

రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో బుధవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, 24 గంటల్లో ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 18.9సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది.

డీఎస్‌ఆర్ గ్రూపు సంస్థల్లో ఐటీ సోదాలు

- హైదరాబాద్, బెంగళూరులో 27చోట్ల మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి ఇంట్లో కూడా సోదాలు
- శ్రీనివాసా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలోనూ సోదాలు
- ఏపీ లిక్కర్ స్కాంతో లింకులు

హైదరాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ డీఎస్‌ఆర్ గ్రూపు కంపెనీల్లో ఆదాయ పన్ను శాఖాధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరులో 27 చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. మాజీ ఎంపీ రంజిత్ రెడ్డికి డీఎస్‌ఆర్ గ్రూపుతో వ్యాపార భాగస్వామ్యం ఉందన్న నేపథ్యంలో ఆయన ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. డీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్, డీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, డీఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్, డీఎస్‌ఆర్ ప్రైమ్, డీఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయాల్లో జరిగిన ఈ సోదాల్లో అధికారులు పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్‌ఆర్ కంపెనీల డైరెక్టర్ల ఇళ్లు, ప్రాజెక్టు సైట్లలో కూడా సోదాలు చేశారు. డీఎస్‌ఆర్ స్కై వన్, డీఎస్‌ఆర్ వరల్డ్ వెంచర్లలో అమ్మకాలకు సంబంధించి పలు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. వీటిలో చదరపు అడుగు రూ.12 వేల నుంచి రూ.13 వేలకు అమ్మగా, రిజిస్ట్రేషన్లు మాత్రం రూ.7 వేల చొప్పునే జరిగాయన్న ఫిర్యాదులపై ఐటీ అధికారులు ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. డీఎస్‌ఆర్ గ్రూపు సంస్థలు ఒక్కో చదరపు అడుగుకు ఐదారు వేలు నగదు రూపంలో సేకరించాయన్న ఆరోపణలకు సంబంధించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి సైతం డీఎస్‌ఆర్ గ్రూపు అమ్మకాలకు సంబంధించి వివరాలు సేకరించిన తర్వాతే ఐటీ అధికారులు సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. డీఎస్‌ఆర్ గ్రూపు ఎండీ దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీ ప్రభాకర్ రెడ్డి, సీఈవో సత్యనారాయణ రెడ్డి తదితరుల ఇళ్లల్లోనూ సోదాలు నిర్వహించారు. పన్ను ఎగవేతకు సంబంధించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, ఐటీ అధికారులు శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలో కూడా సోదాలు నిర్వహించారు. ఈ సంస్థ భాగస్వామి అయిన వెంకట కృష్ణారెడ్డికి డీఎస్‌ఆర్ సంస్థతో వ్యాపార సంబంధాలు ఉన్న నేపథ్యంలో సోదాలు చర్చనీయాంశమయ్యాయి. గతంలో ఏపీ మద్యం కుంభకోణంలో శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్‌పై ఆరోపణలు వచ్చాయి. రాజ్ కసిరెడ్డి.. ఈ సంస్థ ద్వారా ఏపీ లిక్కర్ స్కాంలో వచ్చిన డబ్బును దారి మళ్లించినట్టు సీఐడీ ఇప్పటికే గుర్తించింది. ఈ క్రమంలో ఐటీ సోదాలు మరో 24 గంటల పాటు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వరదల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం

- సాగు అవసరాలను పరిగణనలోకి తీసుకోండి
- సమీక్షలో ఇంజనీర్లకు మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం



హైదరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల కింద పంటల సాగుకు అనువైన పరిస్థితులున్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. వరదల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమన్నారు. వరదల నిర్వహణ, సాగునీటి సరఫరా.. ఈ రెండింటికీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జలసౌధలో మంగళవారం ఈఎన్‌సీలతోపాటు క్షేత్ర స్థాయి సీఈలు, ఎస్ఈలు, ఈఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. జలాశయాల వద్ద నిరంతరం వరదలను పర్యవేక్షిస్తూ వరద ముప్పును ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో ఉండాలని ఆదేశించారు. ఈవిషయంలో నీటి పారుదల, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.ప్రస్తుత ఖరీఫ్, వచ్చే రబీ పంటల అవసరాలను దృష్టిలో పెట్టుకొని, గోదావరి జలాలను ఒడిసిపట్టుకోవాలని సూచించారు.గరిష్ఠ సామర్థ్యంతో పంప్‌హౌస్‌ల ద్వారా నీళ్లను ఎత్తిపోయాలని ఆదేశించారు. ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్, మిడ్‌మానేరు ప్రాజెక్టులను బుధవారం తానే స్వయంగా పరిశీలిస్తానని వెల్లడించారు. రాష్ట్రంలో 34,740 చెరువులు ఉండగా, 12,023 చెరువులు పూర్తిగా నిండాయని, 9,100 చెరువులు 75శాతం వరకు నిండాయన్నారు. 177 చెరువులు, కాల్వలు, ఎత్తిపోతల పథకాలకు గండ్లు పడినట్లు క్షేత్ర స్థాయి నుంచి నివేదికలు అందాయన్నారు. రూ.335కోట్లతో చేపట్టిన పునరుద్ధరణ పనులను వేగిరం చేయాలని సూచించారు. చెరువుల కింద పూర్తి ఆయకట్టుకు సాగునీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

75 టన్నుల పేలోడ్‌ను రోదసిలో ప్రవేశపెట్టేందుకు

40 అంతస్తులంత ఎత్తైన రాకెట్ నిర్మిస్తున్నాం

ఓయూ స్నాతకోత్సవంలో ఇస్రో ఛైర్మన్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దాదాపు 75 వేల కిలోల పేలోడ్‌ను దిగువ భూకక్ష్యలో ప్రవేశపెట్టడం కోసం.. 40 అంతస్తులంత ఎత్తైన రాకెట్‌ను నిర్మిస్తున్నామని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. అలాగే.. 2035 నాటికి 52 టన్నుల అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించనున్నామని.. వీనస్ ఆర్బిటర్ మిషన్‌పై కూడా ఇస్రో కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు. మంగళవారం ఇక్కడ నిర్వహించిన ఉస్మానియా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో పలు అంశాలపై మాట్లాడారు. భారత అంతరిక్ష రంగ పరిశోధనలు అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా సాగుతున్నాయని తెలిపారు. భారతదేశపు తొలి ఉపగ్రహం ఆర్యభట్టను 1975లో ఇతర దేశాల సహకారంతో ప్రయోగించామని.. అప్పట్నుంచీ ఇప్పటిదాకా.. 6000 కిలోల హై-త్రూపుట్ జీశాట్-11 సహా 133 ఉపగ్రహాలను ప్రయోగించామని గుర్తుచేశారు. ఈ సందర్భంగానే ఆయన.. ఇస్రో ప్రస్తుతం తయారుచేస్తున్న భారీ రాకెట్ గురించి ప్రస్తావించారు. కలాం సమయంలో కేవలం 35 కేజీల శాటిలైట్‌ను దిగువ భూకక్ష్యలో ప్రవేశ పెట్టేందుకు 17 టన్నుల రాకెట్ ప్రయోగించాల్సి వచ్చిందని.. నేడు 40 అంతస్తుల ఎత్తుతో, 75 టన్నుల పేలోడ్‌ను తీసుకువెళ్లగలిగే సామర్థ్యం కలిగిన రాకెట్ తయారుచేస్తున్నామని వెల్లడించారు. దాంతోపాటు నావిక్ శాటిలైట్, ఎన్1 రాకెట్ ప్రయోగం తదితర పలు ప్రాజెక్టులపై పనిచేస్తున్నట్టు తెలిపారు. మన రాకెట్లను వినియోగించి అమెరికాకు చెందిన 6500 కేజీల కమ్యూనికేషన్ శాటిలైట్‌ను పంపనున్నట్లు చెప్పారు. భారతీయ రక్షణ రంగ అవసరాల కోసం టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ శాటిలైట్ (టీడీఎస్), మన నౌకాదళం కోసం ప్రత్యేకంగా రూపొందించిన భారతీయ సైనిక సమాచార ఉపగ్రహం జీశాట్ -7 ఆర్ వంటివాటిని ఈ సంవత్సరం ప్రయోగించనున్నామన్నారు. ప్రస్తుతం భారతదేశానికి చెందిన 55 ఉపగ్రహాలు కక్ష్యలో తిరుగుతున్నాయని తెలిపిన ఆయన.. మరో మూడు నాలుగు సంవత్సరాల్లో ఈ సంఖ్య మూడు రెట్ల మేర పెరగనుందన్నారు. యాక్సియం-4 మిషన్ ద్వారా వాయుసేన పైలట్ శుభాన్షు శుక్లా సంపాదించిన అనుభవం.. మన గగన్‌యాన్ కార్యక్రమానికి ఎంతగానో తోడ్పడనుందని నారాయణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ కోరినట్లుగా భవిష్యత్‌లో 40-50 మంది వ్యోమగాములను తీర్చిదిద్దగలమని ఆయన పేర్కొన్నారు.



ఓయూ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో ఛైర్మన్ నారాయణన్

మార్గదర్శకులుగా ఉస్మానియన్లు

- ఓయూ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఇస్రో ఛైర్మన్ నారాయణన్‌కు గౌరవ డాక్టరేట్
- డాక్టరేట్ అందుకున్న ఎమ్మెల్సీ దయాకర్

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా వర్సిటీ పూర్వ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా మార్గదర్శకులుగా ఉన్నారని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. ఓయూ 84వ స్నాతకోత్సవం మంగళవారం వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో ఛైర్మన్ వీ నారాయణన్‌కు ఓయూ గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పట్టాలు పొందిన విద్యార్థులు భవిష్యత్తులో తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి 58 మంది విద్యార్థులకు, 2023-24కు 63 మందికి గవర్నర్, ఇస్రో ఛైర్మన్, వీసీ కుమార్ మొలుగరం బంగారు పతకాలు ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసిన 1261 మంది పరిశోధకులు పట్టాలు అందుకున్నారు. 108 ఏళ్ల ఓయూ చరిత్రలో మొదటిసారిగా రాష్ట్ర గవర్నర్ పేరుతో గిరిజన విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన అంగ్లంలో పీహెచ్‌డీ డిగ్రీని కొర్ర పాలెంకోకు అందజేశారు. కళాశాల విద్య కమిషనర్ దేవసేన తన తండ్రి ప్రొఫెసర్ సముద్రాల సత్యనారాయణమూర్తి స్మారక బంగారు పతకాన్ని ఎంబీఏ(ఫైనాన్స్)లో డాక్టర్ చిన్నారికి అందజేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిపాలన వ్యవహారాలు, వాస్తవ పరిస్థితులపై పరిశోధనకు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ డాక్టరేట్ అందుకున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.